

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 127

శుక్రవారం 28-7-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




సులువైన లక్ష్యాన్ని కష్టంగా...

తొలి వన్డేలో వెస్టిండీస్‌పై ఐదు వికెట్లతో భారత్ విజయం -15లో



జస్టిస్ సామ్ కోషి ప్రమాణం

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కోషి బాధ్యతలు చేపట్టారు -3లో



సభలో అదే అలజడి

మణిపూర్ హింసాకాండపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసన కొనసాగుతోంది. విపక్ష ఎంపీలు తమ డిమాండ్‌పై వెనక్కి తగ్గడం లేదు.

వివరాలు 6లో ▸



వేడుకల్లో పాటలు కాపీరైట్ కాదు

వివాహ వేడుకలు, ఇతర శుభకార్యాల్లో సినిమా పాటలను ప్లే చేయడం కాపీరైట్ చట్టం ఉల్లంఘన కిందకు రాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



నీట మునిగిన హనుమకొండలోని గోపాల్‌పూర్ ప్రాంతం



హైదరాబాద్ మూసారాంబాగ్ వద్ద వరద పరిస్థితిపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

64.9 సెం.మీ. ములుగు జిల్లా లక్ష్మీదేవిపేట | **61.65** సెం.మీ. భూపాలపల్లి జిల్లా చిట్యాల | **47.5** సెం.మీ. భూపాలపల్లి జిల్లా చెల్పూరు | **46.7** సెం.మీ. భూపాలపల్లి జిల్లా రేగొండ

వామ్మో వాన!

35 ప్రాంతాల్లో 20 సెం.మీ.పైన.. మరో 200 కేంద్రాల్లో 10 సెం.మీ.పైగా నమోదు

అన్ని జిల్లాల్లోనూ కుండపోత.. నాలుగు జిల్లాలు అతలాకుతలం	ఉప్పొంగి ప్రవహిస్తున్న ఉప నదులు, వాగులు.. నీట మునిగిన వందలాది గ్రామాలు	చాలాచోట్ల రహదారులపై వరద, తెగిపోయిన వంతెనలు.. స్తంభించిన రాకపోకలు	రాష్ట్రంపై అత్యంత చురుకుగా నైరుతి రుతుపవనాల కదలిక	మరో రెండ్రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు	పోటెత్తుతున్న గోదావరి.. కృష్ణాలోనూ వరద

సాక్షి, హైదరాబాద్

కుండపోత, కుంభవృష్టి కాదు.. ఆకాశానికి చిల్లులు పడ్డాయేమో అనిపించేట్టుగా అత్యంత భారీ వర్షాలు తెలంగాణ రాష్ట్రాన్ని ముంచెత్తాయి. రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయిలో వానలు పోటెత్తాయి. ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో 24 గంటల వ్యవధిలో (బుధవారం ఉదయం 8.30 నుంచి గురువారం ఉదయం 8.30 వరకు) ఏకంగా 64.98 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 35 ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లపైన, మరో 200 ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లపైన భారీ వర్షాలు నమోదుకావడం గమనార్హం. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలు కుండపోత వానలతో అతలాకుతలం అయ్యాయి. ఉప నదులు, వాగులు ఉప్పొంగుతుండటం, చెరువులు, చిన్న ప్రాజెక్టులు అలుగు పారుతుండటంతో.. చాలా ప్రాంతాలు వరదలో చిక్కుకున్నాయి. కొన్నిచోట్ల రోడ్లు, వంతెనలు తెగిపోయాయి. వందలాది

మిగతా 12వ పేజీలో ▶

ఇదే అతిపెద్ద వాన

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో నమోదైన 64.98 సెంటీమీటర్ల వర్షపాతమే రాష్ట్ర చరిత్రలో అత్యధికమని వాతావరణశాఖ తెలిపింది. తాజాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాలలో నమోదైన 61.65 సెంటీమీటర్ల వర్షపాతం రెండో అతిపెద్ద రికార్డును నమోదు చేసినట్టు వెల్లడించింది. 2013 జూలై 19న ములుగు జిల్లా వాజేడులో కురిసిన 51.75 సెం.మీ. వాన ఇప్పటివరకు టాప్ అని.. ఇప్పుడది 3వ స్థానానికి పడిపోయిందని వివరించింది. ఇక కేవలం 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలోని 35కుపైగా ప్రాంతాల్లో 20సెంటీమీటర్లకుపైన వర్షపాతం నమోదవడం కూడా రికార్డేనని తెలిపింది.

నేడు పది జిల్లాలకు రెడ్ అలర్ట్

రాష్ట్రంలో మరో రెండ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదు కానున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం.. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను.. మిగతా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. పలు ప్రాంతాల్లో గంటకు 40- 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వివరించింది. అయితే పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలహీనపడిందని, ఇకపై వానలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపింది.

ప్రాణ నష్టం జరగొద్దు 12లో
మంత్రులు, అధికారులకు సీఎం ఆదేశం

చిల్లర రాజకీయాలొద్దు 2లో
ప్రతిపక్షాలకు మంత్రి కేటీఆర్ సూచన

4 జిల్లాలు ఆగమాగం 10లో
వణికిన ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలు



'రెడ్ డైరీ' కాంగ్రెస్‌ను ముంచేస్తుంది

- అందులోని అవినీతి రహస్యాలే వారిని ఓడిస్తాయి
- రాజస్తాన్ పర్యటనలో ప్రధాని మోదీ విమర్శలు

“ బ్రిటిష్ వారు దేశాన్ని వదిలివెళ్లిపోవాలని గాంధీజీ 'క్విట్ ఇండియా' పిలుపునిచ్చారు. ఇప్పుడు ఇవ్వాల్సిన నినాదం 'అవినీతి క్విట్ ఇండియా, వారసత్వం క్విట్ ఇండియా, బుజ్జగింపు క్విట్ ఇండియా'. కాంగ్రెస్ వారి కొల్లగొట్టే దుకాణంలో కొత్త సరుకే ఈ 'రెడ్ డైరీ'

- వివరాలు 6లో

వనమా పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: తన ఎన్నిక చెల్లదంటూ ఇచ్చిన తీర్పు అమలును నిలుపుదల చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వర్‌రావు దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్(ఐఏ)ను హైకోర్టు గురువారం కొట్టివేసింది. ఈ నెల 25న ఇచ్చిన తీర్పు అమలును నిలుపుదల చేయడానికి ఎలాంటి చట్టపరమైన కారణం లేదని కోర్టు చెప్పింది. తన ఎన్నిక చెల్లదని ఇచ్చిన

మిగతా 2వ పేజీలో ▶

అటు వనమా.. ఇటు జలగం 2లో

క్లుప్తంగా...

తక్షణం సహాయక చర్యలు చేపట్టండి

కరీంనగర్, సిరిసిల్ల, హనుమకొండ, జగిత్యాల కలెక్టర్లకు సంజయ్ విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల తన నియోజకవర్గ పరిధిలోని పరిస్థితి, జరిగిన నష్టంపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆరా తీశారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఢిల్లీలో ఉన్న సంజయ్ గురువారం ఉదయం కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఇల్లంతకుంట, జమ్మికుంట మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని, హనుమకొండ జిల్లా పరిధిలోనూ వర్షాలవల్ల ఎక్కువ నష్టం జరిగిందని తెలుసుకున్న సంజయ్ తక్షణమే ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్లను కోరారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, సహాయ, పునరావాస చర్యలను వేగవంతం చేశామని కలెక్టర్లు సంజయ్‌కి తెలిపారు.

'బీసీ' ప్రతినిధుల సమావేశం వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు స్థానికంగా అందుబాటులో ఉండి పరిస్థితిని సమీక్షించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. దీంతో శుక్రవారం హైదరాబాద్‌లో తలపెట్టిన బీసీ ప్రతినిధుల సభను వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ విద్యార్థుల కోసంప్రత్యేక కార్యక్రమాలను తలపెట్టేందుకు 28న మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆవరణలో 'బీసీ' ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు కమలాకర్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. భారీ వర్షాల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రభుత్వం.. త్వరలో తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

మిస్సింగ్ కేసులపై దర్యాప్తు కమిటీ వేయండి

ట్విట్టర్‌లో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్



సాక్షి, హైదరాబాద్: మహిళలపట్ల సీఎం కేసీఆర్‌కు ఏమాత్రం గౌరవం ఉన్నా వెంటనే మిస్సింగ్ కేసులపై దర్యాప్తు కమిటీ వేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. తప్పిపోయిన మహిళలు, బాలికల ఆచూకీని తక్షణమే కనిపెట్టాలన్నారు. కేసీఆర్ పాలనలో ఆడబిడ్డల మాన ప్రాణాలకు రక్షణలేదని ట్విట్టర్ వేదికగా ఆమె ధ్వజమెత్తారు. బతుకమ్మ ఆడే పవిత్ర గడ్డపై మహిళలు మాయం అవుతుంటే కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో మొద్దు నిద్రపోతున్నారని మండిపడ్డారు. రెండేళ్లలో 34,495 మంది మహిళలు, 8,066 మంది అమాయక బాలికలు కనిపించకుండా పోయారంటే.. కేసీఆర్ తలదించుకోవాలన్నారు. మహిళలపట్ల వివక్ష చూపే బీఆర్ఎస్ పాలనలో మిస్సింగ్ కేసులపై దర్యాప్తు కూడా శూన్యమని, రాష్ట్రంలో కేసీఆర్ బిడ్డకు ఉన్న రక్షణ తెలంగాణ ఆడబిడ్డలకు లేకుండాపోయిందని పేర్కొన్నారు.

సోయం పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్



సాక్షి, హైదరాబాద్: రెండు తెగల మధ్య చిచ్చుపెట్టేలా మాట్లాడిన ఎంపీ సోయం బాపూరావు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంలో సోయంపై రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని బాపూరావు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే తెలంగాణను కూడా రావణకాష్టం చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు.



ఇక నుంచి ఏవైనా భారత్ పేరుతోనే చేయండి.. 'ఇండియా' పేరుతో అసలు వద్దు

అటు వనమా.. ఇటు జలగం..

- కొత్తగూడెం నియోజకవర్గంపై బీఆర్ఎస్‌లో వింత పరిస్థితి
- హైకోర్టు తీర్పు నేపథ్యంలో జలగంకు పదవిపై ఉత్కంఠ
- ఇద్దరు నేతలూ ఒకే పార్టీలో ఉండటంతో సమస్య జటిలం


వనమా వెంకటేశ్వర్‌రావు


జలగం వెంకట్రావు

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో బీఆర్ఎస్‌లో వింత పరిస్థితి నెలకొంది. మూడు రోజుల క్రితం ఇచ్చిన తీర్పుపై వనమా చేసుకున్న అప్పీల్‌ను హైకోర్టు కొట్టివేయడంతో జలగం వెంకట్రావు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని వనమా చెప్తుండగా, హైకోర్టు తీర్పును అమలు చేయాలని జలగం కోరుతున్నారు. ఈ మేరకు ఆయన హైకోర్టు తీర్పు ప్రతిని బుధవారం అసెంబ్లీ కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కూడా అందజేసిన విషయం తెలిసిందే. జలగంకు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అసెంబ్లీ స్పీకర్ కార్యాలయం, ఎన్నికల కమిషన్ ఎప్పటిలోగా, ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఇద్దరు నేతలూ బీఆర్ఎస్‌లోనే..

కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2018లో బీఆర్ఎస్ నుంచి జలగం వెంకట్రావు, కాంగ్రెస్ నుంచి వనమా వెంకటేశ్వర్‌రావు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన వనమా ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం వనమా, జలగం.. ఇద్దరూ ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. జలగం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నా అధికారిక కార్యక్రమాలకు మాత్రం దూరంగా ఉంటూ వస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ నేపథ్యంలో 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా నుంచి బీఆర్ఎస్ తరపున గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యేగా జలగం వెంకట్రావు గుర్తింపు పొందారు. ప్రస్తుతం కోర్టు తీర్పు మేరకు తాను ఎమ్మెల్యేగా పదవి స్వీకరించినా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని జలగం ప్రకటించారు. అయితే ఈ అంశంపై బీఆర్ఎస్ నుంచి అధికారికంగా ఎలాంటి స్పందన వెలువడలేదు. కోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ కోసం జలగం ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే పార్టీ పూర్తిగా తమ వెంటే ఉందని వనమా వర్గీయులు 'సాక్షి'తో అన్నారు. జలగం ప్రమాణ స్వీకారంపై స్పష్టత వచ్చిన తర్వాతే స్పందించాలని బీఆర్ఎస్ అధినేత భావిస్తున్నట్లు తెలిసింది.

వనమాపై ఐదేళ్ల నిషేధం నేపథ్యంలో..

వనమా ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చిన హైకోర్టు ఆయన ఐదేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించింది. దీంతో వచ్చే ఎన్నికల్లోనూ తనకు బీఆర్ఎస్ టికెట్ లభిస్తుందని జలగం భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌రావు కూడా కొత్తగూడెం బీఆర్ఎస్ టికెట్‌ను ఆశిస్తున్నారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో కొత్తగూడెం రాజకీయాలతో బీఆర్ఎస్‌లో వింత స్థితి నెలకొందని పరిశీలకులు అంటున్నారు.

అమిత్ షా పర్యటన మళ్లీ వాయిదా



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన మళ్లీ వాయిదా పడింది. ఎడతెగని వర్షాలు, ముంచెత్తుతున్న వరదల కారణంగా శనివారంనాటి ఈ పర్యటన వాయిదా పడినట్లుగా పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లో వివిధ సామాజిక వర్గాలు, ప్రముఖులు, ఇక్కడ స్థిరపడిన ఇతర రాష్ట్రాల మేధావులతో ప్రత్యేకంగా భేటీ కావాలని అమిత్ షా సంకల్పించారు. గత నెల 15న ఖమ్మంలో బహిరంగసభ నిర్వహించాలని రాష్ట్ర బీజేపీ నాయకత్వం నిర్ణయించగా, గుజరాత్ తదితర రాష్ట్రాలపై తుఫాన్ తీవ్ర ప్రభావం చూపడంతో అప్పుడా కార్యక్రమం రద్దయింది. మళ్లీ ఖమ్మంలోనే మరో తేదీన బహిరంగసభ నిర్వహించాలని భావించినా అది కూడా కుదరకపోవడంతో ఈ నెల 29న అమిత్ షా హైదరాబాద్ పర్యటనను ఖరారు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో భారీవర్షాల కారణంగా ఈ కార్యక్రమాన్ని కూడా పార్టీ వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. అయితే త్వరలోనే ఆయన రాష్ట్ర పర్యటనకు వచ్చే అవకాశాలున్నాయని పార్టీ నేతలు తెలిపారు. రాష్ట్రంలోని 14 లోక్‌సభ నియోజకవర్గాల (సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్ మినహాయించి) పరిధిలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొనేలా బహిరంగ సభలు నిర్వహించాలని జాతీయ నాయకత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇందులో భాగంగా నిర్వహించిన వరంగల్ సభలో మోదీ, చేవెళ్లలో అమిత్ షా, నాగర్‌కర్నూల్‌లో నడ్డా పాల్గొన్న విషయం తెలిసిందే. రాబోయే రోజుల్లో మిగతా 11 ఎంపీ స్థానాల్లో నిర్వహించేసభల్లో ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు పాల్గొనేలా నాయకత్వం చర్యలు చేపట్టినట్టు సమాచారం.

వనమా పిటిషన్ కొట్టివేత

▶ మొదటి పేజీ తరువాయి

తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నామని, అందుకోసం స్టే ఇవ్వాలని వనమా వెంకటేశ్వర్ రావు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి తీర్పును రిజర్వు చేసి.. గురువారం వెల్లడించారు. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలిన తర్వాత కూడా ఉపశమనం ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఐఏలోని ప్రతివాదుల తరపు న్యాయవాదుల వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకున్నారు. తీర్పు అమలును నిలుపుదల చేయడానికి వనమా వద్ద ఎలాంటి బలమైన కారణం లేదని భావిస్తూ, కోర్టు ఐఏను కొట్టివేశారు.

ప్రియాంక సభలో తొలి టికెట్ మహిళకే ప్రకటించాలి



కొల్లాపూర్: 'కొల్లాపూర్‌లో నిర్వహించనున్న పాలమూరు ప్రజాభేరి సభలో కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ మహిళా డిక్లరేషన్‌తోపాటు పలు హామీలు ప్రకటిస్తారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అదే వేదిక మీది నుంచి పార్టీ తొలిటికెట్‌ను మహిళకు ప్రకటించాలి. కొల్లాపూర్‌లో బీసీ మహిళ అయిన కాటమోని తిరుపతమ్మగౌడ్‌కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి' అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కొల్లాపూర్‌లో నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆత్మగౌరవసభలో జాజుల మాట్లాడారు. ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో మూడు అసెంబ్లీ స్థానాలను బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ద్వారా ప్రకటించిందని, ఇప్పుడు మాటమార్చి రెండు స్థానాలని అంటోందని పేర్కొన్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉండాలని కోరారు. బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలని, రాజ్యాధికారంలో బీసీల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు.

అమిత్‌షాకు కిషన్‌రెడ్డి ఫోన్

వరదలో మునిగిన మోరంచపల్లి ప్రజలను కాపాడాలని వినతి

సాక్షి, హైదరాబాద్: భూపాలపల్లి జిల్లాలో భారీ వర్షాల కారణంగా తలెత్తిన వరద బీభత్సంపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్పందించారు. వరదల్లో చిక్కుకున్న వారినుంచి తనకు గురువారం ఉదయం ఫోన్ రావడంతో.. వెంటనే స్పందించిన ఆయన స్థానిక కలెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదలో చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లాతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి వరదలో మునిగిపోయిందని.. రెండు ఇళ్లపైకి స్థానికులు చేరుకుని సహాయం కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. వారిని ఆదుకునేందుకు వీలైనంత త్వరగా ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను పంపించాలని కోరారు. స్పందించిన కేంద్రం.. వెంటనే 5 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, రెండు హెలికాప్టర్‌లను రంగంలోకి దించింది. ఆ బృందాలు హెలికాప్టర్‌ల ద్వారా రెండు ఇళ్లపై చిక్కుకున్న బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాయి. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి భూపాలపల్లి జిల్లాలో 6 ఓపెన్ కాస్ట్ గనులు పూర్తిగా నీటమునగగా.. మోరంచపల్లి, చేనుపాక, కాల్వపల్లి, మొగుళ్లపల్లి ప్రాంతాల్లో 12 చెరువుల గట్లు తెగిపోయాయి.

పార్లమెంటు భవనానికి | అంబేడ్కర్ పేరు పెట్టాలి

ఎమ్మెల్సీ కవితతో భీమ్ ఆర్మీ చీఫ్ ఆజాద్ భేటీ

సాక్షి, హైదరాబాద్: నూతన పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ భవనంగా నామకరణం చేయాలని, ఆ భవనంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటన దారుణమని, ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలన్నారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు వచ్చిన చంద్రశేఖర్ ఆజాద్ గురువారం ఎమ్మెల్సీ కవితతో సుమారు గంటపాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరు పార్టీల రాజకీయ విధానాలు, దళితుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్సీ కవితతో కలిసి హుస్సేన్‌సాగర్ తీరంలోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని దర్శించడంతో పాటు తెలంగాణ అమరుల జ్యోతి వద్ద నివాళి అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం కృషిచేస్తోందని ఆజాద్ అన్నారు. కాగా, తమ ఆహ్వానం మేరకే రెండు రోజుల పర్యటనకు ఆజాద్ వచ్చినట్లు ఎమ్మెల్సీ కవిత వెల్లడించారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆజాద్, కవిత తదితరులు

ముట్టడి పిలుపు.. చిల్లర రాజకీయాల కోసమా?

రేవంత్‌రెడ్డికి దాసోజు బహిరంగలేఖ



సాక్షి, హైదరాబాద్: భారీవర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముట్టడి పిలుపు ఇవ్వడం సిగ్గుచేటని బీఆర్ఎస్‌నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం టీపీసీసీ చీఫ్, కాంగ్రెస్ పార్టీ నేతలకు దాసోజు బహిరంగలేఖ రాశారు. జీహెచ్‌ఎంసీ ముట్టడికి పిలుపు ప్రజల కోసమా? చిల్లర పబ్లిసిటీ రాజకీయాల కోసమా అని ప్రశ్నించారు. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో ఒక్క ముంపు ప్రాంతానికైనా వెళ్లి చూశావా అని ప్రశ్నించారు.

'వన్ నేషన్ వన్ ఫర్టిలైజర్' | నినాదంతో ముందుకు..

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

- అధికారంలోకి రాగానే ప్రజాప్రగతి భవన్‌గా పేరు మార్చుతాం
- తెలంగాణలో పంటబీమా ఎందుకు అమలు చేయలేదని నిలదీత
- శామీర్‌పేటలో పీఎం కిసాన్ సంవృద్ధి కేంద్రం ప్రారంభం


నానో డీఏపీ బాటిల్‌ను రైతులకు చూపుతున్న కిషన్‌రెడ్డి

శామీర్‌పేట్: వన్ నేషన్ వన్ ఫర్టిలైజర్ నినాదంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా, శామీర్‌పేటలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి కిసాన్ సంవృద్ధి కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని, రైతులతో కలిసి పీఎం నరేంద్ర మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రధాని గురువారం దేశవ్యాప్తంగా 1.25 లక్షల పీఎంకేఎస్‌కే (ప్రధాన మంత్రి కిసాన్ సంవృద్ధి కేంద్రం) లను జాతికి అంకితం చేశారన్నారు. ఈ కేంద్రాల్లో వ్యవసాయానికి అవసరమైన ప్రతీ పనిముట్టు, విత్తనాలు, భూసార పరీక్షలు, ఎరువులు లభ్యమవుతాయని, అద్దెకు డ్రోన్ స్ప్రేలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పీఎంకేఎస్‌కే సిబ్బందికి వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలతో శిక్షణ ఇప్పించి, తద్వారా రైతులకు అవగాహన కల్పిస్తామని ఆయన వెల్లడించారు. గ్రోమోర్ ప్రవేశపెట్టిన డీఏపీ నానో ఒక లీటర్ బాటిల్.. ఒక బస్తా డీఏపీతో సమానమని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీమా ఉంటే పరిహారం అందేది...

తెలంగాణలో అధికారంలోకి రాగానే ప్రగతిభవన్‌ను ప్రజాప్రగతి భవన్‌గా మారుస్తామని కిషన్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ నాలుగో స్థానంలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. వర్షాల వల్ల పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని, రాష్ట్రంలో బీమా పథకం అమల్లో ఉండి ఉంటే రైతులకు పరిహారం అందేదని చెప్పారు. ఫామ్‌హౌజ్‌లో, ప్రగతి భవన్‌లో పాలన సాగించే ముఖ్యమంత్రికి రైతుల గోసలు ఎలా తెలుస్తాయని, ప్రధానమంత్రి పంట బీమా పథకాన్ని రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ధరణి పోర్టల్ ద్వారా లేని సమస్యలను సృష్టించి, రైతుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని, కల్వకుంట్ల కుటుంబం అంటేనే తడి గుడ్డతో గొంతుకోసే వారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు.

అరెస్టులకు భయపడేది లేదు

గజ్వేల్: ముఖ్యమంత్రి కేసీఆర్ నయా నిజాం తరహాలో ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తున్నారని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలో అరెస్టయి జైలుకు వెళ్లి వచ్చిన బీజేపీ నేత మనోహర్ యాదవ్, బీఆర్ఎస్ కౌన్సిలర్ గంగిశెట్టి చందన భర్త రవీందర్‌లను ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో కలిసి గురువారం పరామర్శించారు. కేసులకు, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. కాగా పరామర్శ సందర్భంలో కిషన్‌రెడ్డి.. రవీందర్‌పై కాషాయ కండువా కప్పడానికి ప్రయత్నించగా ఆయన సున్నితంగా వారించారు.

పొన్నాలతో పొంగులేటి భేటీ

కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే ధ్యేయమని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యతో సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని పొన్నాల నివాసానికి వెళ్లిన పొంగులేటి గంటకుపైగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. సమావేశం అనంతరం పొన్నాల మీడియాతో మాట్లాడుతూ పార్టీని ముందుకు నడిపించిన చరిత్ర ఉన్న మూడు కుటుంబాలతో బంధుత్వమున్న పొంగులేటి కాంగ్రెస్‌లో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసం ఏం చేయాలన్న దానిపై ఆలోచనలు పంచుకున్నామని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, దేశంలోనూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పనిచేస్తామని పొన్నాల వెల్లడించారు.

సహాయచర్యల కోసం పంచాయతీలకు నిధులివ్వాలి



సాక్షి, హైదరాబాద్: వర్షాలతో ఇబ్బంది పడుతున్న ప్రజల కు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా సహాయచర్యలను ముమ్మరం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. తెగిపోయిన చెరువుకట్టలు, మురుగు వ్యవస్థల మరమ్మతుల కోసం వెంటనే గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కేంద్రం కూడా తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నిరాశ్రయులైనవారికి తాత్కాలిక శిబిరాలలో వసతి కల్పించాలని కోరారు. భద్రాచలంలో గోదావరికి ఇరువైపులా గుండాల నుంచి కన్నాయిగూడెం వరకు, బూర్గంపాడు నుంచి ఏలేరు వరకు కరకట్టలు నిర్మించాలని కోరారు.

వర్షాల్లో ప్రజలు... | పార్టీ చేరికల్లో మీరు బిజీ!

- సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి ధ్వజం
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా నేడు జీహెచ్‌ఎంసీ ముట్టడి



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో ప్రజలు అల్లాడుతుంటే సీఎం కేసీఆర్ మాత్రం రాజకీయ ఫిరాయింపులకు పాల్పడుతూ ఇతర పార్టీల నాయకులను బీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మంత్రి కేటీఆర్ తన పుట్టినరోజు తర్వాత జనానికి దూరంగా ఉంటూ ప్రజలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో వరదలు, ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో పార్టీ సీనియర్ నాయకులతో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రేతో కలిసి రేవంత్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ, ఎమ్మెల్యే శ్రీధర్ బాబుతోపాటు పీఈసీ సభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొని సలహాలిచ్చారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ వరదల్లో ఇబ్బందులు పడుతున్న హైదరాబాద్ ప్రజలను పట్టించుకోని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వరదలతో ఉపాధి కోల్పోయిన పేదలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి వరద సహాయం వచ్చేలా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని సూచించారు. కొల్లాపూర్‌లో 30న ప్రియాంకగాంధీ పాల్గొనాల్సిన సభను భారీ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు.

కేటీఆర్‌కు రేవంత్ బహిరంగ లేఖ

వర్షాలతో గల్లీలు ఏరులై.. కాలనీలు చెరువులై ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని రేవంత్‌రెడ్డి నిలదీశారు. కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంటే ప్రజల గోసను పట్టించుకోకుండా పత్తా లేకుండా పోయారంటూ కేటీఆర్‌కు రేవంత్ బహిరంగ లేఖ రాశారు.

విపత్కర పరిస్థితుల్లో చిల్లర రాజకీయాలొద్దు

- చేతనైతే ప్రజలకు సాయం చేయండి
- ప్రతిపక్షాలకు మంత్రి కేటీఆర్ సూచన
- హుస్సేన్‌సాగర్, మూసారాంబాగ్‌ల వద్ద వరద ఉధృతి పరిశీలించిన మంత్రి


హుస్సేన్‌సాగర్ వరద పరిస్థితిని సమీక్షించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ముఠా గోపాల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: వర్షాలు కురుస్తున్న విపత్కర పరిస్థితుల్లో ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయడం తగదని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. వర్షాల్లో 24 గంటలు కష్టపడుతున్న ఉద్యోగుల మానసిక స్థైర్యం దెబ్బతినేలా విమర్శలు చేయవద్దని సూచించారు. రాజకీయాలకు, ఎన్నికలకు ఇంకా సమయముందన్నారు. చేయగలిగితే ప్రజలకు సహాయం చేయాలని, అండగా నిలబడి వారికి ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. గురువారం హుస్సేన్‌సాగర్ వరద ఉధృతిని, మూసారాంబాగ్ వద్ద మూసీ ప్రవాహాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రభుత్వం హైఅలర్ట్‌గా ఉంది..

'రాష్ట్రంలో వరద పరిస్థితుల్ని సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పర్యవేక్షిస్తున్నారు. హైదరాబాద్‌కు రెడ్ అలర్ట్ ఉండటంతో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో హైఅలర్ట్‌గా ఉంది. నగరంలోనే కాకుండా రాష్ట్రంలోనూ ఎలాంటి ప్రాణనష్టం జరగరాదనే ప్రధాన లక్ష్యంతో అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటున్నాం. విద్యాసంస్థలకు సెలవులివ్వడం వల్ల ట్రాఫిక్ తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన ప్రాంతాల్లో తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేసి భోజనం సహా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని మునిసిపాలిటీల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. వర్షాలు వెలిశాక అంటువ్యాధులు, రోగాలు ప్రబలకుండా, నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకునేలా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం..' అని కేటీఆర్ తెలిపారు.

ఫలితమిచ్చిన ఎస్ఎన్‌డీపీ పనులు..

'రూ.1,000 కోట్లతో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ (వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం) పనుల వల్ల గతంతో పోల్చుకుంటే ముంపు సమస్యలు చాలా తగ్గాయి. గతంలో జల్‌పల్లి, కొంపల్లి వంటి ప్రాంతాలు వారం పది రోజులు నీటిలోనే మునిగి ఉండేవి. ఇప్పుడలాంటి పరిస్థితి లేదు. నగరంలోని చెరువులు పూర్తిగా నిండకుండా చూస్తున్నాం. నాలాల్లో పూడికతీత జరిగింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ నుంచి వార్డు ఇన్‌చార్జుల దాకా అందరూ ఫీల్డ్‌లో ఉన్నారు. డీఆర్‌ఎఫ్ బృందాలు ఎప్పటికప్పుడు ప్రజలకు సహాయం చేస్తున్నాయి. హుస్సేన్‌సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) వరకు వచ్చింది. దీంతో లోతట్టు ప్రాంతా లను అలర్ట్ చేశాం. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిస్తాం. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో 24 గంటలు ప్రజలకు సేవ చేసే పనిలో నిమగ్నమై ఉంది..' అని మంత్రి తెలిపారు. వర్షాల వల్ల వచ్చే కొన్ని తాత్కాలిక స మస్యల్ని కూడా శాశ్వత సమస్యలుగా పేర్కొంటూ 'జలమయం'వంటి మాటలు వాడి హైదరాబాద్ ఇమేజ్‌ను దెబ్బతీయవద్దని మీడియాను కోరారు.

త్వరలో మూసారాంబాగ్ బ్రిడ్జి పనులు..

'లోతట్టు ప్రాంతాలు, నాలాలపై కబ్జాలు మాకు వారసత్వంగా వచ్చిన సమస్యలు. వాటిని ఒక్కటొక్కటిగా పరిష్కరించుకుంటూ పోతున్నాం. పైనుంచి వరద నీరు వస్తుండటం వల్ల తలెత్తుతున్న మూసారాంబాగ్ సమస్యకు పరిష్కారంగా త్వరలోనే బ్రిడ్జి పనులు చేపడతాం. మూసీపై 14 బ్రిడ్జిలకు టెండర్లు పిలవగా ఐదు టెండర్లు పూర్తయ్యాయి. మూసీని కూడా బాగు చేస్తాం..' అని కేటీఆర్ చెప్పారు. మంత్రి వెంట ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్ తదితరులున్నారు.

అధికారులు, అదనపు కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్

భారీ వర్షాలపై మంత్రి కేటీఆర్ గురువారం మున్సిపల్ ఉన్నతాధికారులు, జిల్లాల అదనపు కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పురపాలక శాఖ అధికారుల సెలవులను రద్దు చేసినట్లు తెలిపారు. వర్ష ఉధృతిని పరిశీలించడానికి శుక్రవారం వరంగల్ వెళ్లనున్నట్లు చెప్పారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజలకు బీఆర్ఎస్ శ్రేణులు అండగా నిలవాలి

వర్షం, వరదల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా నిలవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కొన్ని జిల్లాల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉందని, దీంతో ప్రభావితమైన ప్రజలకు అన్ని విధాలుగా సహాయం చేయాలని గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా వరంగల్ లాంటి జిల్లాల్లో నీట మునిగిన ప్రాంతాలు, గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు నిత్యావసరాలు అందించడం మొదలుకుని తోచిన విధానంలో సాయం చేయాలని, ప్రభుత్వ యంత్రాంగానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ స్టీరింగ్ కేసీఆర్ చేతిలో

- బీఆర్ఎస్ స్టీరింగ్ ఎంఐఎం చేతిలో...
- మూడు పార్టీలతో తెలంగాణకు నష్టం
- బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ స్టీరింగ్ సీఎం కేసీఆర్ చేతిలో ఉందని... బీఆర్ఎస్ పార్టీ స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. బీఆర్ఎస్ ఏ1, కాంగ్రెస్ ఏ2, ఎంఐఎం ఏ3 అని.. ఈ మూడు పార్టీల వల్ల తెలంగాణకి నష్టమే తప్ప ఎలాంటి లాభం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కూటమి పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కేసీఆర్ జై కొట్టారని... దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీ మరోసారి బయటపడిందన్నారు. గురువారం ఢిల్లీలో ఎంపీ అర్వింద్ మీడియాతో మాట్లాడారు. అసలు మోదీ ప్రభుత్వంపై కేసీఆర్ ఎందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవితలు ఫాంహౌస్‌ల నుంచి బయటికి వచ్చి తెలంగాణలో వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పైసలన్నీ కాళేశ్వరంలో ముంచుడు, కవితకు ఇచ్చుడు అన్నట్లు కేసీఆర్ పాలన ఉందని నిందించారు. నిజామాబాద్ జిల్లాలో బీజేపీ మండల అధ్యక్షుల మార్పుల్లో తన ప్రమేయం లేదని అర్వింద్ వివరణ ఇచ్చారు.

క్లుప్తంగా...



గన్నవరం విమానాశ్రయంలో జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు స్వాగతం పలుకుతున్న సీఎస్ జవహర్‌రెడ్డి

నేడు ఏపీ హైకోర్టు సీజే ప్రమాణ స్వీకారం

సాక్షి, అమరావతి/గన్నవరం: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమంలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, న్యాయవాదులు హాజరుకానున్నారు. అనంతరం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో జస్టిస్ ఠాకూర్ పాల్గొంటారు. ఆ తర్వాత అక్కడి నుంచి నేరుగా హైకోర్టుకు చేరుకుంటారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం ప్రధాన న్యాయమూర్తిగా కేసుల విచారణను చేపడతారు.

మూడేళ్లలో వెయ్యి ఉద్యోగాలే లక్ష్యంగా..

నగరంలో రెండో 'ఎవరెస్ట్ డీఎక్స్' ఆఫీసు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని కనెక్టికట్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న 'ఎవరెస్ట్ డీఎక్స్' తెలంగాణలో తన కార్యకలాపాలను విస్తరించింది. ఐదేళ్ల క్రితం రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించిన 'ఎవరెస్ట్ డీఎక్స్' గురువారం హైదరాబాద్‌లో తన రెండో కార్యాలయాన్ని ప్రారంభించింది. హైదరాబాద్‌తో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు కార్యకలాపాల విస్తరణ ద్వారా వచ్చే మూడేళ్లలో వేయి మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ ఐటీ టవర్‌లోనూ తన కార్యకలాపాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఎవరెస్ట్ డీఎక్స్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ఐటీ పెట్టుబడుల విభాగం సీఈఓ విజయ్ రంగినేని, ఎవరెస్ట్ డీఎక్స్ సీఈఓ విజయ్ ఆనంద్, సీటీఓ ప్రభు రంగస్వామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమెరికాకు సీఎండీ డి.ప్రభాకర్‌రావు

జేఎండీ శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో అవలంబిస్తున్న అత్యుత్తమ విధానాలపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి. ప్రభాకర్‌రావు 28 నుంచి ఆగస్టు 13 వరకు అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. తన గైర్హాజరీలో ట్రాన్స్‌కో జేఎండీ సి. శ్రీనివాసరావు ఇన్‌చార్జి సీఎండీగా వ్యవహరిస్తారని ప్రభాకర్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

'దోస్త్' గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: దోస్త్ ఆన్‌లైన్ రిపోర్టింగ్ గడువును మళ్లీ పెంచారు. విద్యాసంస్థలకు వరుసగా రెండు రోజులు సెలవులు ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, కాలేజీ విద్యా కమిషనర్ వాకాటి కరుణ గురువారం ప్రకటించారు. మూడో దశ డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 28 తుది గడువు కాగా, దీన్ని 31 వరకూ పెంచినట్లు పేర్కొన్నారు. ఈ తేదీలో సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీలో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందన్నారు.

సయ్యదాను కాపాడిన షికాగో ముస్లిం కమ్యూనిటీ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: ఉన్నత చదువుల కోసం అమెరికాలోని డెట్రాయిట్ వెళ్లి మానసిక పరిస్థితి బాగోలేక వీధుల్లో తిరుగుతున్న సయ్యదా లులూ జైదీని షికాగోలోని ముస్లిం కమ్యూనిటీ సభ్యులు కాపాడారు. ప్రస్తుతం ఆమెను సురక్షిత ప్రదేశంలో ఉంచారు. ఆమె మానసిక పరిస్థితి నిలకడగా లేకపోవడంతో, కాపాడిన వ్యక్తులు ఇంట్లోనే వైద్యం చేయిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెను రక్షించి, వైద్యం అందిస్తున్న వీడియోను స్థానిక వ్యక్తులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. సయ్యదా బాగోగులు చూసుకోడానికి ఆమె తల్లిని అమెరికాకు పంపించాలని భారత విదేశాంగ మంత్రికి షికాగో ముస్లిం కమ్యూనిటీ లేఖ రాసినట్లు తెలిసింది. అలాగే సయ్యదా కుటుంబ సభ్యులు కూడా తమను అమెరికా రావడానికి వీలు కల్పించాలని అక్కడి ప్రభుత్వాన్ని కోరారు. గత రెండు, మూడు నెలలుగా మానసిక ఒత్తిడికి లోనై ఒంటరిగా ఉండటం, సకాలంలో వైద్యం అందకపోవడంతో సయ్యదా ఆరోగ్యం క్షీణించింది. దీంతో తల్లి అమెరికాకు వస్తే సయ్యదా బాగోగులు చూసుకుంటారని ముస్లిం కమ్యూనిటీ సభ్యులు భావిస్తున్నారు. ప్రస్తుతం సయ్యదా ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

జస్టిస్ సామ్ కోషి ప్రమాణస్వీకారం

తెలంగాణ హైకోర్టుకు మంచి పేరు ఉంది

- ఇక్కడకు రావడం సంతోషంగా ఉందన్న జస్టిస్ కోషి



హైకోర్టు బార్ అసోసియేషన్‌లో సీజే జస్టిస్ అరాధే, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఉదయం 10 గంటలకు హైకోర్టు మొదటి హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ సామ్ కోషిని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు మేరకు తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో జస్టిస్ సామ్ కోషి కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్‌లో నా సీనియర్‌గా జస్టిస్ అరాధే

కొత్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సామ్ కోషిని హైకోర్టు బార్ అసోసియేషన్ సన్మానించింది. ఈ సందర్భంగా జస్టిస్ కోషి మాట్లాడుతూ.. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లో న్యాయవాద వృత్తిలో ఉన్నప్పుడు తన సీనియర్ న్యాయవాదిగా జస్టిస్ అలోక్ అరాధే ఉన్నారని, మళ్లీ ఆయన సీజేగా ఉన్న తెలంగాణ హైకోర్టుకు జడ్జిగా రావడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. తెలంగాణ హైకోర్టుకు మంచి పేరు ఉందని, దాన్ని కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనతో న్యాయవాదిగా పనిచేసిన జస్టిస్ సామ్ కోషి.. తెలంగాణ హైకోర్టుకు రావడం ఆనందంగా ఉందని సీజే జస్టిస్ అరాధే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ కల్యాణ్‌రావు చెంగల్వ పాల్గొన్నారు. అనంతరం సీజేతోపాటు న్యాయమూర్తులు బార్ అసోసియేషన్‌ను సందర్శించారు.

నేడూ విద్యాసంస్థలకు సెలవు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం కూడా ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. ఇప్పటికే ఈ నెల 20, 21, 26 తేదీల్లో ప్రభుత్వం సెలవులు ప్రకటించగా 22, 24, 25 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లు పనిచేసినా దాదాపు 80 శాతం మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శనివారం మొహర్రం సెలవు కాగా వర్షాలు, వరదల వల్ల నెలకొన్న ఇబ్బందులు కుదుటపడకపోతే సోమవారం సైతం విద్యాసంస్థలు పనిచేయడం కష్టమని అధికారులు అంటున్నారు.

వర్షాలు తగ్గినా బోధన ఎలా?

పాఠశాల విద్యాశాఖ వివరాల ప్రకారం ఇప్పట్లో సజావుగా బోధన సాగే అవకాశం లేదని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5 వేల స్కూళ్లలో కుండపోత వర్షాల వల్ల గదుల్లోకి, స్కూల్ ప్రాంగణాల్లోకి వరదనీరు చేరింది. దాదాపు 3 వేల స్కూళ్ల ఆవరణలో బురద పేరుకుపోయింది. 6,200 స్కూళ్లలో గోడలు చెమ్మపట్టడంతోపాటు విద్యుత్ బోర్డుల్లోకి నీరు చేరింది. 78 శాతం స్కూళ్లలో వర్షాలు తగ్గినా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ హాస్టళ్ల నుంచి చాలా మంది ఇళ్లకు వెళ్లిపోయారు. బడులు తెరిచినా గ్రామీణ ప్రాంతాల్లో చాలాచోట్ల రవాణా వ్యవస్థ దెబ్బతిన్నందువల్ల వారంపాటు వారు తిరిగి రావడం కష్టమని అధికారులు భావిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో డెంగీ, మలేరియా, అంటువ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరిస్తోంది. తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందువల్ల స్కూళ్లు, హాస్టళ్ల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై మండలస్థాయి ప్రకారం నివేదికలు తెప్పించుకోవాలని సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు.

టీ-శాట్ సేవలు 90 లక్షల మందికి

మారుతున్న ధోరణులకు అనుగుణంగా పాఠాలు: మంత్రి కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణకు ముందు 'మన టీవీ' పేరిట కొన్ని ఇళ్లు, సంస్థలకే పరిమితమైన టీ-శాట్ సేవలు.. ప్రస్తుతం 90 లక్షల మందికి అందుతున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. విద్యార్థులు, యువతకు అవసరమైన సేవలకోసం ప్రణాళికాబద్ధంగా, ఆచరణాత్మక విధానాలతో టీ-శాట్ కార్యక్రమాలు రూపొందుతున్నట్టు వెల్లడించారు. అంబేడ్కర్ యూనివర్సిటీ ఆవరణలో గురువారం జరిగిన టీ-శాట్ ఆరో వార్షికోత్సవంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డిజిటల్ మాధ్యమాల ద్వారా కూడా సేవలు అందించేందుకు పదివేల గంటలకు పైగా కూడిన కంటెంట్‌తో ప్రత్యేక యాప్ తయారు చేసినట్టు వెల్లడించారు. దీంతో లక్షలాది డౌన్‌లోడ్‌ల ద్వారా విద్యార్థులు పాఠాలు నేర్చుకునే పద్ధతులు వేగంగా మారుతున్నాయన్నారు. మారుతున్న బోధన, అభ్యసన ధోరణులకు అనుగుణంగా కంటెంట్ రూపకల్పనలో టీ-శాట్ మార్పులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీశాట్ సీఈఓ శైలేష్‌రెడ్డి, ఉస్మానియా, అంబేడ్కర్ వర్సిటీల వీసీలు రవిందర్‌యాదవ్, సీతారామారావు పాల్గొన్నారు. కంటెంట్ రూపకల్పన కోసం ఉస్మానియావర్సిటీతో టీ-శాట్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు కేటీఆర్ వెల్లడించారు. ఓయూ ఆవిష్కరణల వాతావరణాన్ని ప్రోత్స హించాలని సూచించారు. ఈ ఒప్పందం ద్వారా వర్సిటీ పరిధిలోని 720 అనుబంధ కాలేజీలకు చెందిన సుమారు మూడు లక్షల మంది విద్యార్థులకు టీ-శాట్ నెట్‌వర్క్ ద్వారా పాఠాలు అందుతాయి

ఆహాలోనూ టీ-శాట్: ఆహా ఓటీటీ వేదిక ద్వారా టీ-శాట్ ప్రసారానికి కూడా ఒప్పందం కుదిరింది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా టీ-శాట్ ప్రసారాలు వీక్షకులకు అందుతాయని ఆహా టీవీ సీఈఓ రవికాంత్ సబ్నవీస్ ప్రకటించారు.

అనుక్షణం అప్రమత్తం

డీజీపీ కార్యాలయంలో పర్యవేక్షణ కేంద్రం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నట్టు డీజీపీ అంజనీకుమార్ చెప్పారు. ఎడతెరిపిలేని వానలతో ప్రమాదాలకు ఆస్కారం ఉన్నందున అత్యవసరమైతేనే ప్రజలు ఇళ్లనుంచి బయటికి రావాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల దృష్ట్యా ఎప్పటికప్పుడు పరిస్థితులు సమీక్షించి సహాయ, పునరావాస కార్యక్రమాలపై సలహాలు, సూచనలు, సహాయాన్ని అందించేందుకు డీజీపీ కార్యాల యంలో ప్రత్యేకంగా వరద పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఈ కేంద్రం నుంచి వివిధ జిల్లాల్లోని పరిస్థితులు, సహాయక చర్యలను డీజీపీ స్వయంగా పర్యవేక్షించారు. అదనపు డీజీలు శివధర్‌రెడ్డి, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్‌లతోపాటు పలువురు సీనియర్లు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఏ ప్రాంతంలోనైనా రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం వస్తే శాటిలైట్ ద్వారా పరిశీలించి సంబంధిత పోలీసులను అప్రమత్తం చేయాలన్నారు.

10,696 మంది తరలింపు

కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ టెలికాన్ఫరెన్స్

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు 24 గంటలూ తెరిచి ఉంచాలని ఆదేశం

కంట్రోల్ రూమ్ నంబర్లు 7997950008, 7997959782, 040 - 23450779



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ముంపునకు గురైన 108 గ్రామాల నుంచి 10,696 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. భూపాలపల్లి జిల్లాలోని మోరంచ వాగు ఉప్పొంగడంతో మోరంచపల్లి గ్రామం పూర్తిగా నీట మునిగిందని, అక్కడికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించి 600 మందిని, మంథనిలోని గోపాల్‌పూర్ ఇసుక క్వారీలో చిక్కుకున్న 19 మంది కార్మికులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు. ఆర్మీ హెలికాప్టర్‌ను మోరంచపల్లికి పంపించి అక్కడ చిక్కుకున్న ఆరుగురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చామన్నారు. మరో 4 హెలికాప్టర్లు, 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపాల్సిందిగా కేంద్రాన్ని కోరామన్నారు. డీజీపీ అంజనీ కుమార్‌తో కలిసి గురువారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లోని అన్ని పీహెచ్ సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రులను 24 గంటలు తెరచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఖమ్మం పట్టణానికి ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని, బూరు గుంపాడుకు హెలికాప్టర్‌ను వెంటనే పంపిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు చిక్కుకున్న రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, రహదారుల్లో సహాయ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

ప్రత్యేకాధికారులుగా ఐఏఎస్‌లు...

వరద ప్రభావిత జిల్లాలకు పలువురు ఐఏఎస్ అధికారులను ప్రత్యేకాధికారులుగా ప్రభుత్వం నియమించింది. ములుగుకు కృష్ణ ఆదిత్య, భూపాలపల్లికి పి.గౌతమ్, నిర్మల్‌కు ముషారఫ్ అలీ, మంచిర్యాలకు భారతి హోలికేరి, పెద్దపల్లికి సంగీత సత్యనారాయణ, ఆసిఫాబాద్‌కు హన్మంతరావును కేటాయించింది.

వరద చూసేందుకు వెళ్లి చిక్కుకుంటున్నారు

వర్షాల నేపథ్యంలో ప్రజలు నీటి ప్రవాహం ఉన్న రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జీలపై ప్రయాణించవద్దని సీఎస్ సూచించారు. చాలాచోట్ల వరద పరిస్థితులను చూసేందుకు వెళ్లినవారు అనూహ్యంగా ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారని చెప్పారు.

ప్రత్యేక కంట్రోల్ రూమ్..

సహాయ, పునరావాస కార్యక్రమాల పర్యవేక్షణకు ముగ్గురు సీనియర్ అధికారులతో సచివాలయంలో 7997950008, 7997959782, 040 - 23450779 అనే ఫోన్ నంబర్లతో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని సీఎస్ తెలిపారు. అన్ని జిల్లా కలెక్టరేట్లలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ములుగు జిల్లా ముత్యాలధార జలపాతంలో చిక్కుకుపోయిన 80 మంది పర్యాటకులను బుధవారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో సురక్షితంగా బయటకు తెచ్చామని తెలిపారు.

వైద్యుల సెలవులు రద్దు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎడతెగని వర్షాలు, వరదలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ వైద్యులు, ఉద్యోగుల అన్ని సెలవులను రద్దు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. దీంతో ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్య అధికారులు తమ కిందిస్థాయి ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయవద్దని ఆదేశించారు. అన్ని సెలవులను తక్షణమే రద్దు చేయాలని కోరారు. వైద్య ఉద్యోగులంతా తాము పనిచేసే ప్రాంతాలను దాటకూడదని, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్య వేక్షించాలని సూచించారు. ఆదేశాలను ఎవరైనా ధిక్కరిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. కాగా, హైదరాబాద్‌లోని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయంలో 24 గంటలూ పని చేసేలా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. బాధితులు ఎవరైనా సాయం కోసం 040-24651119 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని సూచించారు.


సహాయక చర్యలు ముమ్మరం: నాగిరెడ్డి



సాక్షి, హైదరాబాద్:వదలని వాన, ముంచుకొస్తున్న వరదల నేపథ్యంలో అన్ని ఫైర్ స్టేషన్ల సిబ్బందిని అప్రమత్తం చేశామని, 18 రెస్క్యూ బోట్లను అందుబాటులో ఉంచామని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. 'ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలో వరద ముంపు ఎక్కువగా ఉంది. అక్కడ సహాయక బోట్లతోసహా సిబ్బందిని అందుబాటులో ఉంచాం. భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామంలో వరదలో చిక్కుకున్న 70 మందిని అగ్నిమాపకశాఖ బోట్ల ద్వారా తొలుత సురక్షిత ప్రాంతాలకు చేర్చాం. నిజామాబాద్, నిర్మల్, కరీంనగర్, భద్రాచలం జిల్లాల్లో ఇప్పటికే బోట్లను సిద్ధంగా పెట్టాం. హైదరాబాద్‌లో పది బోట్లను అందుబాటులో ఉంచాం' అని చెప్పారు. అత్యవసరాల్లో ప్రజలు అగ్నిమాపక శాఖ సాయం కోసం 101 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

బఫర్ జోన్‌లో ఎలా నిర్మిస్తారు?

- అక్కడ ఎలాంటి నిర్మాణం లేదంటూ అఫిడవిట్ వేయండి
- రామమ్మమ్మ కుంట నిర్మాణాలపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నగరంలోని రామ్మమ్మ కుంట ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణం చేపట్టడం లేదంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీని హైకోర్టు ఆదేశించింది. చట్టబద్ధమైన సంస్థ అయిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర అసహ నం వ్యక్తం చేసింది. నగరంలోని చెరువులు, కుంటలు ఇతర నీటి వనరుల ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ నిర్ధారణకు నోటిఫికేషన్ జారీ చేయాలని, దీన్ని తదుపరి విచారణ రోజున కోర్టుకు అందజేయాలని స్పష్టం చేసింది. అలాగే హెచ్ఎండీఏ పరిధిలో ఎన్ని కుంటలు, చెరువులకు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ ఫిక్స్ చేశారు.. ఇంకా ఎన్ని చేయాలి.. పూర్తి వివరాలతో రెండు వారాల్లోగా నివేదిక అందజేయాలని చెప్పింది. రామ్మమ్మ కుంట బఫర్ జోన్ పరిధిలోని 4 ఎకరాల స్థలంలో టూరిజం పేరిట నిర్మిస్తున్న భవనానికి అక్రమంగా ఆడిటోరియం, అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నా పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై తీవ్రంగా మండిపడింది. తదుపరి విచారణను ఆగస్టు 11కు వాయిదా వేసింది.

స్టేటస్ కో ఆదేశాలను ఎత్తివేయాలని కోరిన ప్రభుత్వం

రామ్మమ్మ కుంట బఫర్ జోన్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం భవనం నిర్మించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం జూన్‌లో స్టేటస్ కో విధించింది. మళ్లీ ఈ పిటిషన్ గురువారం సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం ముందు విచారణకొచ్చింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే భవన నిర్మాణం దాదాపు పూర్తయిందని, భవనాన్ని పెంచడానికి అన్ని అనుమతులున్నందున స్టేటస్ కో ఆదేశాలను ఎత్తివేయాలని కోరారు. అక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. రామ్మమ్మ కుంట ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ మ్యాప్‌ను పరిశీలించిన ధర్మాసనం.. భవనంలో ఎక్కువ భాగం బఫర్ జోన్‌లో లేదని, కొద్దిభాగం మాత్రమే ఉందంది. స్టేటస్ కో ఆదేశాలను సవరిస్తూ బఫర్ జోన్‌లోకి రాకుండా భవన నిర్మాణం చేసుకోవచ్చని చెప్పింది.

రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ ప్రాంతాల్లో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో పట్టాలపైకి పెద్దఎత్తున వరదనీరు వచ్చి చేరడంతో కొన్ని మార్గాల్లో గురువారం రైళ్లను నిలిపివేశారు. మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేయడంతోపాటు కొన్ని రైళ్లను దారి మళ్లించారు. హసన్‌పర్తి-కాజీపేట్ మార్గంలో వరదనీరు ప్రమాదకర స్థాయికి చేరిందని, దీంతో సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్, బీదర్-హైదరాబాద్ రైళ్లను రద్దు చేసినట్లు సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తిరుపతి-కరీంనగర్ (12761/12762), సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ (12757/12758) రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. యశ్వంత్‌పూర్-హజ్రత్ నిజాముద్దీన్ (12649), యశ్వంత్‌పూర్- గోరఖ్‌పూర్ (22534), సికింద్రాబాద్-హజ్రత్ నిజాముద్దీన్ (12285) ఎక్స్‌ప్రెస్ రైళ్లను వివిధ మార్గాల్లో దారిమళ్లించారు. అలాగే సికింద్రాబాద్-దానాపూర్ (12791), తిరువనంతపురం-న్యూఢిల్లీ (12625), బెంగళూరు-దానాపూర్ (03252), చెన్నైసెంట్రల్-అహ్మదాబాద్ (12656) తదితర రైళ్లను కూడా మళ్లించినట్లు సీపీఆర్వో చెప్పారు. వరంగల్, కాజీపేట్ మార్గంలో రాకపోకలు సాగించే మరో 13 ఎక్స్‌ప్రెస్ రైళ్లనూ ఇతర మార్గాల్లోకి మళ్లించారు.

అనంత కరుణామయుడు (అల్లాహ్)! ఆయనే త్రాసును నెలకొల్పాడు. తద్వారా మీరు తూకంలో మోసానికి పాల్పడ కూడదని! న్యాయంగా తూకం చేయండి. తూకంలో తగ్గించకండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 28 జూలై 2023

సంస్కరణల స్వీయహననం!

ప్రజలు, ప్రతిపక్షాల నుంచి నెలల తరబడి నిరసన వ్యక్తమవుతున్నా, తాము అనుకున్నదే చేసే పాలకులు ప్రపంచమంతటా ఉంటారు. మొత్తం 93 లక్షల జనాభాలో, రెండున్నర లక్షల మందికి పైగా జనవరి నుంచి వీధికెక్కి నిరసనకు దిగుతున్నా, ఇజ్రాయెల్‌లోని బెంజమిన్ నెతన్యాహూ సర్కార్ తాను అనుకున్నదే చేసింది. దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని అత్యంత భారీ నిరసనల్ని సైతం తోసిపుచ్చి, ఇజ్రాయెలీ పార్లమెంట్ వివాదాస్పద న్యాయసంస్కరణల్లో మరో కీలక అంశానికి సోమవారం ఆమోద ముద్ర వేసింది. దేశంలో అధికార సమతూకాన్ని మార్చేసే ఈ చర్య సంచలనమైంది. మంత్రులు తీసుకొనే నిర్ణయాలు 'నిర్హేతుకం' అనిపించినప్పుడు వాటిని కొట్టివేసేందుకు సుప్రీమ్ కోర్ట్‌కు ఇప్పటి దాకా అధికారముంది. సరికొత్త సోకాల్డ్ 'సహేతుకత' బిల్లుతో దానికి కత్తెర పడనుంది.

రాబోయే రోజుల్లో మరో ఓటింగ్‌లో న్యాయ నియామకాలపైనా ప్రభుత్వానికే మరిన్ని అధికారాలు కట్టబెట్టాలన్నది తదుపరి ఆలోచన. ఈ మార్పుల్ని కొందరు సమర్థిస్తున్నప్పటికీ, అత్యధికులు వ్యతిరేకిస్తున్నారు. కలిగే విపరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి, అధిక శాతం ఇజ్రాయెలీలు లౌకికవాద, వామపక్ష, ఉదారవాదులు. కానీ, తీవ్ర మితవాద పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుతో అక్కడి ప్రభుత్వ విధానమూ మితవాదం వైపు మొగ్గుతోంది. ఆ ప్రభుత్వాలకూ, న్యాయవ్యవస్థకూ మధ్య తరచూ ఘర్షణ తలెత్తుతోంది. దీనికి విరుగుడుగా కోర్టు కోరలు పీకేయాలనేది ఛాందస, జాతీయవాద నెతన్యాహూ సర్కార్ ప్రయత్నం. పాలకులపై ఉన్న ఏకైక అంకుశమైన కోర్ట్‌ను సైతం అలా ప్రభుత్వ నియంత్రణలోకి తెస్తే, వ్యవస్థల పరంగా ఉన్న సమతూకం దెబ్బతినడం ఖాయం. అందుకే, ఇన్ని నెలలుగా దేశంలో ఈ భారీ ప్రజాందోళనలు.

కార్యనిర్వాహక, శాసననిర్మాణ, న్యాయవ్యవస్థలు మూడింటికీ మధ్య అధికార విభజనలో అనేక అంశాలను మార్చాలని నెతన్యాహూ కొంతకాలంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన సారథ్యంలోని సాంప్రదాయవాద, మతతత్త్వ సంకీర్ణ ప్రభుత్వం అందుకు కంకణం కట్టుకుంది. అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్న ఆయన కోర్టు భవిష్యత్ తీర్పులు తనపై ప్రభావం చూపకుండా ఉండేందుకే ఈ పని చేస్తున్నారని విమర్శకుల మాట. నిజానికి, ఇజ్రాయెల్‌లో రాజ్యాంగమంటూ లేదు గనక, పై మూడు వ్యవస్థల మధ్య వ్యవహారమంతా వ్యక్తిగత చట్టాలు క్రమబద్ధీకరిస్తుంటాయి. పార్లమెంట్‌లో రెండో సభ లేదు గనక అది చేసే చట్టాలకు అవసరమైతే ముకుతాడు వేసేలా సుప్రీమ్ కోర్ట్‌కే బలమైన స్థానం ఉందక్కడ! ఇలా న్యాయవ్యవస్థకు అతిగా అధికారాలున్నాయనేది ప్రభుత్వ మద్దతుదార్ల భావన. ఎంపీల్లా జడ్జీలనేమీ ప్రజలు నేరుగా ఎన్నుకోవడం లేదనీ, ఇప్పుడీ ప్రతిపాదిత సంస్కరణలతో అధికార సమతూకం మెరుగై, ప్రజాస్వామ్యం పటిష్ఠమవుతుందనీ వారి వాదన.

సంస్కరణల్ని వ్యతిరేకిస్తున్నవారు మాత్రం దీన్ని ప్రజాస్వామ్య విధ్వంసం అంటున్నారు. లింగ సమానత్వం, లైంగిక అల్పసంఖ్యాకుల రక్షణ లాంటి అంశాలను గతంలో సుప్రీం పదేపదే సమర్థించిందనీ, రేపు ఈ కొత్త సంస్కరణలతో అందుకు అవకాశం లేక సమాజం చీలిపోతుందనీ వాదిస్తున్నారు. తాజా సంస్కరణలు దేశంలో అతి సాంప్రదాయ వర్గాన్ని బలోపేతం చేస్తాయన్నది లౌకికవాదుల భయం. ఈ అంశం సైన్యం దాకా పాకింది. ఇప్పటికే స్త్రీ పురుషులిద్దరూ సైన్యంలో తప్పనిసరిగా సేవలందించాలన్న నిబంధన నుంచి అతి సాంప్రదాయ యూదులను ప్రభుత్వం మినహాయించింది. సుప్రీం దీన్ని తప్పుబట్టి, ఇది దుర్విచక్షణ అని పదే పదే ప్రకటించింది. ఇప్పుడీ న్యాయ సంస్కరణల్ని అమలుచేస్తే, స్వచ్ఛంద సేవ నుంచి వైదొలగుతామంటూ వెయ్యిమందికి పైగా ఇజ్రాయెలీ ఎయిర్ ఫోర్స్ రిజర్విస్టులు హెచ్చరించారు. గూఢచర్య సంస్థలు సహా అనేక ఇతర విభాగాల్లోని వారూ తమదీ ఆ మాటే అంటున్నారు. అదే జరిగితే ఆ దేశ భద్రతకు ముప్పే!

మరోపక్క, పార్లమెంట్ ఆమోదించిన సంస్కరణ క్లాజుపై కోర్టుకెక్కనున్నట్టు పౌరసమాజ బృందాలు ప్రకటించాయి. అంటే తమ అధికారాలకు కత్తెర వేయడం సహేతుకమో, కాదో జడ్జీలే పరీక్షించాల్సి వస్తుంది. న్యాయమూర్తులు గనక ఈ సంస్కరణను అడ్డుకుంటే, ఇజ్రాయెల్ ఊహించని జాతీయ సంక్షోభంలో పడవచ్చు. ఒకవేళ దాన్ని నివారించేందుకు ప్రభుత్వం తాజా సంస్కరణను ఉపసంహరించుకుంటే, అది చివరకు పాలక సంకీర్ణం కుప్పకూలడానికి దారి తీయవచ్చు. ఏదైనా చిక్కే! మధ్యప్రాచ్యంలో ఏకైక ఆధునిక ప్రజాస్వామ్యంగా ఇజ్రాయెల్‌కున్న పేరు ఈ మొత్తం వ్యవహారంలో దెబ్బతింటుంది. దేశ ఆర్థికవ్యవస్థ, విదేశాంగ విధానం పైనా దెబ్బ పడుతోంది.

న్యాయసంస్కరణల సంక్షోభంతో ఫిబ్రవరి నాటికి 400 కోట్ల డాలర్లు ఇజ్రాయెల్ నుంచి తరలిపోయాయట. అలాగే, దేశ శ్రామికశక్తిలో 11 శాతం మంది దాకా హైటెక్ రంగ ప్రవీణులు. వారిలో అధికశాతం సంస్కరణల్ని వ్యతిరేకిస్తూ, వీధికెక్కినవారే! ఈ సాంకేతిక ప్రతిభాశాలురు దేశం విడిచి పోవచ్చు. అలా జరిగితే అది మరో దెబ్బ. ఇక, న్యాయ ప్రక్షాళనకు బలమైన మద్దతుదారులంతా ప్రధానంగా ఇజ్రాయెల్ దురాక్రమణను సమర్థిస్తున్నవారే! మరోమాటలో ఈ తీవ్ర మితవాదులంతా దేశాన్ని నిరంకుశ మతరాజ్య వ్యవస్థగా మార్చి, ఆక్రమణలతో దేశాన్ని విస్తరించాలని కోరుకుంటున్నవారే. దశాబ్దాల కష్టంతో నిర్మాణమైన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థల సుస్థిరతకూ, అభివృద్ధికీ, భద్రతకూ దేనికీ ఇది శ్రేయోదాయకం కాదు. ప్రజాస్వామ్య విలువల పునాదిపై ఎదిగి, పొరుగు దేశాలకు తనను కాస్తంత భిన్నంగా నిలిపిన ఆ మౌలిక సూత్రాన్నే కాలరాస్తానంటే అది ఇజ్రాయెల్‌కు ఆత్మహననమే. బిల్లుతో నెతన్యాహూ బలోపేతులయ్యారేమో కానీ, ఇజ్రాయెల్ బలహీనమైపోయింది.

ఇది భారతీయ మహిళల గురించి...

అభిప్రాయం



బర్ఖా దత్

ఒక రిపోర్టర్‌గా, నేను దశాబ్దాలుగా లెక్కలేనన్ని భయంకర ఘటనలను చూశాను. కానీ ఆ వీడియోలో ఉన్నది వేరే – ఇద్దరు మహిళల దుస్తుల్ని విప్పి, నగ్నంగా ఊరేగించారు. వారిలో ఒకరిని తర్వాత క్రూరంగా సామూహిక అత్యాచారం చేశారు. ఇది చూసిన ప్రతి భారతీయ మహిళ హృదయం బద్దలైపోయింది. ఈ భయంకరమైన కేసు గురించి తనకు (వీడియో బయటికి రాకముందు) తెలియదని మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అంటున్నారా? లేక తనకు తెలిసిందనీ, కానీ చర్య తీసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాననీ ఒప్పుకుంటున్నారా? ఎలాగైనా సరే, ఇది ఆయన అసమర్థతను లేదా నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తుంది. బీరేన్ సింగ్ రాజీనామా చేయాలి లేదా ఆయన్ని ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలి!

"ఆ వీడియోలో ఉన్న స్త్రీలకు జరిగింది అనుభవించడం కంటే నేను మరణాన్ని ఎంచుకుంటాను," అని మణిపూర్ కుకీ సమాజానికి చెందిన హక్కుల కార్యకర్త గ్లాడీ హుంజన్ నాతో అన్నారు. కన్నీళ్లు ధారాపాతంగా కారుతున్నందున ఆమె పదాలను కూడా కూడగట్టుకోలేక పోయారు. నిరాశ, నిస్సహాయత, కోపం, వేదనతో ఆమె ఏడ్చినప్పుడు, నేను కూడా ఏడ్చాను.

ఒక రిపోర్టర్‌గా, నేను దశాబ్దాలుగా లెక్కలేనన్ని భయంకర ఘటనలను చూశాను. కానీ ఆ వీడియోలో ఉన్నది వేరే – ఇద్దరు మహిళల దుస్తుల్ని విప్పి, నగ్నంగా ఊరేగించారు. ఒక మూక వాళ్లను తోసుకుంటూ, నెట్టుకుంటూ వచ్చింది. వారిలో ఒకరిని తర్వాత క్రూరంగా సామూహిక అత్యాచారం చేశారు. ఇది చూసిన ప్రతి భారతీయ మహిళ హృదయం బద్దలైపోయింది.

గుమికూడినవాళ్లు చూస్తుండగానే మూక ద్వారా లైంగిక వేధింపులకు గురైన 21 ఏళ్ల మహిళ గురించీ, ఆమెను రక్షించడానికి ప్రయత్నించినందుకు అక్కడికక్కడే మూక చంపేసిన ఆమె సోదరుడి గురించీ నేను ఆలోచిస్తూనే ఉన్నాను. అతడి వయస్సు కేవలం 19 సంవత్సరాలు.

ప్రధానమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తి కూడా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి మందలింపులు రెండు నెలలుగా జడత్వంలో ఉండిపోయిన ఒక ముఖ్యమంత్రిని నిద్ర లేపాయి. అకస్మాత్తుగా, కొన్ని గంటల వ్యవధిలో, ప్రధాన నింది తుడిని అరెస్టు చేశారు.

కాబట్టి, ఇన్ని రోజులు ఎన్. బీరేన్ సింగ్ ఈ ఘటనపై ఉద్దేశపూర్వకంగా వేరే దృష్టితో చూస్తున్నారా లేక ఏం జరిగిందో ఆయనకు నిజంగానే తెలియదా? ఎలా భావించినా ఆయన (ఇప్పటికే తగ్గిపోయిన) విశ్వసనీయత గురించి సానుకూల మాట రాదు.

నన్ను వివరించనివ్వండి

ఈ సామూహిక అత్యాచారం, హత్యా ఘటన మే 4న జరిగినట్లు మనకు తెలుసు. జీరో ఫస్ట్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్ (జీరో–ఎఫ్ఐఆర్)గా పిలిచే మొదటి పోలీసు ఫిర్యాదును మే 18న దాఖలు చేశారు. 2012లో జరిగిన సామూహిక అత్యాచారం తర్వాత, జస్టిస్ జేఎస్ వర్మ ప్యానెల్ ప్రవేశపెట్టిన విధానం ఇది. లైంగిక వేధింపుల బాధితురాలు భారత దేశంలో ఎక్కడైనా, అధికార పరిధితో సంబంధం లేకుండా పోలీసు కేసును దాఖలు చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఆ తర్వాత



ఎఫ్ఐఆర్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపుతారు. ఈ కేసులో జూన్ 21న సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఎఫ్ఐఆర్‌ను పంపారు.

60 రోజులకు పైగా, అత్యాచారం–హత్య ఘటనపై ఎఫ్ఐఆర్‌ను ఎవరూ పట్టించుకోలేదు. ఈ వీడియో బయటపడి, దేశం మొత్తాన్ని ఆగ్రహానికి గురి చేసి ఉండకపోతే, రేపిస్టులు, హంతకులు ఇంకా బయటే ఉండేవారు. కాబట్టి, లైంగిక వేధింపులకు సంబంధించిన ఈ భయంకరమైన కేసు గురించి తనకు తెలియదని సింగ్ అంగీకరిస్తున్నారా? లేక తనకు తెలిసిందనీ, కానీ చర్య తీసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాననీ ఒప్పుకుంటున్నారా?

ఎలాగైనా సరే, ఇది ఆయన అసమర్థతను లేదా నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తుంది. బీరేన్ సింగ్ రాజీనామా చేయాలి లేదా ఆయన్ని ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలి. ఈ ఒక్క అతి భయానక సంఘటన వల్ల మాత్రమే కాదు, గత రెండు నెలలుగా ఆయన దారుణ వైఫల్యాల కారణంగా ఆయన్ని తొలగించాలి. ఇంకా జాతీయ పతాక శీర్షికలకు ఎక్కని ఇతర అత్యాచారాలు, హత్యా ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. అవును, వాస్తవానికి, జాతి విభజనకు సంబంధించి రెండు వైపులా బాధితులు, నేరస్థులు ఉన్నారు.

నిజమేమిటంటే, బీరేన్ సింగ్ ఆఖరికి తన సొంత శాసన సభ్యులను కూడా రక్షించడంలో విఫలమయ్యారు. ఉదాహరణకు వుంగ్‌జగిన్ వాల్టే గురించి ఆలోచించండి. ఆయన సింగ్ సహచరుడు, భారతీయ జనతా పార్టీ శాసన సభ్యుడు, ముఖ్యమంత్రి సలహాదారు. ఆయనపై దాడి జరిగింది. ఆయన మాట్లాడలేని, నడవలేని స్థితిలో ఢిల్లీలోని ఆసుపత్రి బెడ్‌లో కట్లతో పడి ఉన్నారు. తమ కుటుంబం ఎప్పటికీ మణిపూర్‌కు తిరిగి వెళ్లదని ఆయన భార్య అన్నారు.

నిజమేమిటంటే, స్థానిక పరిపాలనలోని అన్ని విభాగాలు జాతుల పరంగా చీలిపోయినప్పటికీ, ఇప్పటికీ విశ్వసనీయతను కలిగి ఉన్న ఏకైక వ్యవస్థ సైన్యం మాత్రమే. మైతేయిలు, కుకీల మధ్య బఫర్ జోన్‌లను ఏర్పాటు చేస్తున్నది సైన్యమే; ఇరువైపులా కమ్యూనిటీ నాయకులతో చర్చలను ప్రారంభించిందీ సైన్యమే. పైగా ఇటీవలి ఒక వీడియోలో చెప్పినట్లుగా, 'మానవీయంగా ఉండటం బలహీనతకు సంకేతం కాదు' అని సైన్యం భారతీయులకు గుర్తు చేస్తోంది. ఇంకా గుర్తుంచుకోండి, మణిపూర్‌లోని అనేక ప్రాంతాలలో సైన్యం సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టానికి చెందిన చట్టపరమైన రక్షణ లేకుండా పనిచేస్తోంది.

ఆ వీడియో కీలకమైన సాక్ష్యాలను అందించిందనీ, వ్యక్తులను గుర్తించడంలో పోలీసులకు సహాయపడిందనీ బీరేన్ సింగ్ పేర్కొన్నారు. అలా అయినప్పుడు, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖలోని కొందరు అధికారులు మణిపూర్‌పై నివేదికలను, ప్రదర్శనలను (వీటిలో నావి కూడా ఉన్నాయి) ఆపమని కోరడం విడ్డూరం కాదా? ఆ మహిళలను గుర్తించేలా ఉన్నవీ, లేదా దాడికి సంబంధించిన క్రూరత్వాన్ని తెలిపేవీ చూపడానికి ఏ మీడియా హౌస్‌ను కూడా అనుమతించకూడదు. అలాంటి వీడియోలను బ్లాక్ చేయాలి. అయితే, నిర్దిష్టమైన సంపాదకీయ రక్షణతో ఆ వీడియోను ప్రస్తావిస్తున్నప్పుడు కూడా దాని చుట్టూ ఉన్న మీడియా కవరేజీని తొలగించడం అంటే, మణిపూర్ భయానక స్థితిని వివరంగా చెప్పడాన్ని తీవ్రంగా అడ్డుకోవడమే అవుతుంది.

"ఇది కుకీలు లేదా మెయితీల గురించి కాదు... ఇది భారతీయ మహిళల గురించి. మొత్తం భారతీయ మహిళల గురించి" అని గ్లాడీ హుంజన్ చిన్నపిల్లలా ఏడుస్తూ నాతో చెప్పారు. ఈ వీడియో చూసి భారతీయ మహిళలమైన మనం వణికిపోయిన సమయంలోనే, లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ పార్లమెంటేరియన్‌కు ఢిల్లీ పోలీసుల నుంచి అనూహ్యంగా బెయిల్ వచ్చింది. పైగా అత్యాచార దోషి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు పెరోల్ వచ్చింది.


మణిపూర్ గురించి, ఆ వైరల్ వీడియో గురించి మనందరం పట్టించుకోవాలి. మణిపూర్ ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి రాష్ట్ర పతి పాలన విధించడమే ప్రారంభ చర్య అవుతుంది.

వ్యాసకర్త ప్రముఖ పాత్రికేయురాలు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎవరైనా సరే!



మోదీ తర్వాత ఎవరు? అత్యంత మూర్ఖమైన ప్రశ్న. ఎవరైనా ఆయనకన్నా మంచి ప్రధాని కాగలరు. ఎవరైనా! ఇండియా మార్పును కోరుతోంది. ఒక కొత్త ముఖం, నిజమైన నాయకుడు కావాలి.

– సంజయ్ ఝా, రచయిత


ఏకపక్ష రాతలు



మణిపూర్ హింసలో భాగమయ్యే మూక మైతేయిలు అయితే, ప్రతి ఒక్కరూ 'హిందువులైన ఆధిపత్య మైతేయిలు' అని కారం జల్లుతారు. వేరే మూక అయితే, అది కేవలం 'మూక' మాత్రమే. మణిపూర్ ప్రస్తుత పరిస్థితి మీద జనాలు ఎలా తీర్పులిస్తున్నారో అర్థం కావట్లేదా?

– చిత్ర అహంతెమ్, మణిపూర్ కాలమిస్ట్

ఫర్లేదా?



పాకిస్తాన్‌లోని అలీ మసీదులో దాక్కున్న తీవ్రవాదిని వెతుకుతూ పోలీసులు వెళ్లారు. తీవ్రవాది తనను తాను పేల్చుకోవడంతో మసీదు పేలిపోయింది. పశ్చిమ దేశాల్లో ఖురాన్‌ను కాల్చినందుకు నిరంతర నిరసనలు జరుగుతున్నాయి. కానీ తమలో ఒకడే మసీదును పేల్చినందుకు ఎవరి మనోభావాలూ గాయపడలేదా?

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

పులుపు ఫలం



విటమిన్ సి ఎక్కువ తీసుకోవడం వల్ల రక్తంలో యాంటీ ఆక్సిడెంట్ల స్థాయిలు 30 శాతం వరకు పెరుగుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవడంలో ఇవి శరీర సహజ రక్షణ వ్యవస్థకు సాయపడుతాయి.

– డెన్నిస్ వాకర్, ఫిజీషియన్

నవ కాశ్మీరం



శ్రీనగర్ పాత దారుల గుండా 34 ఏళ్ల తర్వాత మొహర్రం ఊరేగింపును అనుమతించడంలోని ప్రత్యేకతను బయటివాళ్లు కొందరే అర్థం చేసుకోగలరు. ధార్మిక మతభేదాల సంక్లిష్టత, భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఇది నిజమైన మార్పు.

– రిషి సూరి, జర్నలిస్ట్

మా గోవా!



గోవాకు వచ్చినప్పుడు, గోవాను గోవన్లు ఎలా ఎంజాయ్ చేస్తారో అలా చేయండి. గోవాలో 'ఏదైనా చేయచ్చు' అన్న ఆలోచనతో మీ 'పోకిరి ప్రవర్తన'ను వెంట తేవద్దు. మీ పిచ్చి ఫ్యాంటసీలు తీర్చడానికి గోవా అనేది సానికొంప కాదు, స్వర్గం. చక్కెర లేని బ్లాక్ కాఫీ మాత్రమే తాగుతున్నాను.

– సేవియో రోడ్రిగ్స్, సంపాదకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ఆయన మార్గంలోనే ఐక్యత సాధ్యం

భారత కమ్యూనిస్టు విప్లవకారుల నాయకుడు, పీడిత ప్రజల ప్రియతముడు, భారత ప్రజా యుద్ధ పంథా రూపొందించటంలో ప్రముఖ పాత్ర వహించిన అమరుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి(టీఎన్) వర్ధంతి నేడు. టీఎన్ అనంతపురం జిల్లాలోని 'తరిమెల' గ్రామంలో 1917న జన్మించారు. లా కోర్సు చదవడానికి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో చేరి దక్షిణ భారతదేశం నుంచి మొదటి విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో 'యుద్ధం–ఆర్థిక ప్రభావం' అన్న పుస్తకం రాసినందుకు ఆయన్ని బ్రిటిష్ వలస పాలకులు తిరుచరాపల్లి జైలుకు తరలించారు. 1939లో కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. తండ్రి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను వ్యతిరేకించారు. ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించారు. 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అవసరమైన వాటిని సమకూర్చే బాధ్యతను తీసుకున్నారు. 1948లో పార్టీపై నిషేధం విధించినప్పుడు రహస్య జీవితంలోకి వెళ్లారు. ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టు ఉద్యమా నికి కంటకంగా ఉన్న తన తండ్రిని అవసరమైతే అంతమొందించా లన్న పార్టీ నిర్ణయాన్ని ఆమోదించి వర్గ చైతన్యాన్ని ప్రదర్శించారు. తండ్రిని వ్యతిరేకించి వెయ్యి ఎకరాల కుటుంబ భూములు ప్రజలకు పంపిణీ చేశారు.



తరిమెల నాగిరెడ్డి

ఎంపీగా ఒకసారి, ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచారు. ప్రజా ప్రతినిధిగా విప్లవం సాధించలేనని గ్రహించి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. కమ్యూనిస్టు పార్టీలో మితవాద ధోరణిని వ్యతిరేకిస్తూ కొంతమంది 1964లో బయటికి వచ్చి సీపీఎంగా ఏర్ప డ్డారు. ఈ పార్టీ ఏర్పాటులో తరిమెల నాగిరెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆ పార్టీ కూడా విప్లవ కార్యాచరణలో విఫలమయ్యిందని దాని నుంచి బయటికి వచ్చి 'ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ కారుల సమన్వయ కమిటీ'ని ఏర్పాటు చేశారు. చారు మజుందార్ అతివాద, వ్యక్తిగత హింసావాదానికి వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందించేందుకు మద్రాస్‌లో సమావేశమైన సందర్భంగా నాగిరెడ్డితో పాటు రాష్ట్రనాయకత్వం మీద ఏపీ ప్రభుత్వం కుట్రకేసు బనాయించింది. కేసు విచారణ సందర్భంగా తనపై మోపబడిన నేరారోపణకు సుదీర్ఘమైన స్టేట్‌మెంట్‌ను కోర్టులో జడ్జీకి వినిపించారు టీఎన్. అదే ఆ తరువాత 'తాకట్టులో భారతదేశం' అనే పుస్తకంగా వెలువడింది. 1975లో భారత కమ్యూనిస్టు విప్లవ కారుల సమైక్యతా కేంద్రం–మార్క్సిస్ట్, లెనినిస్ట్ (యూసీసీఆర్ఐ–ఎంఎల్)ను ఏర్పాటు చేశారు. ఇంతలో ఇందిరాగాంధి దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించి యూసీసీఆర్ఐ (ఎమ్ ఎల్)తో పాటు ఇతర విప్లవ సంస్థలపై నిషేధం విధించారు. టీఎన్ రహస్య జీవితం గడుపుతూ అనారోగ్యానికి గురై మారు పేరుతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ 1976 జూలై 28న హైద్రాబాద్‌లో తుది శ్వాస విడిచారు. ఆయన చూపిన మార్గంలో విప్లవ కారులు ఐక్యం కావాలి.

– బొల్లిముంత సాంబశివరావు
ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
(నేడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి వర్ధంతి)

దేశ ప్రయోజనాల దృష్టితో మెలగాలి

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

ఈశాన్య రాష్ట్రాల్లో జాతుల మధ్య ఘర్షణలు, దాడులు, ప్రతి దాడులు, హింస, దౌర్జన్యాలు, గృహ దహనాలు సర్వసాధారణమైన విషయం. అస్సాం రాష్ట్రం 20 సంవత్సరాలు అగ్నిగోళంగా మండింది. నాగాలాండ్ రాష్ట్రం ఇదే తరహాలో కేంద్ర ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఈ రెండు రాష్ట్రాల పరిస్థితుల విషయంలో దేశంలోని రాజకీయ పార్టీలు సంయమనంతో వ్యవహరించి, పరిస్థితులు చక్కదిద్ది, తమ రాజకీయ హుందాతనాన్ని నిలబెట్టుకున్నాయి. నేడు దేశంలో రాజకీయ పార్టీలు మాత్రం తమ రాజకీయ స్వార్థాలను పండించుకోవడంలో పోటీ పడుతున్నాయనేది వాస్తవం.

మణిపూర్‌లో కుకీలు, మైతేయిలు ఆదిమ తెగలు అనే విషయం మర్చిపోకూడదు. మైతేయిలు మైదాన ప్రాంత వాసులు కాబట్టి అభివృద్ధిలో ముందు ఉన్నారు. కుకీలు కొండ ప్రాంతవాసులు కావడంతో వెనకబడి పోయారు. మైతేయిల అభివృద్ధి పైనా, రాజకీయ చురుకుదనం పైనా, చైతన్య శీలత పైనా అపోహలను కుకీ ప్రజల మనసుల్లో ప్రణాళికాబద్ధంగా అనేక అంతర్జాతీయ సంస్థలు నిర్మాణం చేశాయనేది వాస్తవం. ఇక మైతేయిల విషయానికొస్తే కుకీల స్వాధీనంలో ఎక్కువ భూమి ఉందనీ, ప్రత్యేక ఆదివాసీ చట్టాలను వినియోగించుకుని, విదేశాల నుండి వచ్చే నిధులతో జల్సాలు చేస్తున్నారనీ, తాము జనాభా పరంగా ఎక్కువగా ఉన్నప్పటికీ, తక్కువ భూమితో సరిపెట్టుకోవాల్సి వస్తున్నదనీ, కుకీలు మైదాన ప్రాంతాల్లోకి చొర బడుతున్నారనీ, బర్మా నుండి వచ్చే అక్రమ వలసదారులకు వారు ఆశ్రయం కల్పిస్తున్నారనీ భావిస్తున్నారు. పైగా రాష్ట్రంలో హిందుత్వ విలువలకు ప్రాతినిధ్యం వహించే భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కావడం కుకీ తెగను రెచ్చగొట్టే వారికి బలాన్ని ఇచ్చిన విషయం అయ్యింది.



ఇక ఇద్దరు కుకీ మహిళల నగ్న ఊరేగింపు వీడియో పార్లమెంటు సమావేశాల ముందు ప్రస్తావనకు రావడం, మోదీ ప్రభుత్వ వ్యతిరేకులకు పెద్ద ప్రచారాస్త్రమే. మణిపూర్ దురాగతాలను ప్రపంచానికి చూపించి, భారతదేశాన్ని అంతర్జాతీయంగా అప్రతిష్ఠ పాలు చేయడానికి కొన్ని అంతర్జాతీయ సంస్థలు పన్నిన కుట్ర అని ఎందుకు భావించకూడదు? కశ్మీర్ లోయలో ఇంతకంటే భయంకరమైన సంఘటనలు ఏళ్ల తరబడి చోటు చేసుకున్నాయి. ఇక్కడ జరిగిన సంఘటనలకు మసి పూసి మారేడు కాయ చేసిన మీడియాలోని ఒక వర్గం నేడు మణిపూర్ సంఘ టనలను భూతద్దంలో చూపించి, రాక్షసానందం పొందాలని చూడడం ఒక వైచిత్రి. కుకీలు క్రైస్తవ మతానికి చెందిన వారనీ, మైతేయిలు హిందూ మతానికి చెందిన వారనీ రాష్ట్రంలోని ప్రభుత్వం కుకీల పట్ల పక్షపాతం ప్రదర్శిస్తుందనీ, మోదీ ప్రభుత్వ వ్యతిరేక వర్గం తన పైశాచికతకు పదును పెట్టింది. దహనం చేయబడ్డ మైతేయిల ప్రాంతాలు, శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఎవరికీ ఎరుకరావు. ముఖ్య మంత్రిని తొలగించి, రాష్ట్రపతి పరిపాలన అమలు చేస్తే, ఘర్షణలు సద్దుమణుగుతాయని కాంగ్రెస్ పార్టీ చెప్పే నీతులు పనికి వచ్చేవి కావు. ఈ ప్రయోగాన్ని తాను కశ్మీర్ రాష్ట్రంలో చేసి, చేతులు కాల్చుకున్నదనే విషయం దేశ ప్రజలందరికీ తెలుసు. కుకీలను రెచ్చగొట్టడంలో కాంగ్రెస్ పాత్ర పరోక్షంగా ఉందనే విమర్శకుల అభిప్రాయాలను కొట్టి పారేయలేం.

ఇక మణిపూర్ సంఘటనలపై ప్రతిపక్షాలు చేసే విమర్శలపై కేంద్ర ప్రభుత్వ పెద్దలు చేసే ప్రతి విమర్శల్లో రాజకీయ విజ్ఞత కొరవడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో హత్యలు మానభంగాల కేసులు తారస్థాయికి చేరుకున్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింస, దౌర్జన్యాలూ వాస్తవమే. అక్కడి సంఘటనలను చూపించి, మణిపూర్ సంఘటనలను కప్పిపుచ్చాలని చూడడం భావ్యం కాదు. కుకీలకు మైతేయిలకు మధ్య సాంస్కృతిక, భౌగోళిక విభేదాలను అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు దేశ విశాల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని పరిష్కరించడానికి ముందుకు రావాలి.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

మత సామరస్యానికి ప్రతీక

హిందూ, ముస్లింలు కలిసి మెలిసి జరుపుకొనే పండుగలలో మొహర్రం (పీర్ల) పండుగ ముందు వరుసలో ఉంటుంది. ముస్లిం సోదరుల కంటే చాలా చోట్ల హిందువులే భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో ఈ పండుగ జరుపుకొంటారు. కొన్ని చోట్ల హిందువులే పీర్ల పండుగ నిర్వాహకులుగా ఉంటారు. అటువంటి ఊళ్లలో హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'జాలిగామా' ఒకటి.

ఈ గ్రామంలో సారా అమ్మడం వృత్తిగా జీవించిన ఆరెకటికవారిని ఇప్పటికీ సారోళ్లు (సారావాళ్లు) అని వ్యవహరిస్తారు. గత రెండు మూడు వందల ఏళ్ల నుండి మొహర్రం పీర్ల పండుగను ఈ సారోళ్లు నిర్వహిస్తూ ఉండడం వల్ల వీరి ఇంటి పేరు 'సాహెబ్ జాదా'గా మారింది. ఈ వ్యాస రచయిత ఆ కుటుంబానికి చెందినవాడే.



నాలే హైదర్, హిమామ్ ఖాసీం, లాల్ సాహెబ్ పేర్లతో పిలిచే మూడు పీర్లను మొహర్రం పండుగకు పది రోజుల ముందే నిలబెట్టి భక్తి విశ్వాసాలతో కొలుస్తారు. పీర్ల పండుగకు ముందు రాత్రి చావిడి (పీర్ల కొట్టం) దగ్గర మొత్తం గ్రామమంతా మేల్కొని జాగారం చేస్తుంది. ఆ రాత్రి ఒక కట్టెకు చాదర్లు కట్టి, కొబ్బరి బట్టీల దండలు, పూల మాలలతో అలంకరించి ఊదు పొగ వేస్తూ ఊరంతా ఊరేగిస్తారు. పీర్లకొట్టం దగ్గర అగ్ని గుండం ఏర్పాటు చేసి యువకులు గుండ్రంగా తిరుగుతూ దులాప్ ఆడుతారు. మహిళలు బతుకమ్మ, కోలాటం ఆడుతూ, పాటలు పాడుతూ రాత్రి మొత్తం గడుపుతారు.

జాలిగామా పీర్లను మొక్కితే వివాహం కాని వారికి వివాహం అవుతుందనీ, పిల్లలు పుట్టని వారికి పిల్లలు పుడతారనీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయనీ, ప్రజలకు ఆరోగ్యం బాగుంటుందనేది ప్రజల విశ్వాసం. దీనితో చుట్టు పక్కల గ్రామాల వారు, హైదరాబాద్ నగరం నుంచి కూడా పెద్ద ఎత్తున జనం తరలి వచ్చి పాల్గొంటారు. మలీదా, షర్బత్, రోట్, చొంగ్, జిలేబి, తియ్యని బూంది, కొబ్బరి బట్టీలు... పీర్లకు ప్రసాదంగా సమర్పిస్తారు. పీర్ల పండుగ రోజు 'జాతర అంగడి' నిర్వహించి అన్ని రకాల వస్తువులు, బట్టలు, పిండి వంటలు విక్రయిస్తారు. వందల ఏళ్ల క్రితం జాలిగామా గ్రామం చెరువులో చేతి ఆకారంలో 'పంజా' దొరికిందనీ, అప్పటి నుంచి ఆ ఊరిలో పీర్లను నిలబెట్టి పీర్ల పండుగను పెద్ద ఎత్తున జరుపుతున్నారనీ చెబుతారు.

'కర్బలా' మైదానంలో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన హుస్సేన్, హుస్సేన్ సోదరుల సంస్మరణార్థం ముస్లింలలో ఒక వర్గం ప్రజలు పదిరోజులు నిరసన దినాలుగా పాటిస్తారు. నల్లబట్టలు ధరించి ఆ సోదరుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ బాధపడుతుంటారు.

– డా॥ సాహెబ్ జాదా విజయ భాస్కర్, టీచర్ । 92908 26988
(రేపు మొహర్రం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు.దశమి ఉ.9.38 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: అనూరాధ రా.9.10 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.2.38 నుండి 4.14 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.14 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.21 వరకు, అమృతఘడియలు: ఉ.10.51 నుండి 12.24 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.40, సూర్యాస్తమయం: 6.31.

కస్తూర్బాలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం

- సెల్‌ఫోన్ దొంగలని తోటి విద్యార్థినులు ఎగతాళి చేశారని మనస్తాపం
- హనుమకొండ జిల్లాలో ఘటన



శాయంపేట: సెల్‌ఫోన్ దొంగతనం చేశారని తోటి విద్యార్థినులు అవమానించారని మనస్తాపం చెందిన ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గోవిందాపూర్ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం సాయంత్రం జరిగింది. టీచర్లు వారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. గోవిందాపూర్ కేజీబీవీలో కల్పన, పూర్ణ పదో తరగతి చదువుతున్నారు. ఇందులో హనుమకొండకు చెందిన కల్పన, పూర్ణతో కలిసి మంగళవారం రాత్రి అటెండర్ సెల్ ఫోన్ తీసుకొని తల్లికి ఫోన్ చేసింది. తనకు ఆరోగ్యం బాగా లేదని, ఇంటికి తీసుకెళ్లాలని కోరింది. అదే సందర్భంగా తోటి విద్యార్థినులు గమనించి 'దొంగ''దొంగ'.. అంటూ అవహేళన చేశారు. దీంతో మనస్తాపం చెందిన ఆ ఇద్దరు విద్యార్థినులు బుధవారం సాయంత్రం తమ వద్ద ఉన్న నెయిల్ పాలిష్‌ను తాగారు. గమనించిన టీచర్స్ వారిని వెంటనే పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆస్పత్రిలో వైద్యసిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వారిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వారి ఆరోగ్యం మెరుగు పడటంతో గురువారం తల్లిదండ్రులు వారిని ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ విషయమై కేజీబీవీ స్పెషలాఫీసర్ మాధవిని వివరణ కోరగా కల్పన, పూర్ణ తమ ఇళ్లకు వెళ్తామని అడిగితే పర్మిషన్ ఇవ్వలేదని, ఆ బాధతోనే ఆత్మహత్యకు యత్నించారని పేర్కొన్నారు.

కీమోథెరపీ ఇక సేఫ్

నానోకణాలతో టెక్నాలజీని అభివృద్ధి చేసిన హెచ్‌సీయూ ప్రొఫెసర్

కేన్సర్ దుష్ప్రభావాలను తగ్గించడంలో ఉపయుక్తం



సాక్షి, హైదరాబాద్: కీమోథెరపీ దుష్ప్రభావాలను తగ్గించడం ..వ్యాధికణాలకు మాత్రమే మందు అందించేలా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ చేసిన ప్రయత్నం సఫలమైంది. కేన్సర్ సోకిందంటే మరణం తప్పదనేది ఒకప్పటిమాట. కానీ ఇప్పుడు జీవితాన్ని మరింతగా పొడిగించేందుకు ఎన్నో రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అందులో కీమోథెరపీ కూడా ఒకటి. అయితే ప్రత్యేక రసాయనాలతో అందించే ఈ చికిత్సలో ఎన్నో సైడ్ ఎఫెక్ట్స్ ఉండేవి. కేన్సర్ కణాలతోపాటు ఆరోగ్యంగా ఉన్న ఇతర కణాలు కూడా నాశనమయ్యేవి. రోగనిరోధక శక్తి తగ్గి వెంట్రుకలు రాలిపోవడం, ఒళ్లంతా దద్దుర్లు, నోట్లో పుండ్లు లాంటి దుష్ప్రభావాలు అనేకం ఉండేవి. ఒకవేళ వీటన్నింటిని తట్టుకున్నా, కీమో రసాయనాల నుంచి తప్పించుకున్న కొన్ని కణాలతో మళ్లీ కేన్సర్ తిరగబెట్టే ప్రమాదమూ ఉంటుంది. ఈ నేపథ్యంలో కీమోథెరపీ దుష్ప్రభావాలను తగ్గించడంతోపాటు, ఇచ్చే మందు నేరుగా కేన్సర్ కణాలకు మాత్రమే చేరేలా చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతున్నాయి.

నానో కణాలు తయారు చేసి.. పేటెంట్ పొంది..

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగపు అధ్యాపకుడు కొండపి ఆనంద్ తన పరిశోధనల ద్వారా నానో కణాలను తయారు చేశారు. అంతేకాకుండా తయారీ పద్ధతిని కూడా ఆవిష్కరించారు. పేటెంట్ హక్కులు కూడా పొందారు.

ప్రస్తుతం ఇలా...

కేన్సర్ చికిత్సలో భాగంగా కీమో రసాయనాలతో పాటు కణాలకు అవసరమైన డీఎన్‌ఏ, ఆర్ఎన్ఏ వంటి సేంద్రియ పదార్థాలను కలిపి అందిస్తున్నారు. కానీ దీంతో ఫలితాలు చాలా తక్కువ. ఎందుకంటే ఈ సేంద్రియ పదార్థాలకు ఏది కేన్సర్ కణమో, ఏది సాధారణమైందో తెలియదు. అందువల్ల ప్రభావం తక్కువగా ఉంటుందన్నమాట. కాకపోతే జరిగే నష్టాన్ని కొంతవరకు తగ్గించేందుకు మాత్రమే ఈ సేంద్రియ పదార్థాలు ఉపయోగపడతాయి.

రెండూ కేన్సర్ కణాలకు మోసుకెళ్లగలిగితే...

కీమో రసాయనాలు, సేంద్రియ పదార్థాలు రెండింటినీ కలిపి కేన్సర్ కణాలకు మోసుకెళ్లగలిగితే చాలా లాభాలుంటాయని ప్రొఫెసర్ కొండపి ఆనంద్ గుర్తించారు. ఈ పని సాధించే టెక్నాలజీని అభివృద్ధి చేసేందుకు పూనుకున్నారు. కేన్సర్ కణాలకు చక్కెరలన్నా, ఇనుము అన్నా చాలా ఇష్టమని చాలాకాలంగా తెలుసు. ఈ కారణంగానే ఏమో కేన్సర్ కణాల్లో ఈ రెండు పదార్థాలను ఒడిసిపట్టుకోగల రిసెప్టర్లు చాలా ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఈ విషయాలను అనుకూలంగా మార్చుకొని కేన్సర్‌పై పట్టు సాధించేందుకు కొండపి ఆనంద్ నేతృత్వంలో డాక్టర్ సొనాలి ఖన్నా, డాక్టర్ ఎస్ఎల్.బాలకృష్ణ, డాక్టర్ జగదీశ్ సేనాపతి, డాక్టర్ చుఖా ముజ్, డాక్టర్ నేహాతోమర్, అంతం సోనీలతో కూడిన శాస్త్రవేత్తల బృందం ప్రయత్నించింది. పాలలో ఉండే లాక్టోఫెర్రిన్, రక్తంలోని ప్రొటీన్లతో వీరి పరిశోధనలు సాగాయి. డీఎన్ఏ, ఆర్ఎన్ఏ వంటి సేంద్రియ పదార్థాలను, కీమో రసాయనాన్ని నానోస్థాయి అపోట్రాన్స్‌ఫెరిన్ ప్రొటీన్‌లోకి చేర్చడంలో విజయం సాధించారు.



ప్రొఫెసర్ కొండపి ఆనంద్

నోటితోనూ వేసుకోవచ్చు...

కీమోథెరపీకి నరాల్లోకి ఎక్కించే పద్ధతి ఒక్కటే ఇప్పటివరకు అందుబాటులో ఉంది. సహజసిద్ధమైన లాక్టోఫెర్రిన్, అపోట్రాన్స్‌ఫెరిన్‌లతో తయారైన నానోస్థాయి కణాలను మాత్రం నేరుగా నోటిద్వారా కూడా అందించవచ్చని ప్రొఫెసర్ కొండపి ఆనంద్ 'సాక్షి'కి తెలిపారు. ఈ పద్ధతిలో వాడిన ప్రొటీన్లన్నీ సహజసిద్ధమైనవి కాబట్టి ఆరోగ్యకరమైన కణాలకు హాని జరగదని చెప్పారు. ఈ నానోస్థాయి కణాలు కేన్సర్ కణాల్లోని రిసెప్టర్లకు అతుక్కుపోవడం వల్ల అపోట్రాన్స్‌ఫెరిన్ విడిపోయి అందులోని కీమో రసాయనం బయటపడుతుందని, కేన్సర్ కణాన్ని నాశనం చేస్తుందని వివరించారు. సాధారణ కణాల్లో అపోట్రాన్స్‌ఫెరిన్, లాక్టోఫెర్రిన్‌లు ఉంటాయి కాబట్టి ప్రమాదమేమీ ఉండదన్నారు. ఈ టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించి 2017లో తాము భారతీయ పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నామని, ఈ నెల 20వ తేదీన లభించిందని తెలిపారు. ఫార్మా కంపెనీలు చొరవ తీసుకుని ముందుకొస్తే అతితక్కువ దుష్ప్రభావాలు ఉండే కీమోథెరపీకి నాంది పలకవచ్చని చెప్పారు. అంతేకాకుండా, భవిష్యత్‌లో ఈ టెక్నాలజీ జన్యుచికిత్సలకూ ఉపయోగపడుతుందన్నారు.

చేతబడి చేశాడని...

- పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య

కొత్తకోట రూరల్: చేతబడి చేశాడన్న అనుమానంతో వరుసకు అన్న అయిన ఓ వృద్ధుడిని పెట్రోల్ పోసి నిప్పంటించి ఓ వ్యక్తి హత్య చేశాడు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన దొడ్ల పెంటన్న(63)కు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెంటన్న కొంతకాలంగా గ్రామ సమీపంలోని పొలం వద్ద ఉన్న ఓ గదిలో ఒంటరిగా ఉంటున్నాడు. అదే గ్రామంలో వరుసకు తమ్ముడైన కుర్మన్న కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల ఓ మంత్రగాడిని కలిశాడు. నీపై ఎవరో చేతబడి చేశారని కుర్మన్నకు చెప్పాడు. దీంతో పెంటన్నపై అనుమానం పెంచుకున్నాడు. తన పరిస్థితికి ఆయనే కారణమని, ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. గురువారంరాత్రి ఒంటరిగా ఉన్న పెంటన్న గది వద్దకు వెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించి హతమార్చాడు. గదిలో నుంచి పొగలు రావడం చూసి చుట్టుపక్కల రైతులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేశారు. కుర్మన్నపై అనుమానం ఉన్నట్టు మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు. అప్పటికే కుర్మన్న పరారయ్యాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

'అడ్రస్'లేని భూములకు సర్వేనంబర్

- ఎంజాయ్‌మెంట్ సర్వేతో చకచకా
- పొజిషన్ ఉన్న రైతుల పేర్లు ధరణిలో నమోదు కాని వైనం
- 76.24 ఎకరాలపై బడా నేతల కన్ను
- ఇప్పటికే 21 ఎకరాలు పెద్దల చేతుల్లోకి...



ఏ భూమి అయినా ధరణిలో రిజిస్ట్రేషన్ చేయాలంటే ముందుగా స్లాట్ బుక్ చేయాలి. పట్టాదారు పాస్‌బుక్, ఖాతా నంబర్, సర్వే నంబర్, క్రయ విక్రయాలు చేసే వ్యక్తుల పేర్లు, వారి ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్లు ఆ స్లాట్‌లో పొందుపరచాలి. కానీ ఇక్కడ ఆ భూమికి సంబంధించి ఎలాంటి సపోర్టింగ్ డాక్యుమెంట్ లేకపోయినా, సర్వే నంబర్, ఖాతా నంబర్‌తో పనిలేకుండా స్లాట్ ఎలా బుక్ అయ్యింది? రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది? అనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వంలోని కొందరు పెద్దలు.. రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఏకంగా 'బీలా దాఖలా' భూమికి ఎసరు పెట్టారు. రికార్డులు లేవనే సాకుతో పొజిషన్‌లో ఉన్న రైతులను మభ్యపెట్టి బహిరంగమార్కెట్ కంటే.. చౌకధరకు ఈ భూములు కొట్టేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆ వెంటనే వాటికి సర్వే నంబర్ సృష్టించి, ధరణిలో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుంటున్నారని, వారు దరఖాస్తు చేసిందే తడవుగా అధికారులు ఈ భూములను వారి పేరున బదలాయిస్తున్నారని అంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.వెయ్యి కోట్లకుపైగా విలువ చేసే ఈ భూమిని.. చాలా తక్కువ రేటుకు కొనేస్తున్నారని సమాచారం.

కోకాపేట సమీపంలో ఉండడంతోనే...

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల-కొండకల్ గ్రామాల మధ్యన కొండకల్ రెవెన్యూ పరిధిలో 76.24 ఎకరాల ఏ అడ్రస్ లేని(బీలా దాఖలా) భూమి ఉంది. దీనికి సంబంధించి రెవెన్యూ శాఖ వద్ద ఎలాంటి రికార్డులు లేవు. 45 మంది స్థానిక రైతులు ఏళ్ల తరబడి ఈ భూములను సాగు చేసుకుంటున్నారు. పొజిషన్‌లో ఉన్నా వారి పేర్లు కూడా రికార్డుల్లో లేవు. పహాణీలు, పట్టాదారు పాసు పుస్తకాలు అసలే లేవు. కనీసం వీటి సర్వే నంబర్ ఏమిటో కూడా చాలామందికి తెలియదు. బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.15 కోట్ల పైమాటే. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు ముఖ్యంగా కోకాపేటకు అతిసమీపంలో ఉన్న ఈ భూములపై కొంతమంది ప్రభుత్వ పెద్దల కన్నుపడింది. ఎలాగైనా వీటిని చేజిక్కించుకోవాలని భావించి తెరవెనుక కథ నడిపించారు. ఏ అడ్రస్ లేని ఈ మిగులు భూములు ప్రభుత్వానికి చెందుతాయని, ఈ విషయం బయటకు చెబితే..వాటిని సర్కారు లాగేసుకుంటుందని చెప్పి రైతుల నోరు మూయిస్తున్నారు.

అంతా కలిసి..

ఓ వైపు రికార్డులు లేవని, ప్రభుత్వ భూములని ప్రచారం చేస్తూ పొజిషన్‌లో ఉన్న రైతులను భయాందోళనకు గురిచేస్తూ.. మరోవైపు రెవెన్యూ అధికారులతో ఈ భూములకు ఎంజాయ్‌మెంట్ సర్వే చేయించారు. తహసీల్దార్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా పాత రికార్డులను పరిశీలించి ఏడీ రిపోర్టు జారీ చేశారు. దీని ఆధారంగా కలెక్టర్ సూచన మేరకు సీసీఎల్ఏ ఈ భూములకు క్లియరెన్స్ కూడా ఇచ్చినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే అప్పటికే ఈ భూములపై కన్నేసిన బడా నేతలు, రియల్టర్లు, వ్యాపారులు పహాణీలు, పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే నంబర్, ఖాతా నంబర్లు లేవనే అంశాన్ని తెరపైకి తెచ్చారు. ప్రభుత్వం నుంచి ఏదైనా ఇబ్బంది ఉంటే తాము చూసుకుంటామని నమ్మబలికారు. భూములు అమ్మాల్సిందిగా వారిపై ఒత్తిడి తీసుకొచ్చారు. చేసేది లేక రైతులు కూడా తలవంచక తప్పలేదు. రైతుల్లో ఉన్న ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని రూ.2 కోట్లకు ఎకరం చొప్పున 21 ఎకరాలకుపైగా కొల్లగొట్టారు. అంతేకాదు ఎలాంటి సపోర్టింగ్ డాక్యుమెంట్లు సమర్పించకుండానే 'ధరణి'లో స్లాట్ బుక్ చేసి.. గుట్టుగా రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు.

సర్వే నంబరు 555..దానికి బై నంబర్లు వేసి...

ఇప్పటి వరకు ఏ అడ్రస్ లేని ఈ భూములకు రైతుల నుంచి చేతులు మారిన వెంటనే కొత్త అడ్రస్ సృష్టించారు. సర్వే నంబర్ 555గా నామకరణం చేసి..బై నంబర్లతో ఆయా భూములను బడాబాబులకు కట్టబెడుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కితే.. ఎక్కడ తన ఉద్యోగానికి ఎసరు వస్తుందోననే భయంతో ఈ భూముల రిజిస్ట్రేషన్ సమయంలో ప్రస్తుత తహసీల్దార్ సెలవులో వెళ్లి.. డిప్యూటీ తహసీల్దార్లతో పని కానిచ్చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

శేరిగూడ భూములపైనా కన్ను

సంగారెడ్డి- రంగారెడ్డి జిల్లాల సరిహద్దులోని శేరిగూడ రెవెన్యూ పరిధిలోనూ 90 ఎకరాలకు పైగా బీలా దాఖలా భూములు ఉన్నాయి. వీటిని కూడా కొల్లగొట్టేందుకు రెవెన్యూ అధికారులు, నేతలు, రియల్టర్లు, వ్యాపారులు తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు తెలిసింది. విచిత్రమేమంటే.. ఏళ్ల తరబడి కబ్జాలో ఉండి.. సాగు చేస్తున్న రైతుల పేర్లు మాత్రం ఇప్పటికీ ధరణిలో కనిపించడం లేదు. కానీ వారి నుంచి కొనుగోలు చేసిన నేతలు, వ్యాపారులు, రియల్టర్ల పేర్లు మాత్రం ఆ వెంటనే నమోదవుతున్నాయి. ఇదే అంశంపై ఇటీవల కొంత మంది రైతులు మండల ఆఫీసులో ఆందోళనకు దిగారు.

ప్రభుత్వం అనుమతించింది

కొండకల్ రెవెన్యూ పరిధిలో 'బీలా దాఖలా' భూములు ఉన్న మాట వాస్తవమే. వీటికి సంబంధించి గతేడాది ప్రభుత్వం ఎంజాయ్‌మెంట్ సర్వే చేయించింది. ఆ నివేదిక ఆధారంగా భూ రికార్డులు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాత రికార్డులను పరిశీలించి, వాటికి సర్వే నం.555గా నిర్ధారించింది. కలెక్టర్ సిఫార్సు మేరకు సీసీఎల్ఏ ఈ భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చింది. ఆ మేరకే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం.' అని చెప్పిన తహసీల్దార్ నయీమొద్దీన్.. పొజిషన్‌లో ఉన్న రైతుల వివరాలు ధరణిలో ఎందుకు నమోదు చేయడం లేదని 'సాక్షి' ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానం దాటవేయడం విశేషం. – తహసీల్దార్, నయీమొద్దీన్

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి పుత్రశోకం

- చికిత్స పొందుతూ మృతి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి
- అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రులు మహమూద్ అలీ, హరీశ్, ఎమ్మెల్యేలు

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇంట్లో విషాదం నెలకొంది. ఎమ్మెల్యే పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి(35) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. మూడురోజుల క్రితం గచ్చిబౌలి కాంటినెంటల్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతుండగా కామెర్లు సోకాయి. వైద్యులు డయాలసిస్ కూడా చేశారు. వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. సమాచారం తెలుసుకున్న మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు ఆస్పత్రికి చేరుకొని ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించారు. సాయంత్రం ఇక్కడ నిర్వహించిన అంత్యక్రియల్లో మంత్రులు మహమూద్ అలీ, హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతికిరణ్, మదన్‌రెడ్డి, మాణిక్‌రావు, జగ్గారెడ్డి, కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వెన్నవరం భూపాల్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



విష్ణువర్ధన్‌రెడ్డి

క్లుప్తంగా...

మణిపూర్ ఘటనపై సీబీఐ దర్యాప్తు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన మణిపూర్‌లో లైంగికదాడి ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టనుంది. ఈ కేసు విచారణను రాష్ట్రం వెలుపల, అస్సాంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారి ఒకరు తెలిపారు. దీనిపై ప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనుంది. రాష్ట్రంలో ఘర్షణలకు సంబంధించిన అయిదు తీవ్రమైన కేసులను ఇప్పటికే దర్యాప్తు జరుపుతున్న సీబీఐకే మే 4 నాటి కేసును కేంద్రం అప్పగించింది. కాగా, మణిపూర్‌లో ప్రతిపక్ష కూటమి 'ఇండియా'కు చెందిన కొందరు ఎంపీలు పర్యటించనున్నారు.

ఆగస్టు 25, 26న 'ఇండియా' కూటమి సమావేశం

న్యూఢిల్లీ: 26 పార్టీలతో కూడిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి తదుపరి సమావేశం ఆగస్టు 25, 26న మహారాష్ట్ర రాజధాని ముంబైలో జరుగనుంది. ఈ భేటీకి శివసేన(ఉద్ధవ్ ఠాక్రే), నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(శరద్ పవార్) ఉమ్మడిగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. విపక్షాల తొలి సమావేశం బిహార్ రాజధాని పాట్నాలో, రెండో సమావేశం కర్ణాటక రాజధాని బెంగళూరులో జరిగిన సంగతి తెలిసిందే. ముంబైలో జరిగే మూడో సమావేశంలో ప్రధానంగా సీట్ల పంపకంపై విపక్ష నాయకులు చర్చించనున్నట్లు సమాచారం.

కిమ్‌తో రష్యా మంత్రి భేటీ



సియోల్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయుగు భేటీ అయ్యారు. ప్రాంతీయ భద్రత, సైనిక అంశాలపై ఆయనతో చర్చించినట్లు ఉ. కొరియా అధికారిక మీడియా తర్వాత వెల్లడించింది. 1950–53 కొరియా యుద్ధానికి విరామం పలికి 70 వసంతాలు పూర్తిచేసుకుంటున్న వేళ కిమ్‌తో రష్యా రక్షణ మంత్రి సమావేశంకావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పాంగ్‌యాంగ్‌లో సమావేశమైన సెర్గీ, కిమ్‌లు పలు అంశాలపై పరస్పర ఒప్పందానికి వచ్చారు. రష్యా రక్షణ మంత్రి సెర్గీని కిమ్ ఆయుధాల ఎగ్జిబిషన్‌కు తీసుకువెళ్లారు. అందులో ఉ.కొరియా ఇటీవల ప్రయోగించిన క్షిపణి వేరియంట్లను దగ్గరుండి చూపించారు.



బిలియనీర్ల దగ్గర్నుంచి రాజకీయ నాయకుల వరకు, క్రీడాకారుల దగ్గర్నుంచి నటీనటుల వరకు అదృశ్యం కావడం చైనాలో సర్వ సాధారణంగా మారింది. కొన్నాళ్ల పాటు కనిపించకుండా పోయిన తర్వాత ఏ అవినీతి ఆరోపణలో చిక్కుకోవడమో, జైలుకు వెళ్లడమో లేదంటే లో ప్రొఫైల్‌లో ఉండడమో జరుగుతోంది. ఇలా అదృశ్యమైన వారి జాబితా క్రమంగా పెరుగుతోంది. ఇన్నాళ్లూ విదేశాంగ మంత్రిగా పని చేసిన చిన్‌గాంగ్ తాజాగా ఆ జాబితాలో చేరారు. నెలరోజులుగా ఆయన కనబడకుండా పోయినా ప్రభుత్వం పెదవి విప్పడం లేదు. ఆయన స్థానంలో వాంగ్ యీని విదేశాంగ మంత్రిగా నియమించింది. ఆ సమయంలోనూ చిన్‌గాంగ్ ఆచూకీపై మౌనం పాటించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

అదృశ్యం అంటే.. ఇక అంతే

- ఇది చైనా మిస్టరీ
- పోతే జైలుకు లేదా అజ్ఞాతంలోకి
- జాబితా పెరుగుతోంది
- తాజాగా చిన్‌గాంగ్ పరిస్థితి ఇదే!

చైనా ప్రభుత్వ విధానాలను విమర్శించిన వారే ఇప్పటివరకు అదృశ్యమవుతూ వచ్చారు. కానీ చిన్‌గాంగ్‌ది దీనికి పూర్తిగా భిన్నం. అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడుగా ఆయనకు పేరుంది. రష్యా, వియత్నాం, శ్రీలంక నుంచి వచ్చిన అధికారులతో జూన్ 25న చివరిసారిగా ఆయన కనిపించారు. అప్పట్నుంచి ఎన్నో కీలకమైన సదస్సుల్ని చైనా వాయిదా వేసింది. కొన్ని సమావేశాలకు వాంగ్ యీ హాజరయ్యారు. చైనా సోషల్ మీడియాలో నెటిజన్లు చిన్‌గాంగ్ గురించి తెలుసుకోవాలని ప్రయత్నించినా 'నో రిజల్ట్స్' అన్న సందేశమే వస్తోంది. హాంగ్‌కాంగ్‌కి చెందిన మహిళా జర్నలిస్టు ఫు షియోన్‌తో వివాహేతర సంబంధమే చిన్‌గాంగ్ అదృశ్యానికి కారణమని తెలుస్తోంది. ప్రపంచంలోని రాజకీయ ప్రముఖుల్ని ఇంటర్వ్యూ చేసే ఆమె 2022లో చిన్‌గాంగ్‌ను ఇంటర్వ్యూ చేశారు. అదే ఆమె చివరి ఇంటర్వ్యూ. ఆ తర్వాత ఆమె కనిపించకుండా పోవడంతో ఇద్దరి మధ్య సంబంధం ఉందనే అనుమానాలున్నాయి. వివాహేతర సంబంధాలను చైనా కమ్యూనిస్ట్ పార్టీ అనుమతించదు. ఈ వ్యవహారం కారణంగానే అధ్యక్షుడితో చిన్‌గాంగ్‌కు విభేదాలు వచ్చాయన్న ప్రచారం జరుగుతోంది. చిన్‌గాంగ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని కొన్నిసార్లు ప్రభుత్వం చెబుతున్నా నమ్మేట్టు లేదు.

రెన్ జికియాంగ్

చైనాలో రియల్ ఎస్టేట్ టైకూన్ రెన్ జికియాంగ్ 2020 మార్చిలో అదృశ్యమయ్యారు. కరోనా మహమ్మారిని నియంత్రించడంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ ఒక విదూషకుడు తరహాలో వ్యవహరించారంటూ వ్యాఖ్యానించిన కొద్ది రోజుల్లోనే ఆయన కనిపించకుండాపోయారు. ఏడాది తర్వాత అవినీతి ఆరోపణలపై ఆయనకు 18 ఏళ్ల జైలు శిక్ష విధించారు.

అదృశ్యమైన ప్రముఖులు వీరే

హు జింటావో

చైనా మాజీ అధ్యక్షుడు హు జింటావోను అత్యంత నాటకీయ పరిణామాల మధ్య గత ఏడాది అక్టోబర్‌లో చైనీస్ కాంగ్రెస్ పార్టీ సమావేశం నుంచి బలవంతంగా స్టీవార్డ్స్ బయటకు తీసుకువెళ్లడం సంచలనం సృష్టించింది. ఆ తర్వాత రెండు నెలల పాటు ఆయన కనిపించకుండా పోయారు. అనారోగ్య కారణాలతో ఆయన సమావేశం విడిచి వెళ్లారని ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. రాజకీయ కారణాలతోనే అతన్ని సమావేశం నుంచి పంపేసినట్టు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత డిసెంబర్‌లో చైనా నాయకుడు జియాంగ్ జెమిన్ అంత్యక్రియల సమయంలో జింటావో కనిపించారు.

జాక్ మా

చైనాలో అత్యంత సంపన్నుడు, ఆలీబాబా గ్రూప్ వ్యవస్థాపకుడు జాక్ మా 2020 చివర్లో కనిపించకుండా పోయారు. చైనా ప్రభుత్వ ఆర్థిక నియంత్రణలను విమర్శిస్తూ ప్రసంగించిన కొద్ది రోజుల్లోనే జాక్ మా అదృశ్యమయ్యారు. ఆ తర్వాత కొద్ది రోజులకే చైనా దర్యాప్తు సంస్థల నుంచి ఆయనకు సమన్లు అందాయి. ఆయన కొత్తగా పెట్టబోయే కంపెనీలకు అనుమతుల్ని ప్రభుత్వం రద్దు చేసింది. జాక్ మా సంపదలో సగానికి సగం కోల్పోయినట్టు అంచనా. అప్పట్నుంచి ఆయన ఇప్పటివరకు బహిరంగంగా ఎవరికీ కనిపించలేదు. ప్రస్తుతం ఆయన టోక్యోలో ఉన్నారని తెలుస్తోంది.

బావో ఫ్యాన్

చైనాకు చెందిన టెక్నాలజీ డీల్ మేకర్ బావో ఫ్యాన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో అదృశ్యమయ్యారు. చైనా రనెసాన్స్ హోల్డింగ్స్ అనే ప్రైవేటు బ్యాంకు వ్యవస్థాపకుడైన బావోను చైనా ప్రభుత్వ ఏజెన్సీల అధికారులు విచారిస్తున్నారంటూ ఆయన కంపెనీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏ దర్యాప్తు సంస్థలు ఆయనని విచారిస్తున్నారో, కారణాలేంటో ఇప్పటివరకు బయట ప్రపంచానికి తెలీదు.

గువో గ్వాంగ్‌చాంగ్

2015లో అదృశ్యమైన అయిదుగురు ఎగ్జిక్యూటివ్‌లలో ఫోసన్ ఇంటర్నేషనల్ గ్రూప్ చైర్మన్ గువో గ్వాంగ్‌చాంగ్ ఉన్నారు. కొన్నాళ్లు కనిపించకుండా పోయిన ఆ తర్వాత హఠాత్తుగా ఒకరోజు ప్రత్యక్షమయ్యారు. ఫుట్‌బాల్ క్లబ్‌కి యజమాని కూడా అయిన గ్వాంగ్‌చాంగ్‌ని అవినీతి కేసుల్లో దర్యాప్తు సంస్థలు అదుపులోనికి తీసుకొని తర్వాత విడిచిపెట్టినట్టు వార్తలు వచ్చాయి.

ఫ్యాన్ బింగ్‌బింగ్

రాజకీయ నాయకులు వ్యాపార వేత్తలతో పాటు చైనాలో నటీనటుల చుట్టూ అదృశ్యం మిస్టరీ నెలకొంది. 2018 జూలైలో ఫ్యాన్ బింగ్‌బింగ్ అనే నటీమణి హఠాత్తుగా కనిపించకుండాపోయారు. సోషల్ మీడియాకి ఆమె దూరమయ్యారు. బింగ్ బింగ్ చైనా విడిచి పెట్టారని, గృహ నిర్బంధంలో ఉంచారన్న వదంతులు వ్యాపించాయి. దాదాపుగా ఏడాది తర్వాత బయటకు వచ్చిన ఆమె పన్నులు ఎగ్గొట్టినందుకు 8.83 కోట్ల యువాన్‌లు జరిమానా చెల్లించారు.

పెంగ్ షూయీ

చైనా టెన్నిస్ క్రీడాకారిణి పెంగ్ షూయీ 2022లో అదృశ్యమైంది. చైనా కమ్యూనిస్ట్ పార్టీ అధికారి జాంగ్ గయోలిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన కొద్ది రోజులకే ఆమె కనిపించకుండా పోయారు. ప్రస్తుతం ఆమె చైనాలోనే ఉంటున్నారని తెలుస్తోందికానీ లో ప్రొఫైల్‌లో ఉన్నారు.



సికార్‌లో బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

'రెడ్ డైరీ' కాంగ్రెస్‌ను ముంచేస్తుంది

- అందులోని అవినీతి రహస్యాలే వారిని ఓడిస్తాయి
- రాజస్తాన్‌లోని బహిరంగ సభలో ప్రధాని మోదీ విమర్శలు

సికార్(రాజస్తాన్): రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అక్రమ, ఆర్థిక లావాదేవీల చిట్టా ఈ 'రెడ్ డైరీ'లో ఉందంటూ బహిష్కృత మంత్రి రాజేంద్ర గుఢా చేసిన ఆరోపణలకు ప్రధాని మోదీ వంతపాడారు. ఈ ఆరోపణలకు దేశవ్యాప్తంగా 1.25 పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితంచేసే కార్యక్రమం వేదికగా నిలిచింది. సికార్‌లో జరిగిన ఈ వేడుకలో ఇంకొన్ని అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. 'బ్రిటిష్ వారు దేశాన్ని వదిలివెళ్లిపోవాలని గాంధీజీ 'క్విట్ ఇండియా' పిలుపునిచ్చారు. ఇప్పుడు ఇవ్వాల్సిన నినాదం 'అవినీతి క్విట్ ఇండియా, వారసత్వం క్విట్ ఇండియా, బుజ్జగింపు క్విట్ ఇండియా'. కాంగ్రెస్ వారి కొల్లగొట్టే దుకాణంలో కొత్త సరుకే ఈ 'రెడ్ డైరీ'. గెహ్లాట్ సర్కార్ పేపర్ లీక్ పరిశ్రమను నడుపుతోంది. కాంగ్రెస్ వారి అవినీతి రహస్యాలు అందులో దాగిఉన్నాయి. ఆ అవినీతి ఈసారి ఎన్నికల్లో వారిని ఓటమిపాలుచేయనుంది' అని మోదీ అన్నారు. ' రెడ్‌డైరీ పేజీలు తెరిస్తే చాలా మంది పెద్ద తలకాయల బండారాలు బయటపడతాయని ప్రజలే చెబుతున్నారు' అని ఆరోపించారు.

పేరు మార్చి ఏమార్చి..

'ఇందిరాగాంధీ హయాంలో ఇందిరనే ఇండియా, ఇండియానే ఇందిర' అని ప్రజల్ని ఏమార్చారు. తర్వాత యూపీయేనే ఇండియా, ఇండియానే యూపీయే' అని మభ్యపెట్టారు. బ్రిటిష్ సంస్థకు ఇండియా పదాన్ని జోడించి దేశంలో అడుగుపెట్టి దోచుకున్న ఈస్టిండియా కంపెనీ సంగతి తెల్సిందే. ఇండియా పేరున్న సిమీపై నిషేధం విధించాక ఎఫ్‌పీఐ పేరిట మళ్లీ ఉగ్రవాదులు దాడులకు దిగారు. ఇప్పుడు కాంగ్రెస్, దాని జట్టు పార్టీలు ఇదే ఎత్తుగడతో తమ కూటమికి ఇండియా అని పేరుపెట్టుకున్నాయి' అని మోదీ ఆరోపించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్తాన్‌లో మోదీ పర్యటించడం గత ఆరునెలల్లో ఇది ఏడోసారి కావడం గమనార్హం. 'ప్రజల ఆకాంక్షలు నెరవేరడంతో విపక్షాలు ఆగ్రహంతో ఊగిపోతున్నాయి' అని గుజరాత్‌లోని తొలి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ అయిన రాజ్‌కోట్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో మోదీ విమర్శించారు.

గెహ్లాట్ 'ఎరుపు' దాడి

మోదీ విమర్శలపై సీఎం గెహ్లాట్ ఘాటుగా స్పందించారు. 'ఎరుపు(రెడ్) డైరీ ఊహాత్మకం. వాస్తవానికి అలాంటిది లేదు. మాజీ మంత్రిని పావుగా వాడి రాజకీయం చేస్తున్నారు. నిజానికి అదొకటి ఉంటే మీ చేతిలో కీలుబొమ్మలైన ఈడీ, ఐటీ, సీబీఐలు ఎందుకు ఇంతవరకు దాని వివరాలు తెల్సుకోలేకపోయారు? ఎర్ర సిలిండర్(ఎల్పీజీ సిలిండర్) ఏకంగా రూ.1,150కి విక్రయిస్తూ అసలైన దోపిడీకి పాల్పడింది మోదీనే. ఎర్ర టమాటాలు రూ.150 పైగా ఎగబాకడానికి మీరే కారణం. ఇంత ధరకు సిలిండర్, టమాటాలు కొనాల్సిరావడంతో ఆగ్రహంతో ప్రజల ముఖాలు ఎర్రబడిపోయాయి. రాజస్తాన్ ప్రజలు ఈసారీ బీజేపీకి ఎర్రజెండానే చూపిస్తారు' అని అన్నారు.' రాష్ట్రానికి విచ్చేసిన మీకు మూడునిమిషాల ప్రసంగం ద్వారా ఆహ్వానం పలికే అవకాశాన్ని పీఎంఓ కార్యాలయం తొలగించింది. అందుకే ఇలా ట్వీట్ ద్వారా మీకు స్వాగతం పలుకుతున్నా' అని గెహ్లాట్ ట్వీట్‌చేశారు. దీనిపై ప్రధాని కార్యాలయం స్పందించింది. 'కాళ్లకు గాయాల కారణంగా మీరు హాజరుకావట్లేరని మీ కార్యాలయం నుంచి సమాచారం వచ్చినందుకే షెడ్యూల్ మార్చాం. అయినా రావాలనుకుంటే ఇదే మా ఆహ్వానం. వచ్చేయండి' అని పీఎంఓ తేల్చిచెప్పింది.

సభలో అదే అలజడి

- మణిపూర్ హింసపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాల్సిందే
- తమ డిమాండ్‌పై పట్టువీడని ప్రతిపక్ష సభ్యులు
- లోక్‌సభ, రాజ్యసభలో నినాదాలు, ఆందోళనల పర్వం
- పార్లమెంట్ ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనల హోరు కొనసాగుతూనే ఉంది. విపక్ష ఎంపీలు తమ డిమాండ్‌పై ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు వచ్చి, సమాధానం ఇవ్వాల్సిందేనని వారు తెగేసి చెప్పారు. ప్రధానమంత్రి మొండి వైఖరిని నిరసిస్తూ నల్లరంగు దుస్తులు ధరించి పార్లమెంట్‌కు హాజరయ్యారు. విపక్షాల నినాదాలు, ఆందోళనలతో ఉభయ సభల్లో గురువారం సైతం వాయిదాల పర్వం కొనసాగింది. ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. మణిపూర్ అంశంపై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. మోదీ మౌనాన్ని వీడాలని, మణిపూర్ హింసపై నోరు విప్పాలని బిగ్గరగా నినాదాలు చేశారు. దీంతో అధికార బీజేపీ సభ్యులు ఎదురుదాడికి దిగారు. 'మోదీ, మోదీ' అంటూ నినాదాలు ప్రారంభించారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష సభ్యుల నినాదాల హోరు మధ్యే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఖనిజ చట్ట సవరణ బిల్లును, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్ జన్‌విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత జన్‌విశ్వాస్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. 76 కాలం చెల్లిన చట్టాల రద్దుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలియజేసింది. అనంతరం లోక్‌సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభ నుంచి విపక్షాల వాకౌట్

రాజ్యసభలోనూ విపక్ష ఎంపీల ఆందోళన కొనసాగింది. మణిపూర్‌లో మంటలు చెలరేగుతున్నా ప్రధాని ఎందుకు మాట్లాడడం లేదని విపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో చైర్మన్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష నేత ఖర్గే మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా, అధికారపక్ష ఎంపీలు అడ్డుకోవడంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే సభ మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా పడింది. పునఃప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర మంత్రి ఠాకూర్ సినిమాటోగ్రఫీ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. రాజ్యసభలో విపక్షాల తీరును ఆయన తప్పుపట్టారు. దాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఒక సమయంలో ప్రతిపక్ష సభ్యులు 'ఇండియా, ఇండియా' అంటూ నినాదాలు చేయగా, బీజేపీ సభ్యులు 'మోదీ, మోదీ' అంటూ నినదించారు. సినిమాటోగ్రఫీ సవరణ బిల్లు మూజువాణి ఓటుతో సభలో ఆమోదం పొందింది.

ఆ భేటీని బహిష్కరించిన ఎంపీలు

రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశాన్ని ప్రతిపక్ష ఎంపీలు బహిష్కరించారు. మణిపూర్ అంశంపై ప్రధాని వైఖరికి నిరసనగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు చెప్పారు. రాజ్యసభ బీఏసీలో మొత్తం 11 మంది సభ్యులు ఉన్నారు. ఈ కమిటీ సమావేశాన్ని జైరాం రమేశ్(కాంగ్రెస్), మీసా భారతి(ఆర్జేడీ), డెరెక్ ఓబ్రెయిన్(టీఎంసీ) బహిష్కరించారు. భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) సభ్యుడు కేశవరావు గైర్హాజరయ్యారు.



పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమంలో ఖర్గే తదితరులు

దేశాన్ని విభజిస్తున్నారు: రాహుల్

దేశాన్ని విభజించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలసికట్టుగా కుట్రపన్నుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ప్రజల దుఃఖం బాధ వారికి పట్టడం లేదు. అధికారం తప్ప వారికి మరి దేనిపైనా ఆసక్తి లేదు' అని అన్నారు. యువజన కాంగ్రెస్ గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో పాల్గొని ప్రసంగించారు. 'బీజేపీ–ఆర్ఎస్ఎస్‌కి కావాల్సింది అధికారమే. దాని కోసం ఏమైనా చేస్తారు. అధికారం కోసం వారు మణిపూర్‌ను రావణకాష్టంలా మారుస్తారు. యావత్ దేశాన్ని నిప్పుల కుంపటి చేస్తారు. దేశ ప్రజల బాధ, శోకం వారికి పట్టదు' అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'మీరు ఒక వైపు కూర్చొని ప్రేమను పంచుతూ ఉంటారు. దేశానికి, దేశ ప్రజలకి గాయమైతే మీకూ ఆ నొప్పి తెలుస్తుంది. కానీ వాళ్లకి అలాంటి భావాలే లేవు. ఆర్ఎస్ఎస్, బీజేపీకి ప్రజల బాధ ఏంటో తెలీదు. వాళ్లు దేశాన్ని విభజించే పనిలో బిజీ' అని అన్నారు.

76 శాతం థర్మల్ ప్లాంట్ల నుంచే

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశం మొత్తం విద్యుత్ అవసరాల్లో దాదాపు 76 శాతం అవసరాలను థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచే సమకూర్చుకోవాల్సి ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 1,750 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా లోక్‌సభలో విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుకునే ఉద్దేశంతో నిర్మిస్తున్న భిన్నరకాల విద్యుత్ ప్లాంట్ల వివరాలనూ మంత్రి వెల్లడించారు. 'మొత్తంగా 25వేలకుపైగా మెగావాట్ల సామర్థ్యంతో 18 బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్మిస్తున్నారు. వాటిలో ఒకటి గ్యాస్ ఆధారిత థర్మల్ ప్లాంట్ ఉంది. మొత్తంగా 18వేల మెగావాట్ల సామర్థ్యంతో 42 హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు. 8వేల మెగావాట్ల సామర్థ్యంతో అణువిద్యుత్ కేంద్రాలను నెలకొల్పుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లు విద్యుత్ సామర్థ్యం దేశం సొంతం. 3.6 శాతం మిగులును సాధించాం. డిమాండ్ అత్యధికంగా ఉన్నప్పుడూ 0.7 శాతం మిగులును సాధించాం' అని మంత్రి వెల్లడించారు. అయితే 2023 ఏప్రిల్–జూన్ కాలంలో మాత్రం 0.2 శాతం లోటు కనిపించిందని మరో ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా మంత్రి వెల్లడించడం గమనార్హం.

గగన్‌యాన్ మాడ్యూల్ ప్రొపల్షన్ పరీక్షలు విజయవంతం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరి ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో గగన్‌యాన్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం (జీఎంపీఎస్)తో మరో రెండు హాట్ టెస్ట్‌లను విజయవంతంగా నిర్వహించినట్టు ఇస్రో ప్రకటించింది. సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్(ఎస్ఎంపీఎస్)ను బెంగళూరులోని లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్, వలియామల, తిరువనంతపురంలలో డిజైన్ చేసి, అభివృద్ధి పరిచారు. ఈ తరహాలో మొదటి హాట్ టెస్ట్‌ను ఈనెల 19న నిర్వహించారు. పేజ్–2 టెస్ట్ సిరీస్‌లో రెండు, మూడు హాట్ టెస్ట్‌లను బుధవారం చేపట్టి వాటి సామర్థ్యాన్ని నిర్ధారించుకున్నారు. 723.6 సెకెండ్ల పాటు సాగిన ప్రారంభ హాట్‌టెస్ట్ ఆర్బిటల్ మాడ్యూల్ ఇంజెక్షన్, 100 ఎన్ థ్రస్టలు లిక్విడ్ అపోజిమోటార్ (ఎల్ఏఎం) ఇంజిన్‌ల కాలిబ్రేషన్ బర్న్‌ను ప్రదర్శించారు. నాన్ అపరేషన్ ఇంజిన్‌ను గుర్తించి, వేరు చేయడానికి కాలిబరేషన్ బర్న్ అవసరమైంది. లామ్ ఇంజిన్‌ల రియాక్షన్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లు ఊహించిన విధంగా పనిచేయడంతో ఈ పరీక్షలు విజయవంతమైనట్లు ఇస్రో ప్రకటించింది.

ఆఫ్రికా దేశం నైగర్‌లో సైనిక కుట్ర

నియామె: పశ్చిమ ఆఫ్రికా దేశం నైగర్‌లో సైనిక కుట్ర జరిగింది. బుధవారం ఉదయం ప్రెసిడెన్షియల్ గార్డ్స్ సభ్యులు అధ్యక్షుడు మహ్మద్ బజౌమ్ నివాసాన్ని చుట్టుముట్టారు. బజౌమ్‌ను, ఆయన భార్యను నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ టీవీ కేంద్రాన్ని అధీనంలోకి తీసుకుని, తమను తాము నేషనల్ కౌన్సిల్‌గా గురువారం ప్రకటించుకున్నారు. శాంతిభద్రతలు, ఆర్థిక పరిస్థితులు క్షీణించినందునే దేశ రక్షణ బాధ్యతను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్మీయే దేశ రక్షణ బాధ్యత వహిస్తుందని, బయటి శక్తుల జోక్యాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. దీనిపై విదేశాంగ మంత్రి హస్సౌమి మస్సౌదౌ స్పందించారు. 'సైనిక కుట్ర జరిగింది. కానీ, మేం దానిని అంగీకరించం. అధ్యక్షుడిని వెంటనే విడుదల చేయాలి. తిరుగుబాటును ప్రజలు తిప్పికొట్టాలి'అని ఆయన పిలుపునిచ్చారు. తిరుగుబాటు వెనుక ప్రెసిడెన్షియల్ గార్డ్స్ జనరల్ ఒమర్ టిచనీ హస్తం ఉందనే అనుమానాలున్నాయి. ఈయన్ను బాధ్యతల నుంచి తప్పించేందుకు అధ్యక్షుడు బజౌమ్ ప్రయత్నించడమే ఇందుకు కారణమని భావిస్తున్నారు. తిరుగుబాటుకు సైన్యం కూడా మద్దతు ప్రకటించింది. ఇలా ఉండగా పొరుగుదేశం బెనిన్ అధ్యక్షుడు పాట్రిస్ టలోన్ మధ్యవర్తిగా రంగంలోకి దిగారు. ఫ్రాన్సుకు వలసదేశంగా ఉన్న నైగర్‌కు 1960లో స్వాతంత్ర్యం వచ్చింది. ఎట్టకేలకు 2021లో మహ్మద్ బజౌమ్ సారథ్యంలో తొలిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వం ఏర్పాటైంది. ఆయన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అప్పటి నుంచి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

'ఈడీ' మిశ్రా పదవీకాలం పొడిగింపు



న్యూఢిల్లీ: ఇప్పటికే పలుమార్లు పదవీ కాలం పొడిగింపుతో వివాదాస్పదమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) డైరెక్టర్ పదవీకాలంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం ఒక స్పష్టతనిచ్చింది. ఈఏడాది సెప్టెంబర్ 15వ తేదీదాకా ప్రస్తుత ఈడీ డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా ఆ పదవిలో కొనసాగవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. ఆతర్వాత పొడగింపు ఉండబోదని తేల్చిచెప్పింది. అక్టోబర్ 15 వరకు ఆయన పదవీకాలాన్ని పొడిగించాలని కేంద్రప్రభుత్వం అభ్యర్థిస్తున్న విషయం విదితమే. 'విస్తృతస్థాయి ప్రజా, జాతి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ పొడిగింపును మంజూరుచేశాం. ఇకపై కుదరదు' అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్‌ల ధర్మాసనం తేల్చిచెప్పింది. 'మిశ్రా తర్వాత ఈ పదవిలోకొచ్చి వచ్చే వ్యక్తి మినహా ఈ డిపార్ట్‌మెంట్‌లో ఇంకెవ్వరూ ఈ పదవికి అర్హులులేరని చెప్పాలనుకుంటున్నారా?' అని కేంద్రం తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది. 'అలాంటి భావన వచ్చేలా చేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదు. ఈడీ చీఫ్‌గా ఈయనే కొనసాగాలనే ఉద్దేశం కేంద్రానికి కూడా లేదు. కానీ అంతర్జాతీయ సంస్థ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్)కు సంబంధించిన కీలక సమీక్ష ప్రక్రియ జరుగుతున్న ఈ తరుణంలో ప్రస్తుత ఉన్నతాధికారినే ఈడీగా కొనసాగిస్తే భారత్‌కు కలిసి వస్తుంది. ఎందుకంటే పొరుగుదేశాలు భారత్‌ను ఎఫ్ఏటీఎఫ్ వారి 'గ్రే' జాబితాలోకి నెట్టేయాలని కుట్రపన్నుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో ఈడీ చీఫ్ కొనసాగింపు అనివార్యం' అని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వివరణ ఇచ్చారు.

30 ఏళ్లకు మొహర్రం

శ్రీనగర్: దాదాపు మూడు దశాబ్దాల అనంతరం మొదటిసారిగా జమ్మూలో షియా ముస్లింలు మొహర్రం ఊరేగింపు నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం శ్రీనగర్ గుండా లాల్ చౌక్ ఏరియా మార్గంలో గురువారం భారీ మూడంచెల భద్రతా ఏర్పాట్ల మధ్య ఊరేగింపు సాగింది. షియాలు పెద్ద సంఖ్యలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు గురుబజార్ నుంచి దాల్‌గేట్ మార్గంలో జెండాలు చేబూని శాంతియుతంగా ముందుకు సాగారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం ప్రబలిన తర్వాత..గత 30 ఏళ్లలో మొహర్రం ఊరేగింపు జరగడం ఇదే మొదటిసారని కశ్మీర్ అదనపు డీజీపీ విజయ్ కుమార్ తెలిపారు.

వేడుకల్లో సినిమా పాటలకు కాపీరైట్ వర్తించదు

- రాయల్టీ వసూలు చేయకూడదు
- కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ



న్యూఢిల్లీ: వివాహ వేడుకలు, ఇతర శుభకార్యాల్లో సినిమా పాటలను ప్లే చేయడం కాపీరైట్ చట్టం ఉల్లంఘన కిందకు రాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వివాహాది శుభకార్యాల్లో సినిమా పాటల ప్రదర్శన కోసం కాపీరైట్ సొసైటీలు బలవంతంగా రాయల్టీ వసూలు చేస్తున్నాయంటూ ఫిర్యాదులు వస్తుండడంతో కేంద్రం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. వేడుకల్లో సినిమా పాటలు వాడుకుంటే ఎవరూ రాయల్టీ వసూలు చేయకూడదని ఆదేశించింది. ఈ మేరకు డిపార్టుమెంట్ ఫర్ ప్రమోషన్, ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) ఒక ప్రకటన విడుదల చేసింది. ఉత్సవాల సమయంలో సినిమా పాటలు ప్లే చేయడానికి రాయల్టీ వసూలు చేయడం కాపీరైట్ చట్టం –1957లోని సెక్షన్ 52(1)కు పూర్తిగా విరుద్ధమని పేర్కొంది. మతపరమైన కార్యక్రమాలు, అధికారిక వేడుకల్లో ప్రదర్శించే సాహిత్యం, నాటకం, సంగీతం లేదా ఏదైనా సౌండ్ రికార్డింగ్‌లు కాపీరైట్ చట్టం ఉల్లంఘన కిందకు రావని సెక్షన్ 52(1)(జెడ్‌ఏ)లో ఉందని తెలియజేసింది. వివాహ ఊరేగింపులు, పెళ్లికి సంబంధించిన ఇతర సంప్రదాయ ఉత్సవాలు, కార్యక్రమాలు మతపరమైన వేడుకల కిందకే వస్తాయని ఉద్ఘాటించింది. వివాహ వేడుకల్లో సినిమా పాటలు వాడుకున్నందుకు రాయల్టీ చెల్లించాలని కాపీరైట్ సంస్థలు డిమాండ్ చేస్తే స్పందించవద్దని సామాన్య ప్రజలకు డీపీఐఐటీ సూచించింది.

అయోధ్యలో ప్రతిష్ఠాపనకు ప్రధానికి ఆహ్వానం

అయోధ్య: అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. జనవరిలో జరుగనున్న ఆలయ ప్రారంభోత్సవానికి శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఏర్పాట్లు చేస్తోంది. గర్భాలయంలో శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలో పాల్గొనాలని కోరుతూ ప్రధాని మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపించినట్లు ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారు. వచ్చే ఏడాది జనవరి 15 నుంచి 24వ తేదీల మధ్య సమయం ఇవ్వాలని కోరామని, ఈ మేరకు ట్రస్టు అధ్యక్షుడు మహంత్ నృత్యగోపాల్ దాస్ సంతకంతో లేఖ రాశామని తెలిపారు. ప్రతిష్ఠాపన కార్యక్రమానికి దేశ విదేశీ ప్రముఖులతోపాటు లక్షలాది మంది సామాన్య భక్తులు తరలివస్తారని, ఆ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని ట్రస్టు భావిస్తోంది. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి ప్రధాని మోదీ 2020 ఆగస్టులో స్వయంగా భూమిపూజ చేశారు.

పడవ మునక.. 21 మంది మృతి

మనీలా: ఫిలిప్పీన్స్‌లో ప్రయాణికుల పడవ మునిగిన ఘటనలో 21 మంది చనిపోయారు. మరో 40 మందిని సహాయక సిబ్బంది కాపాడారు. రిజాల్ ప్రావిన్స్ బినంగోనన్ పట్టణ సమీపంలో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన సమయంలో పడవలో ప్రయాణికులెందరున్నారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. గాలులు బలంగా వీస్తుండటంతో ప్రయాణికులంతా పడవలో ఒకే వైపునకు చేరడంతో ప్రమాదం జరిగిందన్నారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 28 । జూలై । 2023

సాగర్ పరవళ్లు





వరుసగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి వస్తున్న వరదతో హుస్సేన్‌సాగర్ నిండుకుండను తలపిస్తోంది. గురువారం దిగువకు వదిలిన నీటితో సాగర్ పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. అటుగా వెళ్లే వాహనదారులు కాసేపు జలకళను ఆస్వాదించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఆ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో కలిసి పరిశీలించి తగిన సూచనలు చేశారు.



జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి తలసాని

బయటకు రావద్దు

- ప్రస్తుత వర్షాల నేపథ్యంలో ప్రజలకు మా విజ్ఞప్తి
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నాగారం మున్సిపాలిటీ సాయి సంజీవనగర్‌లో..

హిమాయత్‌నగర్: 'నగర వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజల ప్రాణాల రక్షణ కోసం జీహెచ్‌ఎంసీతో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది 24 గంటల పాటూ సేవలు అందిస్తున్నారు. మా అందరి నుంచి నగర ప్రజలకు ఒకటే విజ్ఞప్తి. వర్షాలు కురుస్తున్న సమయంలో మీరెవరూ బయటకు రావద్దు' అంటూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నగరవాసులను కోరారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దూరదృష్టితోనూ ప్రస్తుతం లోతట్టు ప్రాంతాలు సైతం సేఫ్‌గా ఉన్నాయన్నారు. గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రాస్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, ఎస్ఎన్‌డీపీ ఈఎన్‌సీ రియాజుద్దీన్‌లతో కలిసి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్‌రూమ్‌ను మంత్రి తలసాని సందర్శించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై సిబ్బంది స్పందిస్తున్న తీరును పరిశీలించి, వారికి కొన్ని సూచనలను ఇచ్చారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.

ఇప్పుడు చాలా నయం..

గతంలో వర్షాలు వచ్చినప్పుడు శ్యామ్‌లాల్ బిల్డింగ్, రసూల్‌పురా, ముషీరాబాద్, అంబర్‌పేట, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో అత్యంత భయంకరమైన పరిస్థితులు ఉండేవని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు కింద నాలా పరీవాహక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేసిన కారణంగా ఇప్పుడు ఆ లోతట్టు ప్రాంతాలన్నీ గతంలో కంటే సేఫ్‌గా ఉన్నాయని చెప్పారు. 36 పనుల్లో 30 పూర్తవ్వగా మరో 6 ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. వారిద్దరి దూరదృష్టే ఇప్పుడు మనందరినీ సేఫ్‌జోన్‌లో ఉంచిందన్నారు.

ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి

- వర్షాల కారణంగా నగర వ్యాప్తంగా జీహెచ్‌ఎంసీతో పాటు డీఆర్ఎఫ్, జలమండలి, ఎలక్ట్రిసిటీ, శాంతిభద్రతలు, ట్రాఫిక్ పోలీసులు, రెవెన్యూ విభాగాలు 24 గంటలూ పని చేస్తున్నాయని, 455 టీమ్స్ నగర వ్యాప్తంగా అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.
- నగర వ్యాప్తంగా వర్షాల కారణంగా ఇబ్బందులు, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై కంట్రోల్ రూమ్ నంబర్లు 040–21111111, 9000113667లకు ఫోన్ చేయాలని సూచించారు. అదేవిధంగా ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ద్వారా కూడా తమకు ఫిర్యాదు చేయొచ్చన్నారు.

30 పునరావాస కేంద్రాలు సిద్ధం

అత్యంత ప్రమాదమేమీ లేకపోయినప్పటికీ ప్రజలకు భద్రత కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మరింత భారీ వర్షాలు వచ్చి లోతట్టు ప్రాంతాలు మునిగిపోయే పరిస్థితులు ఉన్నప్పుడు ఆయా ప్రాంతాల ప్రజలను సురక్షితమైన ప్రదేశాలకు తరలించే పనిలో ఉన్నామన్నారు. ఇందుకోసం సర్కిల్‌కు ఒకటి చొప్పున నగర వ్యాప్తంగా 30 పునరావాస కేంద్రాలను ఇప్పటికే సిద్ధంగా ఉంచినట్లు వివరించారు.

జలాశయాలపై ప్రత్యేక నజర్

హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచామన్నారు. వాతావరణ శాఖ నుంచి తమకు వస్తున్న సమాచారంతో ఆయా చెరువుల వద్ద అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామన్నారు. వర్షం కారణంగా ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తున్నామన్నారు. వీటి ద్వారా ప్రజలకు ఏవిధమైన ఇబ్బంది కలగకుండా ఉండే పనిలో నిమగ్నమయ్యామని పేర్కొన్నారు. 'మా అందరి నుంచి నగర ప్రజానికానికి ఒకటే విజ్ఞప్తి మీరెవరూ అనవసరంగా బయటకు రావద్దు ప్లీజ్' అని మంత్రి తలసాని కోరారు.

పోటెత్తిన వరద

గండిపేట 4 గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద నీరు



సాక్షి, సిటీబ్యూరో/మణికొండ/బండ్లగూడ: జంట జలాశయాలకు సంబంధించిన మరో 4 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లకు వరద నీరు పోటెత్తుతోంది. ఇప్పటికే హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌కు 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. రెండు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌కు వరద ప్రవాహం పెరగడంతో మరో రెండు గేట్లను గురువారం సాయంత్రం ఎత్తారు. ప్రస్తుతం హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌కు మొత్తం 2200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. మొత్తం నాలుగు గేట్ల ద్వారా 2750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఉస్మాన్ సాగర్‌కి సైతం భారీగా వరద నీరు చేరుకుంటోంది. ఇప్పటికే ఈ రిజర్వాయర్ రెండు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తుండగా.. తాజాగా మరో రెండు గేట్లను గురువారం మధ్యాహ్నం జలమండలి అధికారులు ఎత్తారు. ప్రస్తుతం రిజర్వాయర్ కు 2000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా.. నాలుగు గేట్లను రెండు అడుగుల మేర పైకి ఎత్తి 852 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న మూసీ నదిలో విడుదల చేస్తున్నారు. మొత్తం జంట జలాశయాలకు మొత్తం 4200 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా.. 3602 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న మూసీలోకి వదులుతున్నారు.

జంట జలాశయాల మరో 4 గేట్లు ఎత్తివేత

హై అలర్ట్

వాన భీకరం.. వరద బీభత్సం

- గోదారిని తలపించిన రహదారులు
- జలమయమైన ముంపు ప్రాంతాలు
- ఉధృతంగా జంట జలాశయాలు
- ఉప్పొంగుతున్న మూసీ నది
- పునరావాస కేంద్రాలకు బాధితులు
- మరో రెండు రోజులు భారీ వర్షాలు



కొంపల్లి ఉమామహేశ్వరి కాలనీలో వరద నీటిలో ఇళ్లు ఖాళీ చేస్తున్న కాలనీ వాసులు

సాక్షి,సిటీబ్యూరో: పదిరోజులుగా భానుడు మబ్బుల్లోంచి తొంగి చూడటమేలేదు. ముసుగు పరదాలకే నింగి పరిమితమైంది. ఆకాశానికి చిల్లు పడిన చందంగా వర్షాలు నగరవాసిని జల్లుమనిస్తున్నాయి. గురువారం తాజాగా వాతావరణ శాఖ హైదరాబాద్‌కు హై అలర్ట్ ప్రకటించింది. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయంటూ ప్రకటించింది. ఇప్పటికే భీకర వర్షాలతో వరద బీభత్సం సృష్టిస్తోంది. ప్రధాన రహదారులు గోదారిని తలపిస్తున్నాయి. ఎప్పటి మాదిరిగానే డ్రైనేజీలు, నాలాల మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో మగ్గుతూనే ఉన్నాయి. ఆయా ప్రాంతాలు వర్షం నుంచి తేరుకునేలోపే మళ్లీ మళ్లీ వర్షాలు పడుతున్నాయి. జన జీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. బుధవారం రాత్రి సుమారు 8 సెంటీమీటర్ల మేర వర్షం కురవడంతో నగరంతో పాటు శివారు ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడింది. ఒకవైపు ఏకధాటిగా భారీ వర్షం . మరోవైపు ఎగువ ప్రాంతాలకు వచ్చి చేరుతున్న వరదతో జలాశయాలు, చెరువులు, కుంటలు పొంగిపొర్లి పరీవాహక ప్రాంతాల్లోని కాలనీలు నీటమునిగాయి. మరోవైపు గురువారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా సుమారు 4 సెంటీమీటర్ల వరకు వర్షం కురిసింది.

- గాజులరామారం, బాలాజీ లేఅవుట్, ఓక్షిత ఎన్‌క్లేవ్ ఆదర్శ్‌నగర్ నీట మునిగాయి. గండిపేట, అత్తాపూర్, మణికొండ అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి వరద వచ్చి నీరు చేరింది.
- ఖైరతాబాద్‌లోని మింట్ కాంపౌండ్ రహదారి, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్, ఖైరతాబాద్ ప్రధాన రహదారిలోని మెట్రో స్టేషన్ వద్ద భారీగా నీరు నిలిచింది. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.
- లింగంపల్లి రైల్వే అండర్ పాస్ వద్దకు భారీగా వరద నీరు చేరింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- గచ్చిబౌలి–లింగంపల్లి మార్గాల్లో వాహనాలను మళ్లించారు. సికింద్రాబాద్, బోయినపల్లి, మారేడుపల్లి, చిలకలగూడ, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట్, అల్వాల్, తిరుమలగిరి వహర్ నగర్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో రహదారులన్నీ జలమయమయ్యాయి. సికింద్రాబాద్‌లోని మనోహర్ థియేటర్ సమీపంలో మోకాలి లోతు నీరు నిలిచింది.
- ఎల్బీనగర్ పరిధి నాగోల్ డివిజన్‌లోని అయ్యప్ప కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. సాగర్ రింగ్ రోడ్డులో భారీగా వరద నీరు చేరింది. హస్తినాపురం ఓంకార్ నగర్ బస్టాప్ జలమయమైంది.
- బషీర్‌బాగ్ లా కాలేజీ రహదారి, వంతెన కిందకు మోకాళ్ల లోతువర్షం నీరు నిలిచింది.

మూసారంబాగ్ బ్రిడ్జిని తాకిన వరద

జంట జలాశయాల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో మూసీ నదిలోకి వరద ప్రవాహం పెరిగింది. మరోవైపు హుస్సేన్ సాగర్ నుంచి కూడా దిగువకు నీరు విడుదల చేయడంతో మూసీలో వచ్చి చేరుతోంది. దీంతో మూసారంబాగ్ బ్రిడ్జిని తాకుతూ నదీ ప్రవాహం కొనసాగుతోంది. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేశారు. పరీవాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

- కృష్ణానగర్, తులసీ రామనగర్, లంక బస్తీ, కమలానగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయి. దీంతో అక్కడి ప్రజలను ఖాళీ చేయించి ప్రత్యామ్నాయంగా అంబర్‌పేట మహారాణా ప్రతాప్ హాల్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. నాగోలు, సరూర్‌నగర్, దుర్గం చెరువులకు కూడా వరద పోటు పెరగడంతో పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

మచ్చారే.. మజారే!











ఈ చిత్రాలు చూస్తుంటే.. వానల్లో కబడ్డీ ఆడినట్టు.. వర్షంలో ఫుట్‌బాల్ ఆడినట్టు అనిపిస్తోంది కదూ! అలాంటిదేమీ లేదులెండీ!! పల్లెల్లో చేపల వేట సాధారణంగా చూస్తుంటాం. కానీ.. హైదరాబాద్ మహా నగరంలో.. అదీ నడి రోడ్డుపై చేపల కోసం పోటీ పడటం ఆశ్చర్యమేస్తోంది గురూ. గురువారం కొంపల్లిలోని అపర్ణ పాలంగ్రోవ్ విల్లాస్ ముందున్న డ్రైనేజీలోకి ఇక్కడి చెరువులోని వరద భారీగా రావడంతో చేపలు పెద్దఎత్తున కొట్టుకువచ్చాయి. దీంతో స్థానికులు చేపలు పట్టేందుకు ఎగబడ్డారు. పట్టిన చేప తమదంటే తమదంటూ ఇలా లాగేసుకుంటూ కనిపించారు. ఇక్కడ దొరికిన ఒక్కో చేప సుమారు 10 కిలోల వరకు ఉండటం గమనార్హం.

– ఫొటోలు: నోముల రాజేశ్‌రెడ్డి.



రాంనగర్‌లో వరద ప్రవాహం



కొంపల్లి- దూలపల్లి రహదారిపై వరద



మూడుచింతలపల్లిలో వరదలో చిక్కుకున్న కారు



భోలక్‌పూర్‌లో విరిగిపడ్డ భారీ చెట్టు

'ఔటర్'లో 2 ఇంటర్‌చేంజ్‌లు

మూసివేత

- ఓఆర్ఆర్ 2 ,7 ఎగ్జిట్ గేట్ల నుంచి రాకపోకలు బంద్
- భారీగా వరద పోటెత్తడంతో అప్రమత్తమైన హెచ్ఎండీఏ

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్‌రింగ్ రోడ్డుకు పలు చోట్ల పెద్ద ఎత్తున వరద పోటెత్తింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఓఆర్ఆర్ వెలుపల ఉన్న సర్వీస్ రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఔటర్ ఇంటర్‌చేంజ్‌ల వద్దకు వరద నీరు చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు ఔటర్‌కు చేరుకొనేందుకు, ఔటర్ మీదుగా నగరంలోకి ప్రవేశించేందుకు ఏ మాత్రం అవకాశం లేకుండా భారీ వరదనీటితో నిండిపోయిన 2, 7 ఇంటర్‌చేంజ్‌లను మూసివేసినట్లు హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ ట్విటర్ ద్వారా తెలిపారు. ఈ రెండు చోట్ల వరద నీటిని తొలగించే వరకు వాహనాలు రాకపోకలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. మరోవైపు వర్షాల కారణంగా ఔటర్‌పై తలెత్తే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారన్నారు. 158 కి.మీ ఔటర్ చుట్టూ 20 చోట్ల ఇంటర్‌చేంజ్‌లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నగరంలోకి ప్రవేశించేందుకు అనుకూలంగా ఉన్న ఈ ఇంటర్‌చేంజ్‌లు అటు ఔటర్‌ను, ఇటు సర్వీస్ రోడ్లను అనుసంధానం చేశాయి. దీంతో వరదతో ఉప్పొంగి ప్రవహిస్తున్న మూసీ నది కారణంగా పలుచోట్ల వాహనదారులు రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మ్యాన్ హోళ్లపై అప్రమత్తంగా ఉండాలి



క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న జలమండలి ఎండీ దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా జలమండలి చర్యలు చేపట్టింది. ఇప్పటికే గుర్తించిన మ్యాన్ హోళ్లలోని పూడిక తీసే పనిలో నిమగ్నమైంది. గురువారం జలమండలి ఎండీ దానకిశోర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి లక్డీకాపూల్ లోని నిలోఫర్ ఆసుపత్రి, బజార్ ఘాట్ ప్రాంతాలను సందర్శించిన ఆయన సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వర్షాలకు మ్యాన్‌హోల్స్ ఉప్పొంగితే తక్షణమే పూడిక తీయాలని, వ్యర్థాల్ని (సిల్ట్) వెంటనే అక్కడినుంచి తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంసీసీలో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం వివరాలపై ఆరా తీశారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది రక్షణ దుస్తులు ధరించాలని, పని ప్రాంతాల్లో రక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ఆయా ప్రాంతాలకు కేటాయించిన ఎయిర్ టెక్ మిషన్లను సమర్థవంగా వినియోగించుకోవాలని మేనేజర్లు, డీజీఎంలను ఆదేశించారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ (ఈఆర్టీ) సిబ్బంది సైతం అన్ని పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నగరవాసులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరద నీరు వెళ్లేందుకు మ్యాన్ హోళ్లపై ఉన్న మూతల్ని తెరవద్దని విజ్ఞప్తి చేశారు. తాగునీటి సరఫరాలో తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. అధిక సంఖ్యలో శాంపిళ్లు సేకరించి పరీక్షించిన తర్వాతే నీటిని సరఫరా చేయాలని సూచించారు. క్లోరిన్ సైతం తగిన మోతాదులో ఉండేలా చూసుకోవాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలని, కలుషిత నీరు సరఫరా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఈఎస్‌సీ, డైరెక్టర్ ఆపరేషన్స్–1 అజ్మీరా కృష్ణ, సీజీఎం ప్రభు, జీఎం, డీజీఎం, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పొంగి ప్రవహిస్తున్న బేగంపేట నాలా..



శామీర్‌పేట్‌లోని మజీద్‌పూర్ బాలాజీ హోమ్స్



ఉమామహేశ్వరి కాలనీలో..



పీర్జాదిగూడలో నీటమునిగిన విష్ణుపురి కాలనీ



కూకట్‌పల్లి సిక్కుల కాలనీలో..



ఈస్ట్ ఆనంద్‌బాగ్ షిరిడీనగర్ కాలనీలో..

నవ వధువు ఆత్మహత్య

చిలకలగూడ : కాళ్లపారాణి ఆరకముందే నవవధువు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ మట్టంరాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ ఖానాపూర్‌కు చెందిన విజయకుమార్ నగరంలోని స్టాఫ్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. అతడికి అదే ప్రాంతానికి చెందిన నందిని (23)తో నెలన్నర క్రితం వివాహం జరిగింది. నూతన దంపతులు చిలకలగూడ ఠాణా పరిధిలోని పద్మారావునగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆషాఢమాస నేపథ్యంలో పుట్టింటికి వెళ్లిన నందిని ఈనెల 22న పద్మారావునగర్‌కు తిరిగి వచ్చింది. ఈనెల 26న రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లిన విజయకుమార్ గురువారం ఉదయం ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ కొట్టినా స్పందన లేకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా నందిని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. తమ కుమార్తె కొంత కాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతుందని, అదే కారణంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని మృతురాలి తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఖతార్ ఎయిర్‌లైన్స్ విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్



శంషాబాద్: దోహా నుంచి నాగ్‌పూర్ బయలుదేరిన విమానం శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం తెల్లవాజామున అత్యవసరంగా దిగింది. ఖతార్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన క్యూఆర్ 590 విమానం దోహాలోని హమీద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బుధవారం అర్ధరాత్రి నాగ్‌పూర్‌కు బయలుదేరింది. గురువారం తెల్లవారు జామున నాగ్‌పూర్ విమానాశ్రయంలో విమానం దిగేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో అక్కడి ఏటీసీ అధికారులు విమానాన్ని శంషాబాద్ ఎయిర్ పోర్టుకు మళ్లించారు. శంషాబాద్ ఏటీసీ అనుమతినివ్వడంతో విమానాన్ని తెల్లవారు జామున 3.20 శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా దింపారు. విమానంలోని 99 మంది ప్రయాణికులను నోవాటెల్ హోటల్ బస చేయించారు. రాత్రి ఇక్కడి నుంచి నాగ్‌పూర్‌కు బయలుదేరేందుకు ఖతార్ ఎయిర్‌లైన్స్ ఏర్పాట్లు చేసింది.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



అడిషనల్ పీపీని సన్మానిస్తున్న పోలీస్ అధికారులు

- ఐదేళ్ల క్రితం బాలికపై అత్యాచారం
- జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధింపు

సాక్షి, సిటీబ్యూరో: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధిస్తూ గురువారం ఎల్బీ నగర్‌లోని పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2018 సెప్టెంబర్ 29న రాత్రి కిరాణా షాపునకు వెళ్లిన బాలికపై పీఅండ్‌టీ కాలనీకి చెందిన గోల్కొండ రాజ్ కుమార్ అనే వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు సరూర్‌నగర్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిన పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. కేసుపై విచారణ చేపట్టిన పోక్సోకోర్టు నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించింది. నేరస్తుడికి శిక్ష పడేలా కృషి చేసినందుకు అధికారులను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, జాయింట్ సీపీ వీ సత్యనారాయణ, ఎల్బీనగర్ డీసీపీ బీ సాయిశ్రీ, ఏసీపీ ఎస్ జానకి రెడ్డి అభినందించారు.

గేమ్స్‌తో పరిచయం.. ఇన్వెస్ట్‌మెంట్స్‌తో లూటీ

నగర వాసి నుంచి రూ.32 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: తరచూ మొబైల్ గేమ్స్ ఆడే నగర వాసికి ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. వీరిద్దరి మధ్య ఓ గేమ్ సాన్నిహిత్యాన్ని పెంచింది. త ద్వారా ఇద్దరూ ఒకరి నెంబర్ మరొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆ తర్వాత అతడి ఉచ్చులో పడ్డ నగర వాసి భారీ మొత్తంలో కోల్పోయాడు. తాను మోసపోయానంటూ గురువారం సిటీ సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. నగరానికి చెందిన యువకుడికి ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే కోటీశ్వరుడివి కావొచ్చంటూ నేరగాడు సలహా ఇచ్చాడు. గేమ్స్ ఆడుతూనే ఇన్వెస్ట్‌మెంట్ వైపు అడుగులు వేయించాడు. పలు దఫాలుగా రూ.32లక్షలు ఇన్వెస్ట్ చేయించాడు. ఆతర్వాత ఒక్క రూపాయి ఇవ్వకపోగా టాస్కులు పూర్తి చేయాలని మరిన్ని లక్షలు కాజేసేందుకు ప్రయత్నించాడు. బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు.

ఎయిర్‌పోర్టులో కిలోన్నర బంగారం పట్టివేత



శంషాబాద్: ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బుధవారం రాత్రి మలేషియా నుంచి వచ్చిన ఇద్దరు వేర్వేరు ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా జీన్స్ ప్యాంట్ నడుము భాగంలో.. లో దుస్తుల్లో పేస్టు రూపంలో అమర్చుకుని తీసుకొచ్చిన 1.545 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ 94.99 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు.

విదేశీ సిగరెట్లు స్వాధీనం



మరో రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరు ప్రయాణికులు దుబాయ్ నుంచి తీసుకొచ్చి 34,800 సిగరెట్లు కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయి. నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్ఎండీఏ ప్లానింగ్‌లో భారీ కుదుపు..

hmda Growing Global

మార్పులు, చేర్పులతో ప్రక్షాళన

- ఇద్దరు డైరెక్టర్‌లకు రెండు జోన్‌ల చొప్పున కేటాయింపు
- గతంలో ఒక డైరెక్టర్‌కే మూడు జోన్‌లు..
- ప్రణాళిక విభాగం ఇన్‌చార్జిగా దేవేందర్‌రెడ్డి
- మాస్టర్‌ప్లాన్, జీవో 111తో పాటు మరికొన్ని అదనపు బాధ్యతలు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏలో కీలకమైన ప్రణాళికా విభాగంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. డీటీసీపీ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.దేవేందర్‌రెడ్డికి హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించారు. అలాగే హైరైజ్ బిల్డింగ్స్ కమిటీ సభ్య కన్వీనర్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించనున్నారు. హెచ్ఎండీఏలోని ఇద్దరు డైరెక్టర్‌ల కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు, మాస్టర్ ప్లాన్, జీవో 111 సంబంధిత అంశాలను కూడా దేవేందర్‌రెడ్డికి అప్పగిస్తూ హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భూసేకరణ పథకాలు, ప్రాజెక్ట్ ఫార్ములేషన్ యూనిట్ అంశాలు వంటివి కూడా దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలోనే కొనసాగనున్నాయి. జీహెచ్ఎంసీ చీఫ్ సిటీప్లానర్‌గా చాలా ఏళ్లు పని చేసిన ఆయనను కొద్ది రోజుల క్రితమే ప్రభుత్వం డీటీసీపీకి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. డీటీసీపీ డైరెక్టర్‌గా ఉన్న కె.విద్యాధర్‌ను హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్-1గా బదిలీ చేశారు. అలాగే ఎంఏయూడీ ప్లానింగ్ డైరెక్టర్‌గా, హెచ్ఎండీఏ ప్లానింగ్-1 ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఉన్న ఎస్.బాలకృష్ణను హైదరాబాద్ మెట్రో రైల్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. రేరా కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. హెచ్ఎండీఏ-2 డైరెక్టర్‌గా ఉన్న జీ. శివశరణప్పను ఎంఏయూడీ ప్లానింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ (హౌసింగ్ మెంబర్) డైరెక్టర్‌గా పని చేస్తున్న కె.శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. ప్రస్తుతం వీరి విధుల్లో చాలా వరకు మార్పులు, చేర్పులు జరిగాయి.

డైరెక్టర్‌ల విధుల్లో మార్పులు..

మరోవైపు కొత్తగా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్‌ల విధుల్లో మార్పులు జరిగాయి. విద్యాధర్ పరిధిలో ప్రస్తుతం శంకర్‌పల్లి, శంషాబాద్, ఘట్కేసర్ మూడు జోన్‌లు ఉండగా వాటిని రెండింటికే పరిమితం చేశారు. దీంతో ఆయన పరిధిలో ఘట్కేసర్, మేడ్చల్ జోన్‌లు మాత్రమే ఉంటాయి. అలాగే రెండో డైరెక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ పరిధిలో ఇటీవల వరకు మేడ్చల్ జోన్ మాత్రమే ఉండేది. తాజా మార్పుల్లో భాగంగా శంషాబాద్, శంకర్‌పల్లి జోన్‌లను శ్రీనివాస్‌కు అప్పగించారు. ఈ జోన్‌లలో ఎల్‌ఆర్ఎస్, లే అవుట్ పర్మిషన్‌లు, భవన నిర్మాణ అనుమతులు, తదితర అంశాలతో పాటు, హెరిటేజ్ భవనాలు, హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల సుందరీకరణ, తదితర అంశాలను విద్యాధర్ పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే ప్రాజెక్ట్‌ఫార్ములేషన్ యూనిట్, రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, గ్రిడ్‌రోడ్స్, లింక్‌రోడ్స్, స్లిప్‌రోడ్స్,ప్రణాళికాసంబంధమైన విషయాలు డైరెక్టర్-2 అయిన శ్రీనివాస్ పరిధిలో ఉంటాయి.

'కొరత' తీరేనా...

హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. నాలుగు జోన్‌లకు నలుగురు ప్లానింగ్ అధికారులు ఉన్నారు. కానీ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారులు, జేపీవోలు, ఇతర అధికారుల సంఖ్య తక్కువగా ఉండడం వల్ల ఒక్కొక్కరు రెండు జోన్‌లలో విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఒకవైపు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తుతుండగా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించడంలో సిబ్బంది కొరత కారణంగా తీవ్రమైన జాప్యం జరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.బీఆర్ఎస్, ఎల్‌ఆర్ఎస్, లే అవుట్ పర్మిషన్‌లు వంటి అనుమతుల్లో క్షేత్రస్థాయి పర్యవేక్షణ, సకాలంలో ఫైళ్లను పరిష్కరించి అనుమతులు ఇవ్వడంలో కాలయాపన జరుగుతోంది. దీంతో దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనుమతుల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది.

గుంతలు తీసి కప్పేస్తున్నారు!

- ఫార్మా వ్యర్థాల నిర్వహణపై మీనమేషాలు
- చెరువులు, డ్రైనేజీల్లోకి విడుదల
- రెండు కంపెనీలపై పీసీబీ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: బల్క్ డ్రగ్, ఫార్మా పరిశ్రమలు వ్యర్థాలను శుద్ధి చేయకుండా నిల్వ చేస్తుండటంతో పర్యావరణ కాలుష్యం జరుగుతుంది. పర్యావరణ నిబంధనలు పాటించకుండా, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నుంచి సరైన అనుమతులు తీసుకోకుండానే ఉత్పత్తులు చేస్తున్న కంపెనీలను మూసివేయాలంటూ ఫిర్యాదులు పెరిగిపోతున్నాయి. తాజాగా బృందావన్ ల్యాబొరేటరీస్, అపెక్స్ డ్రగ్ అండ్ ఇంటర్మీడియట్స్ కంపెనీలపై పీసీబీ చర్యలు తీసుకుంది.

చెరువులు..కుంటలు కలుషితం

పలు ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీల్లో ఉత్పన్నమయ్యే ఫార్మా వ్యర్థ జలాలను జీడిమెట్లలోని ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేయాలి. కానీ కొన్ని కంపెనీలు ఆవణలోనే భారీ గుంతలు తీసి వాటిల్లో నిల్వ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీటితో పాటు ఈ వ్యర్థాలను బయటకు వదిలిపెడుతుండటంతో సమీపంలోని చెరువులు, కుంటలు, పంట పొలాలు కలుషితమవుతున్నాయి. మరి కొందరు అక్రమార్కులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రైవేట్ ట్యాంకర్లలో ఈ వ్యర్థాలను తరలించి శివారు పరిసరాల్లోని చెరువులు, జల వనరులలో డంపింగ్ చేస్తున్నారు.

బృందావన్, అపెక్స్‌లపై చర్యలు..

- పరిశ్రమ వర్థాల నిర్వహణ చేపట్టకుండా పంట పొలాలను కలుషితం చేసినందుకు గాను చౌటుప్పల్‌లోని ఫార్మాసూటికల్ కంపెనీ బృందావన్ ల్యాబొరేటరీస్‌కు పీసీబీ రూ.45 లక్షలు పర్యావరణ పరిహారం (ఈసీ)ను విధించింది. 15 రోజుల్లో ఈసీని డిపాజిట్ చేయాలని, లేకపోతే నీటి, వాయు కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టాల కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆదేశించింది.
- శుద్ధి చేయని వ్యర్థాలను పైప్‌లైన్ ద్వారా కాజీపల్లి సంపులోకి విడుదల చేస్తూ.. సరిసర ప్రాంతాల్లో నీటి కాలుష్యానికి కారణమవుతున్న సంగారెడ్డిలోని గడ్డపోతారంలోని అపెక్స్ డ్రగ్ అండ్ ఇంటర్మీడియట్స్ లిమిటెడ్ యూనిట్-2ను మూసివేయాలని పీసీబీ ఆదేశాలు జారీ చేసింది. యూనిట్ ఆవరణలో దాదాపు 20 కిలో లీటర్ల వ్యర్థాలతో కూడిన ట్యాంకర్‌ను నిలిపి ఉంచినట్లు పీసీబీ అధికారులు క్షేత్ర స్థాయి విచారణలో గుర్తించడం గమనార్హం.

పెట్టుబడి పేరుతో నిండా ముంచారు

హిమాయత్‌నగర్: యూఎస్ కేంద్రంగా జరిగిన ఓ పెట్టుబడి పంచాయితీ సిటీకి చేరింది. విద్యాసంస్థల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇస్తామంటూ ఓ విద్యాసంస్థ ప్రతినిధులు తనతో నుంచి రూ.కోట్లు పెట్టుబడి పెట్టించి ఇప్పుడు ఒక్క రూపాయి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ విద్యాసంస్థల ప్రతినిధులపై బాధితుడు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు హర్షిత ఎడ్యుకేషన్ సొసైటీ, హర్షిత ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌తో పాటు వాటి యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రూ.7కోట్లు ముంచారు

హిమాయత్‌నగర్‌కు చెందిన 'సన్‌సిటీ ఇంటర్నేషనల్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ చిట్టిమిల్లి శ్రీనివాస్‌కు అతడి స్నేహితుడు కొర్రపాటి సుధాకర్ 'హర్షిత ఎడ్యుకేషన్ సొసైటీ, హర్షిత ఇంగ్లీష్ మీడియం స్కూల్స్'లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని సలహా ఇచ్చాడు. ఆ తర్వాత వాటి ప్రతినిధులు నందిగాం రాణి, నందిగాం ధర్మారావు, నందిగాం హర్షిత, గవిర్ని కృష్ణారావు, గవర్ని సురేష్, గవిర్ని రమేష్ చిట్టిమిల్లి శ్రీనివాస్‌ను కలిసి పెట్టుబడుల విషయాన్ని వివరించారు. దీంతో శ్రీనివాస్ దాదాపు రూ.7కోట్లు ఆయా విద్యాసంస్థల్లో ఇన్వెస్ట్ చేశాడు. దీనికి సంబంధించిన లాభాల విషయంలో వీరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. వారు చెప్పిన సమయానికి చిట్టిమిల్లి శ్రీనివాస్‌కు లాభాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, తమ వద్దకు వెళితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగారు. ఇలాగే మరికొంతమందిని పెట్టుబడుల పేరిట మోసం చేసినట్లు గుర్తించిన శ్రీనివాస్ తనకు న్యాయం చేయాలంటూ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మినిస్టర్ క్వార్టర్స్ విద్యుత్ బకాయిలు విడుదల

సాక్షి ఎఫెక్ట్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌కు సంబంధించిన కరెంటు బకాయిలు ఎట్టకేలకు విడుదలయ్యాయి. రూ. 54 లక్షల కరెంటు బకాయిలను ఆర్అండ్‌బీ అధికారులు విడుదల చేశారు. మొత్తం 16 క్వార్టర్లలో మంత్రులు ఉంటున్నారు. వీటికి సంబంధించిన కరెంటు బకాయిలు ఏయేటికాయేడు పెరిగిపోతూ టీఎస్ఎస్‌పీడీసీఎల్‌కు భారీగా బిల్లులు చెల్లించే స్థితికి తీసుకొచ్చారు. ఇటీవల ‹సాక్షి›లో మినిస్టర్ క్వార్టర్స్ కరెంటు బకాయిలు పేరుతో వార్త ప్రచురితం కాగా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. 2022 సెప్టెంబర్ నుంచి బకాయిపడ్డ బిల్లులను రూ.54 లక్షలు విడుదల చేశారు.

చీటింగ్ కేసులో న్యాయవాది అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: లియో మెరిడియన్ రిసార్ట్స్ అండ్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీని మోసం చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన న్యాయవాదిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. లియో మెరిడియన్ సంస్థ పంజగుట్ట కేంద్రంగా 2000 నుంచి కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ సంస్థ రిసార్టు నిర్మాణం, అభివృద్ధి కోసం శామీర్‌పేట మండలం బొమ్మరాస్‌పేట్ పరిసర ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేసింది. ఈ భూమిలో కొంతభాగంలో రిసార్ట్ నిర్మించి, మిగిలింది అభివృద్ధి చేసి విక్రయించింది. సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది కె.దామోదర్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా సదరు సంస్థతో పాటు ఎండీ పైనా తప్పుడు కేసులు పెట్టారు. ఓ దశలోఅతను సంస్థ ఎండీని సంప్రదించి, తప్పుడు కేసులు నమోదు చేసినందుకు క్షమాపణలు చెప్పారు. ఆ తర్వాత లియో రిసార్ట్స్‌కు ఆనుకుని ఉన్న రెండు ఎకరాల భూమి అభివృద్ధి చేయాల్సిందిగా దామోదర్ రెడ్డి కోరడంతో ఎండీ అంగీకరించారు. 2006 నవంబర్ 27న వీరు రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నారు. దీని కోసం సంస్థ భారీ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టింది. ఒప్పందం ప్రకారం అభివృద్ధి చేసిన తర్వాత మొత్తం స్థలంలో దామోదర్ రెడ్డి 3500 చదరపు గజాలను తీసుకుని మిగిలింది లియో కంపెనీ పేరుతో రిజిస్టర్ చేయాలి. దీనికి విరుద్ధంగా వ్యవహరించిన దామోదర్ రెడ్డి మరికొందరితో కలిసి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. 2012 ఫిబ్రవరి 6న కంపెనీ ఎండీని కలిసిన దామోదర్‌రెడ్డి రూ.6 కోట్లు డిమాండ్ చేశారు. కొంత మొత్తం తీసుకునీ వేధింపులు ఆపలేదు. లియో సంస్థ ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు దామోదర్ రెడ్డి తదితరులపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం అతడిని బోధన్‌లో అరెస్టు చేశారు.

ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదంలో పరిష్కారం...

సాక్షి,సిటీబ్యూరో: ప్రస్తుత వర్షాల సీజన్‌లో అనేక రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో ఆయుర్వేద చికిత్స ద్వారా వీటికి చక్కని పరిష్కారం దొరుకుతుందని బైద్యనాథ్ ఆయుర్వేదకు చెందిన ప్రధాన వైద్యులు వీడీ రమేష్ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. కల్తీ ఆహారం, కలుషిత నీటి ద్వారా వ్యాధులు ప్రబలి వళ్లునొప్పులు, జలుబు, దగ్గు, ఆకలి మందగించడం...వంటి సమస్యలు ఎదురైతే బైద్యనాథ్ కాసామృత్, సీతోపలాది చూర్ణ తదితర ఆయుర్వేద మందులు చక్కగా పరిష్కారం చూపుతాయని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఘటన





మృతి చెందిన అయాన్, గాయపడిన మహి

రాజేంద్రనగర్: పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్ర వాహనాలకు అనుమతి లేకున్నా త్వరగా వెళ్లాలన్న ఆతృతలో డివైడర్‌ను ఢీ కొట్టి మృత్యువాత పడ్డాడు. రాజేంద్రనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాటేదాన్ లక్ష్మిగూడ ప్రాంతానికి చెందిన అయాన్(22), మహి(18) నగరంలోని ఓ కాఫీ సెంటర్‌లో పని చేస్తున్నారు. ప్రతి రోజు వారిద్దరూ బైక్‌పై డ్యూటీకి వచ్చి వెళ్లేవారు. గురువారం ఉదయం వారు ఆరాంఘర్ ప్రాంతంలో పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఎక్కి మెహదీపట్నం బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బైక్ 156 పిల్లర్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఎగిరి కిందపడ్డ మహి, అయాన్‌ల తీవ్రంగా గాయపడ్డారు. అయాన్ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా మహిని వాహనదారులు అత్తాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా గుర్తించారు. సంఘటన జరిగిన ప్రాంతం నుంచి వాహనం దాదాపు 30 మీటర్ల దూరం గాలిలో పల్టీలు కొట్టిం. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'అసోసియేషన్ కార్డు'తో అసలు పేరు తెలిసింది

- ఈ పంథాలోనే అగ్వోవోను 'గుర్తించిన'అధికారులు
- బెంగళూరు కేంద్రంగా భారీ దందా

సాక్షి, సిటీబ్యూరో: బెంగళూరు కేంద్రంగా వ్యవస్థీకృతంగా డ్రగ్స్ దందా చేస్తూ తెలంగాణ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు (టీ-నాబ్) పట్టుబడిన ముఠా సూత్రధారి అగ్వోవో మూడు నకిలీ పేర్లతో చెలామణి అయ్యాడు. ఇప్పటి వరకు అందరికీ తప్పుడు పేర్లే చెప్పిన ఇతడి అసలు పేరు అధికారులకు ‹అసోసియేషన్ కార్డు› ద్వారా తెలిసింది. అగ్వోవో తో సహా అరెస్టయిన ముగ్గురు నైజీరియన్లను పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలోనే డ్రగ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ త్రయాన్ని అరెస్టు చేసిన సందర్భంలో అధికారులు రూ.కోటి విలువైన కొకై న్, ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్న విషయం విదితమే.

మరో పేరుతో పాస్‌పోర్టు, వీసా తయారీ...

నైజీరియా నుంచి 2011లో మెడికల్ వీసాపై ముంబై వచ్చి, బెంగళూరులో స్థిరపడిన అగ్వోవో మాక్స్‌వెల్ నబూసి ముందుగా నకిలీ గుర్తింపులు సృష్టించుకున్నాడు. ఏ మాత్రం తన ఉనికి బయటపడనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటూ... తన పాస్‌పోర్టు, వీసాలను స్కాన్ చేసి, ఫొటో షాప్ ద్వారా నకిలీవి తయారు చేశాడు. వాటిలో తన ఫొటోనే ఉంచి పేరు మాత్రం క్వెకు ఎసుమాన్ క్వామేగా మార్చాడు. వీటి ఆధారంగా తొలుత అనేక చోట్ల ఇళ్లను అద్దెకు తీసుకున్నాడు. చివరకు అదిత్య నగర్‌కు మకాం మార్చిన అగ్వోవో ఆ ఇంటి రెంటల్ అగ్రిమెంట్ ఆధారంగా ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకున్నాడు. 2012లో బిజినెస్ వీసాపై ముంబై వచ్చిన ఒకెకో చిగోజా బ్లెస్సింగ్ కొన్వాల్లు తమిళనాడులోని త్రిపూర్‌లో ఉండి చివరకు గతేడాది ఇతడి వద్దకే చేరాడు. 2021లో స్టూడెంట్ వీసాపై బెంగళూరు వచ్చిన ఇకెమ్ ఆస్టిన్ ఒబాక కూడా వీరితో కలవడంతో అగ్వోవో డ్రగ్ సిండికేట్ ఏర్పాటైంది.

ప్రతి ఆరు నెలలకు ఇల్లు మారుస్తూ...

సోషల్‌మీడియాను ఆధారంగా చేసుకుని డ్రగ్స్ విక్రయిస్తూ, డెడ్ డ్రాప్, సడన్ డెలివరీ విధానాల్లో వాటిని సరఫరా చేస్తున్న అగ్వోవో పోలీసుల నిఘాకు చిక్కకుండా అనేక జాగ్రత్తలు తీసుకున్నాడు. ప్రతి ఆరు నెలలకు తన మకాం మార్చేవాడు. తన పాత ఇంటికి కొత్త ఇంటికి మధ్య కనీసం 20 కిమీ దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకునేవాడు. కొత్తగా బెంగళూరు, ముంబై వస్తున్న నైజీరియన్లను ఆకర్షించి డ్రగ్స్ దందాలోకి దింపాడు. పోలీసులకు చిక్కకుండా వీటిని ఎలా విక్రయించాలి? తమ ఉనికి బయటపడకుండా ఎలా డెలివరీ చేసి రావాలి? తదితర అంశాల్లో వారికి శిక్షణ కూడా ఇచ్చాడు. తాను విక్రయించే డ్రగ్స్‌కు సంబంధించిన డబ్బును పెడ్లర్స్ కోయంబత్తూరులో ఘనా జాతీయుడి పేరుతో తెరిచిన ఖాతాలో వేసేలా చేశాడు. మాదక ద్రవ్యాలు విక్రయించే ప్రతి ఒక్కరూ ఇలాంటి జాగ్రత్తలే తీసుకోవాలని సూచించడంతో పాటు అందుకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తానంటూ వారిని ప్రోత్సహించాడు.

అసోసియేషన్ కార్డుతోనే 'ఆచూకీ'...

అగ్వోవో డ్రగ్స్ దందా చేస్తూ అరెస్టయిన నైజీరియన్లకు సహకరించడానికి ఓ అసోసియేషన్ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు జారీ చేశాడు. అసోసియేషన్ ఆఫ్ నైజీరియన్స్ పేరుతో ఉన్న దీని ఆధీనంలో హెల్ప్ ఫర్ బక్కే అండ్ ఇన్నోసెంట్ అనే వాట్సాప్ గ్రూప్ ఉంది. వివిధ నేరాలు చేస్తూ పట్టుబడిన నైజీరియన్లకు బెయిల్స్ వంటి న్యాయ సహాయం కోసం ఏర్పాటు చేసిన నిధికి దీని ద్వారానే విరాళాలు సేకరిస్తున్నారు. అగ్వోవోను పట్టుకున్నప్పుడు అతగాడు తన పేరు క్వెకు ఎసుమాన్ క్వామేగా అనే చెప్పాడు. టీ-నాబ్ అధికారులూ ఇదే నిజమని భావించారు. అయితే అతడిని తనిఖీ చేస్తున్నప్పుడు జేబులో అసోసియేషన్ గుర్తింపు కార్డు లభించింది. అందులో ఇతడి ఫొటో, అగ్వోవో అనే పేరు ఉండటంతో అనుమానించిన పోలీసులు లోతుగా ఆరా తీయగా అసలు విషయం బయటపెట్టాడు. ఇతడి వ్యవహారాలు పూర్తి స్థాయిలో తేల్చడానికి అధికారులు ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా...

నేడు సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారిణి మౌలిక జొన్నల సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వరల్డ్ నేచర్ కన్జర్వేషన్ డేను పురస్కరించుకొని ప్రకృతి సంరక్షణకు అవగాహన కల్పించేనిమిత్తం ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామని చిత్రకారిణి మౌలిక తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ హెచ్‌ఓడీ డాక్టర్ బి.రమాదేవి, తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ జి. చంద్రశేఖర్‌రెడ్డి హాజరవుతారన్నారు. కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, ప్రకృతి ప్రేమికులతోపాటు కళాకారులు ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను తిలకించాలని కోరారు. ఆగస్టు 1వతేదీ వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు.

వీవీ ప్యాట్లపై అవగాహన

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై ప్రజలకు అవగాహన కలిగించే ప్రదర్శన ఏర్పాటు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వీటి పనితీరుపై మరింత అవగాహన కలిగించేందుకు జోనల్ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మరికొద్ది రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా సంచార వాహనాల ద్వారా ఈవీఎంలపై అవగాహన కలిగిస్తున్నారు.

ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వ్యక్తికి జరిమానా

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద అనుమతులకు విరుద్ధంగా ప్రమాదకరంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన నిర్వాహకుడికి జీహెచ్‌ఎంసీ అధికారులు రూ. 5 వేల జరిమానా విధించారు. వివరాలివీ... కేబీఆర్ పార్కు ముందు అనధికారికంగా భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. కొంత మంది ఈ ప్రమాదకర ఫ్లెక్సీపై ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్‌కు, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు బుధవారం రాత్రి ఈ కటౌట్‌ను తొలగించడమే కాకుండా ఇది ఏర్పాటు చేసిన దావులూరి జగదీష్ అరవింద సావర్కార్‌కు రూ. 5 వేల జరిమానా విధించారు. ఓ సినిమా ప్రారంభోత్సవానికి సంబంధించి ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తూ దర్శకుడు, నటీనటుల ఫొటోలతో ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

వేడుకగా లక్ష పుష్పార్చన



బంజారాహిల్స్: అధిక శ్రావణమాసం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీ విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన శ్రీ సాయిబాబాకు సాయంత్రం విశేషంగా వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన వేడుక కనుల పండువగా నిర్వహించారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అధిక మాసే, అధిక ఫలం అని శాస్త్రంలో చెప్పబడినట్లుగా అధిక మాసంలో విశేషంగా పూజలు, అర్చనలు, అభిషేకాలు, దానాలుచేయడం వల్ల మరింత విశేష ఫలితం వస్తుందని అర్చకులు తెలిపారు. బాబాను దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వృద్ధుడికి ఆశ్రయం

బంజారాహిల్స్: ఎనిమిది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ వృద్ధుడు ఫుట్‌పాత్‌పై నిద్రించడమే కాకుండా వానకు తడుస్తూ ప్రత్యక్ష నరకాన్ని చవి చూస్తున్న నేపథ్యంలో స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు, బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 యూసీడీ సీవో భావ్‌సింగ్, ఖైరతాబాద్ నియోజకవర్గ స్మైల్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి లక్ష్మీ కవిత ఆధ్వర్యంలో రోడ్ నెం 12 ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌పై ఆశ్రయం పొందుతున్న బొబ్బా జగన్నాథం(60)ని గురువారం సాయంత్రం బేగంపేటలోని హోంకు తరలించారు. గత ఏడాదిగా ఆయన ఇదే రోడ్డులో ఫుట్‌పాత్‌పైనే ఉంటున్నాడు. ఎండాకాలం, చలికాలం సమస్య లేకున్నా వానాకాలం గత కొద్ది రోజులుగా ఆగకుండా కురుస్తున్న వర్షాలతో ఎలాంటి నీడలేని ఫుట్‌పాత్‌పై నిద్రించడమే కాకుండా ఇక్కడే మలమూత్ర విసర్జనలు కూడా చేస్తుండటంతో పారిశుద్ధ్య సమస్య తీవ్రరూపందాల్చింది. ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తూ వృద్ధుడికి మరింత నరకాన్ని చూపించాయి. ప్లాస్టిక్ కవర్లను కప్పుకుంటూ రేయింబవళ్లు ఫుట్‌పాత్‌పై ఉంటుండగా స్థానికులే ఆహారం అందించేవారు. అయితే సమస్య రోజురోజుకు తీవ్రతరమై వృద్ధుడు అనారోగ్యానికి గురికాసాగాడు. స్థానికులే సంబంధిత అధికారులకు సమాచారం అందించగా రంగంలోకి దిగిన అధికారులు ఆయనను ఇక్కడి నుంచి తరలించారు.

జలమయం..
జీవనం అస్తవ్యస్తం

రహదారుల్లో ప్రమాదకరంగా వరద నీరు

రోజుల తరబడి కొనసాగుతున్న మురుగు పరుగు

గుంటలు, మ్యాన్‌హోళ్లు కన్పించక సర్వత్రా ఆందోళన


ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులన్నీ జలమయం కాగా పలు కాలనీలు, బస్తీల్లో వరద నీరు చేరి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వరుసగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడికక్కడ వరద నీటితో పాటు మురుగు పొంగిపొర్లుతూ జనానికి ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నది. చాలా చోట్ల ఇళ్లల్లోకి నీళ్లు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బంజారాహిల్స్: ఖైరతాబాద్ డివిజన్ ఈ వానలకు అతలాకుతలం అయింది. హిమాయత్‌నగర్ డివిజన్‌లో బస్తీలు, కాలనీల్లో నీళ్లు చేరి స్థానికులు నరకాన్ని చవిచూస్తున్నారు. భారీ వర్షాలతో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. చాలా చోట్ల వరద కాల్వల్లోకి చేరకుండా రోడ్లపైనే తిష్టవేస్తుండటంతో పరిస్థితి అదుపుతప్పుతున్నది. ఫిలింనగర్ బస్తీలతో పాటు, రోడ్లన్నీ అధ్వాన్నంగా మారాయి. పలుచోట్ల వరద నీరు ఇళ్లల్లోకి చేరుతుండటంతో స్థానికులు నీటిని బయటికి పంపే మార్గాలను అన్వేషిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు నీట మునిగిన ప్రాంతాల్లో మోటార్ల సాయంతో వరద నీటిని బయటికి పంపే ఏర్పాట్లు చేస్తున్నారు.

- వరద నీటి కాల్వలు, మురుగు నీటి మ్యాన్‌హోళ్లు చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోవడంతో పంపింగ్ చేస్తున్న నీళ్లు కూడా కాల్వల్లోకి చేరడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పరిస్థితి అదుపుతప్పుతున్నది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ నాలుగుచోట్ల వరద నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- శ్రీనగర్ కాలనీ, ఇందిరానగర్, కృష్ణానగర్, కమలాపురి కాలనీ ప్రాంతాల్లో ప్రధాన, అంతర్గత రహదారులు వరద నీటితో నిండిపోయాయి. సోమాజిగూడ, మక్తా ప్రాంతం రోజురోజుకు అధ్వానంగా మారుతున్నది. బురద, వరద స్థానికులను పట్టి పీడిస్తున్నాయి.
- హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో స్థానికులు బయట అడుగుపెట్టలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు పలుచోట్ల పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.
- వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని సింగాడికుంట, నాయుడునగర్, ఉదయ్‌నగర్ ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపై నిలిచిపోయి కొన్ని చోట్ల ఇళ్లల్లోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలో...

వెంగళరావునగర్: వారం రోజులుగా కురుస్తున్న వానల కారణంగా వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా శ్రీకృష్ణానగర్ ప్రధాన రహదారిపై వరదనీరు పోటెత్తడంతో గంటల తరబడి ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. అనేక షాపులు, గృహాల్లోకి నీరు చేరింది. ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన కొన్ని ద్విచక్ర వాహనాలు నీటిలో కొట్టుకుపోతుండటం, యజమానులు వాటిని సంరక్షించుకోవడం లాంటి దృశ్యాలు అనేక ప్రాంతాల్లో కనిపించింది.



మధురానగర్‌లో విద్యుత్ తీగలపై కూలిన చెట్టు



షాదన్ కాలేజీ వద్ద...

జూబ్లీహిల్స్‌లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ పర్యటన



జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లో పర్యటిస్తున్న కమిషనర్ రొనాల్డ్ రాస్

బంజారాహిల్స్: భారీ వర్షాలకు రహదారులన్నీ జలమయం కాగా లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో ఆయా ప్రాంతాలను గురువారం ఉదయం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్, ఎస్‌ఈ రత్నాకర్, ఈఈ విజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. వరద నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించిన ఆయన వరద నీరు వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10, 36, 45తో పాటు సీఎం క్యాంపు కార్యాలయం రహదారులదాకా పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేశారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎనిమిది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మీరు తీసుకుంటున్న చర్యలేంటని అధికారులను ప్రశ్నించారు.



శ్రీకృష్ణానగర్ ప్రధాన రహదారిపై వరద నీరు



వరద నీటిని మోటార్ల ద్వారా తోడేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెం. 14లో ఇళ్లల్లోకి చేరిన వరద



ఖైరతాబాద్ ప్రధాన రహదారిలో...



బడా గణేష్ చౌరస్తాలో...



ఐమ్యాక్స్ పక్కన...



బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో...



నెక్లెస్ రోడ్డులో...

మరణించిన కానిస్టేబుల్ స్వామి కుటుంబానికి చేయూత

పంజగుట్ట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పంజగుట్ట కానిస్టేబుల్ కుటుంబానికి అతని బ్యాచ్‌మెట్‌లు చేయూతనందించారు. అందరూ కలిసి సేకరించిన రూ. 4.19 లక్షలను కుటుంబ సభ్యులకు అందించారు. వివరాలివీ... పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే 2010 బ్యాచ్‌కు చెందిన స్వామి రోడ్డు ప్రమాదంలో గత నెల 8వ తేదీన సొంతూరు నుంచి ఆటోలో వస్తుండగా ఆటో ప్రమాదానికి గురయ్యింది. దీంతో ఆటోలో ముందు సీటులో కూర్చున్న స్వామి మృతి చెందాడు. దీంతో బ్యాచ్‌మెట్స్ అందరూ కలిసి రూ. 4.19 లక్షలను సేకరించారు. వాటిని గురువారం రూ. 4 లక్షలు స్వామి ముగ్గురు పిల్లలపై ఫిక్స్ డిపాజిట్ చేసి మిగిలిన 19 వేలు, ఫిక్స్ డిపాజిట్ బాండ్‌లు అతని భార్య కావ్యకు అందించారు. కార్యక్రమంలో 2010 బ్యాచ్‌మెట్‌లు మామిడి కేశవ్, భోళాశంకర్, శ్రీకాంత్, శివ, రాఘవాచారి, విష్ణు, నరసింహ, కృపానందం, వెంకటేష్, కోటేష్, దశరథ్, అరవింద్, డి.టి. నాయక్, భవ్య, శాంతి పాల్గొన్నారు.



స్వామి కుటుంబ సభ్యులకు బాండ్‌లు, నగదు అందిస్తున్న దృశ్యం

నిమ్స్‌లో కొత్త పరిశోధనలకు శ్రీకారం

నిమ్స్‌ను సందర్శించిన రాయల్ కాలేజ్ అధ్యక్షులు డాక్టర్ మైక్ మెకెర్లీ

లక్డీకాపూల్ : అధునాతన వైద్య సేవలతో నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) వినూత్న పరిశోధనలకు శ్రీకారం చుట్టిందని రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గోవ్ అధ్యక్షుడు డాక్టర్ మైక్ మెకెర్లీ అన్నారు. ఆసుపత్రిలో సేవల్ని మరింత మెరుగుపరిచేందుకు కొత్త పరిశోధనలకు రాయల్ కాలేజ్, నిమ్స్ పరస్పర సహకారం అందించుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంగ్లాండ్, స్కాట్లాండ్ దేశాల్లో నాణ్యమైన వైద్యాన్ని, పరిశోధనల్ని అందిస్తున్న రాయల్ కాలేజీ అధ్యక్షులు గురువారం నిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప నేతృత్వంలో వివిధ విభాగాలతో నిర్వహించిన సమావేశంలో గ్లోబల్ సిటిజన్‌షిప్ ఇన్ ఎన్‌హెచ్‌ఎస్ స్కాట్లాండ్ అంశంపై డాక్టర్ మైక్ ప్రసంగించారు. ఆసుపత్రిలో పేదలకు అందుతున్న వైద్యసేవలను కొనియాడిన ఆయన అక్కడి విధానాల్ని వివరించారు. యాంటీ బయోటిక్స్, ఇతర మందుల వినియోగం, వివిధ రకాల పరిశోధనలపై నిమ్స్ వైద్యులతో చర్చించారు. రెండు సంస్థల మధ్య పరస్పర ఒప్పందం ద్వారా పరిశోధనలు మరింత వేగవంతం చేయవచ్చన్నారు. నిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యను అభ్యసిస్తున్న ఎండీ, పీజీ, ఎంసీఎచ్ విద్యార్థులు ఇంగ్లాండ్ వెళ్లి అక్కడి వైద్య సేవలు పరిశోధనలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా అక్కడి వైద్య విద్యార్థులు నిమ్స్‌కు తీసుకువచ్చి ఇక్కడ అందుతున్న వైద్య సేవలు తదితర వివరాలను తెలుసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అవగాహన చిత్రాలను నిమ్స్ డైరెక్టర్ తో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, డాక్టర్ శాంతి వీర్, డాక్టర్ కేవీ కృష్ణారెడ్డి, డాక్టర్ వంశీ కృష్ణ, డాక్టర్ పరంజ్యోతి, డాక్టర్ తిర్మల్గ్, ది రాయల్ కాలేజ్ అంతర్జాతీయ సలహాదారులు డాక్టర్ పి. రఘురామ్‌తో పాటు పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై గర్భిణులకు అవగాహన

బంజారాహిల్స్: తలసేమియా, రక్తహీనత సమస్యలను ముందే గుర్తిస్తే పుట్టబోయే బిడ్డను కాపాడేందుకు చాలా అవకాశం ఉంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రైడ్ అధ్యక్షురాలు నర్గిస్ సకినా యార్క్యాన్ అన్నారు. గురువారం కుందన్‌బాగ్‌లోని ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రైడ్, ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌పీఏ) సంస్థలు సంయుక్తంగా గర్భిణుకు హై పర్‌ఫార్మెన్స్ లిక్విడ్ క్రొమెటోగ్రఫీ (హెచ్‌పీఎల్‌సీ) పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. చాలా మంది చిన్నారులు తలసేమియా వ్యాధిబారిన పడుతున్నారని బిడ్డ గర్భంలో ఉన్నప్పుడే మహిళలు ఈ పరీక్షలు నిర్వహించుకుంటే పుట్టబోయే పిల్లలను తలసేమియా బారిన పడకుండా కాపాడుకోవచ్చునని ఈ సందర్భంగా వారు తెలిపారు. నగర వ్యాప్తంగా ఉన్న బస్తీల్లో పేద మహిళలకు తాము పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. తల్లీ, బిడ్డల సంక్షేమం కోసం రోటరీ క్లబ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వారు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రైడ్ డైరెక్టర్ ఒమిమ్ డిబేరా, ఎఫ్‌పీఏ జనరల్ మేనేజర్ రేణు కపూర్ పాల్గొన్నారు.

విశ్వనగరం అంటే ఇలాగేనా?

పంజగుట్ట: తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందింది, మరో డల్లాస్ నగరంగా.. విశ్వనగరంలా తయారైందని బీరాలు పలికే బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్రంలో ప్రస్తుతం రోడ్ల పరిస్థితి చూస్తే అప్పుడు అర్థం అవుతుందని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్‌ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు జిల్లాలకు చెందిన నాయకులు పార్టీలో చేరారు. పలు నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... ఖమ్మంలో గతంలో వరదలు వచ్చిన సమయంలో శాశ్వత పరిష్కారం నిమిత్తం రూ. వెయ్యి కోట్లు ప్రకటించారని అయితే ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. భద్రాచలం దేవస్థానానికి రూ. 100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో తమ టీఆర్‌ఎస్ పార్టీ 119 అసెంబ్లీ స్థానాల్లో, 17 ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపుతుందన్నారు. తాము అధికారంలోకి రాగానే వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్‌లను రూ. 5500కు పెంచుతామని, 10 నుంచి పీజీ చదివే ప్రతి విద్యార్థికి రూ. 50 వేలు ఇస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 200 పడక గదుల ఆస్పత్రి నిర్మాణం, రేషన్ షాపుల్లో 20 రకాల వస్తువులు 20 రూపాయలకే ఇస్తామని, విద్యా, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి లక్ష్యంగా ముందుకు పోతామని, అవినీతిలేని పాలన తీసుకువస్తామన్నారు.

ఎమ్మెల్యే కాలనీలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఎమ్మెల్యే కాలనీ క్లబ్ నిర్మిస్తున్న నిర్మాణానికి సంబంధించి గుంతలు తీస్తుండగా పక్కనే ఉన్న సబ్ స్టేషన్‌ప్రహరీ గోడ కుప్పకూలడంతో దీన్ని ఆనుకొని ఉన్న స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ కుప్పకూలింది. దీంతో గురువారం స్థానికంగా కరెంటు సరఫరాకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఇక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఎమ్మెల్యే కాలనీ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రహరీ గోడ కూలడంతో కూలిపోయిందని దీని వల్ల తలెత్తిన సమస్యను వెంటనే పరిష్కరించామని డీఈ నరేందర్‌రెడ్డి తెలిపారు. తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయాన్ని పరిష్కరించామన్నారు.

నడి రోడ్డుపై భారీ గుంత

బంజారాహిల్స్: వరుసగా కురుస్తున వర్షాలకు మ్యాన్‌హోళ్లు దెబ్బతినడం, రోడ్లు గుంతలు తేలడంతో పాటు కొన్ని చోట్ల రోడ్లు సైతం కుంగిపోతున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 1/3 నాగార్జున సర్కిల్ చౌరస్తాలోని చట్నీస్ హోటల్ ముందు గురువారం ఉదయం రోడ్డు కుంగిపోయింది. గమనించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన వెంటనే ఈ గుంత చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు శ్రమించి గుంతను తాత్కాలికంగా పూడ్చారు.



భారీ గుంతకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నేడు జీటీఎస్ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

వెంగళరావునగర్: వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీటీఎస్ ఆలయంలో పలువురు నూతన కమిటీ సభ్యులను గురువారం ఏర్పాటు చేశారు. నూతన కమిటీ సభ్యులు ఈ నెల 28న దేవాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలిపారు.

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలి

లక్డీకాపూల్: మహోన్నత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశగా తమ ప్రయత్నం కొనసాగిస్తున్నామని జీ థియేటర్ సీఈఓ శైలజాకేజ్రీవాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఈ నేపథ్యంలో థియేటర్ కంటెంట్‌తో తమదైన శైలిలో సాంస్కృతిక ఔచిత్యాన్ని చాటుతున్నామని, ఇందుకు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకుల ఆదరణ ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి విభిన్నమైన నాటకాలను పరిచయం చేయడమే తమ లక్ష్యమని, ప్రతి ఒక్క ప్లే సార్వత్రిక మానవ ఇతివృత్తంతో ఉంటుందని శైలజ పేర్కొన్నారు. ఊహించినట్లుగానే తెలుగులో ప్రేక్షకుల నుంచి సర్ సర్ సరళ, గుడియా కి షాదీ, పురుష్, గసేహ్‌గార్ వంటి నాటకాలు ఎక్కువ ఆదరణ పొందుతున్నాయన్నారు.

చెల్లని చెక్కులు.. మహిళకు బెదిరింపులు

స్థలం విషయంలో మోసగించిన సీఐడీ ఉద్యోగి దంపతులపై కేసు

వెంగళరావునగర్: స్థలం కొనుగోలు విషయంలో చెల్లని చెక్కులు ఇవ్వడమే కాకుండా ఓ మహిళను బెదిరింపులకు గురి చేసిన సీఐడీ ఉద్యోగితోపాటు ఆయన భార్యపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ ఉదయ్ సమాచారం మేరకు... సీఐడీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే సంకురు రవికుమార్ తన భార్య మాధవితో కలిసి బండ్లగూడ సమీపంలోని శివగంగ పీఎస్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. రవికుమార్ దంపతుల నుంచి 2019 జనవరి 5న నార్సింగ్ సమీపంలోని బైరాగిగూడ గ్రామంలోని 136.05 చదరపు గజాల స్థలాన్ని రహమత్‌నగర్ డివిజన్ బ్రహ్మశంకర్‌బస్తీకి చెందిన ఎం.ఎ.లత రూ. 60 లక్షల 50 వేలకు కొనుగోలు చేస్తున్నట్టుగా అగ్రిమెంట్ కూడా రాసుకున్నారు. ముందస్తుగా రూ. 18 లక్షల 50 వేలను అడ్వాన్సుగా ఇచ్చి మిగిలిన మొత్తాన్ని త్వరలో ఇస్తామన్నారు. అయితే ఆ స్థలం కోర్టు వివాదంలో ఉందని తెలుసుకున్న లత అగ్రిమెంట్‌ను క్యాన్సిల్ చేసుకున్నారు. దీంతో మాధవి రూ. 10 లక్షల 40 వేలకు సంబంధించిన చెక్కులను లతకు ఇచ్చారు. అవి బౌన్స్ అయ్యాయి. లత డబ్బుల కోసం మధవిని గట్టిగా నిలదీయగా ఇవ్వను నీ ఇష్టం వచ్చింది చేసుకో అంటూ బెదిరింపులకు గురి చేసింది. దాంతో రవికుమార్, మాధవి దంపతులపై మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఉదయ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అమాత్యులు ఆన్‌డ్యూటీ



కడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



ఖమ్మంలో ముంపు కాలనీల నుంచి బాధితులను రక్షించే చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్



నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో వరదల వల్ల ముంపునకు గురైన డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం 16 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన సందర్భంగా పూజలు చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్



జగిత్యాల జిల్లా ధర్మపురి ప్రాంతంలో గోదావరి ఉప్పొంగడంతో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



నీట మునిగిన ట్రాక్.. రైళ్ల నిలిపివేత

హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే వంతెన ట్రాక్ వరదలో మునిగింది. దీనితో గురువారం ఉదయం నుంచే రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. తిరుపతి-కరీంనగర్, ఎర్నాకులం-బిలాస్‌పూర్, యశ్వంత్‌పూర్-లక్నో, బెంగళూర్-నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు కాజీపేట-ఢిల్లీ, వరంగల్-ఢిల్లీ రూట్లలో రాకపోకలను రద్దు చేశారు. పలు రైళ్లను దారి మళ్లించారు. రాత్రి 10 గంటల తర్వాత రైళ్లను పునరుద్ధరించారు.



సిరిసిల్ల సర్దార్‌నగర్‌లో మహిళను తరలిస్తున్న పోలీసులు



రాయికల్ మత్తడిలో వంగిపోయిన స్తంభం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి సమీపంలో అర కిలోమీటర్ మేర ధ్వంసమైన జాతీయ రహదారి



నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ వద్ద ఎన్‌హెచ్ 44ను ముంచెత్తిన స్వర్ణ నది వరద



జలమయమైన మేడారం సమ్మక్క సారక్క గద్దెల ప్రాంగణం

4 జిల్లాలు ఆగమాగం

భారీ వానలతో వణికిపోయిన ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలు

రాష్ట్రవ్యాప్తంగా వరుణుడు విరుచుకుపడ్డాడు. చాలాచోట్ల ఇటీవలికాలంలో ఎన్నడూ చూడని స్థాయిలో కుండపోత వానలు కురిశాయి. వాగులు ఉప్పొంగాయి, చెరువులు మత్తడి దూకాయి.. ఊళ్లకు ఊళ్లే నీటమునిగాయి. వందలాది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల చెరువులు, చిన్నతరహా ప్రాజెక్టులకు గండ్లు పడ్డాయి. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బుధవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం పడింది. పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ల గేట్లు ఎత్తడంతో.. మూసీలో ప్రవాహం పెరిగింది. దీనితో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం నగరంలో మున్నేరు వరద ముంపులో భవనాలు

ఉమ్మడి వరంగల్: జల విలయం

అతి భారీ వర్షాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాను జల విలయం వణికించింది. వరంగల్ నగరం నీటిలో తేలియాడుతోందా అన్నట్టుగా మారిపోయింది. గోకుల్‌నగర్, విద్యానగర్, క్రాంతినగర్, నంది తారనగర్, రాజాజీనగర్, రాంనగర్, కిషన్‌పుర ప్రాంతాలన్నీ కాలనీలన్నీ ముంపునకు గురయ్యాయి. దూపకుంట, గాడిపెల్లి, గుంటూరుపల్లి నుంచి పెద్ద ఎత్తున వరద తూర్పు కోటకు చేరింది. అగర్త చెరువు మత్తడి పడడంతో నాగేంద్రనగర్, కాశికుంట, విద్యానగర్, లక్ష్మీనగర్, శాకరాసికుంట, శాంతినగర్, ఎస్‌ఆర్‌ఆర్ తోట మీదుగా వరద ప్రవహిస్తోంది. ఎన్టీఆర్ నగర్, రామన్నపేట, పోతన రోడ్డు ప్రాంతాల్లోని కాలనీల వాసులు ఇళ్లకు తాళాలు వేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ములుగు రోడ్డు జంక్షన్‌లో నీరు నిలవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జడివాన అలజడి సృష్టించింది. టేకుమట్ల-రాఘవరెడ్డిపేట మధ్య చలివాగుపై ఉన్న బ్రిడ్జి పిల్లర్ ఒకటి కూలిపోయింది. గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రధాన ప్లాంటులోకి నీరు చేరింది. గనుల్లోకి నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి నిలిచింది.
- ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో జంపన్నవాగు రెండు వంతెనలపై నుంచి సుమారు 20 అడుగుల ఎత్తున వరద ప్రవహిస్తోంది. మేడారం సమ్మక్క-సారలమ్మ గుడి ప్రాంతం, మేడారం, రెడ్డిగూడెం, ఊరట్టం గ్రామాలు నీటమునిగాయి. అక్కడికి వచ్చిన భక్తులు, గ్రామస్తులను బోట్లతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరాపురం, అల్లంవారి ఘణపురం, చెల్పాక, బన్నాజీబంధం, ఎలిశెట్టిపల్లి, కొత్తూరు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముత్యంధార జలపాతాన్ని చూసేందుకు వెళ్లిన 84 మంది పర్యాటకులను ఎన్డీఆర్‌ఎఫ్, రెస్క్యూ టీం సిబ్బంది కాపాడారు. జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో వాగులు ఉప్పొంగుతున్నాయి. 13 చెరువులకు గండ్లు పడ్డాయి.

ఉమ్మడి కరీంనగర్: జడివాన దెబ్బ

భారీ వానకు కరీంనగర్ పట్టణంలో పలు కాలనీలు నీట మునిగాయి. రెండు ఇళ్లు కూలిపోయాయి. జమ్మికుంటలో హౌసింగ్ బోర్డ్ కాలనీ నీట మునిగింది. వరద ప్రభావంతో జమ్మికుంట, వీణవంక పట్టణాలకు గురువారం సాయంత్రం దాకా ఆర్టీసీ బస్సులను నిలిపివేసింది. సిరిసిల్ల జిల్లాలో మానేరు పరవళ్లు తొక్కుతోంది. పట్టణ శివార్లలోని పెద్ద బోనాల చెరువు తెగిపోవడంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జగిత్యాల జిల్లా బీమారం మండలం రాజలింగంపేటలో గోవిందరాజుల చెరువు తెగింది. ముగ్గురు యువకులు నీటి ఉధృతిలో చిక్కుకోవడంతో కాపాడేందుకు గ్రామస్తులు ప్రయత్నిస్తున్నారు. కోరుట్లలో బాత్‌రూమ్ గోడకూలి విజేత అనే మహిళ మృతి చెందింది.

ఉమ్మడి ఆదిలాబాద్: గ్రామాలన్నీ జలదిగ్బంధం

భారీ వర్షం, వరదలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను వణికించాయి. వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. సిరికొండ, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్‌లలో వాగులు ఉప్పొంగాయి. బోథ్, ఇంద్రవెల్లి మండలాల్లో రోడ్లు, వంతెనలు కోతకు గురవడంతో 50కిపైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల, చెన్నూరు పట్టణాల్లో లోతట్టు కాలనీలు నీట మునగడంతో ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు. నిర్మల్, భైంసా పట్టణాల్లో పలు కాలనీలు నీటమునిగాయి. జిల్లా పరిధిలో కడెం, స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులు ఆందోళనకర పరిస్థితికి చేరాయి. భైంసా మండలంలోని సిరాల చిన్నతరహా ప్రాజెక్టుకు గండిపడింది.

ఉమ్మడి ఖమ్మం: ముంచెత్తిన వరద

భారీ వర్షాలతో ఖమ్మం జిల్లాను వరద ముంచెత్తింది. మున్నేరు నీటి మట్టం 30 అడుగులు దాటడంతో వరద ఖమ్మం నగరంలో ఇరవై కాలనీలు నీట మునిగాయి. దాదాపు మూడు వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్‌లలో వరదలో చిక్కుకున్నవారిని ఎన్డీఆర్‌ఎఫ్ రక్షించారు. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌కు చెందిన పెంద్ర సతీశ్ (23) వరదలో గల్లంతయ్యాడు.

ఉమ్మడి మెదక్: పలుచోట్ల కుండపోత

భారీ వర్షాలతో ఉమ్మడి మెదక్ జిల్లాలో పలుచోట్ల కుండపోత వానలు పడ్డాయి. హుస్నాబాద్ పట్టణంలో బస్టాండ్ నీట మునిగింది. చేర్యాల మండలం వీరన్నపేట వద్ద జాతీయ రహదారి డైవర్షన్ తెగిపోవడంతో సిద్దిపేట- జనగామ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మోయతుమ్మెదవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సిద్దిపేట-హుస్నాబాద్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ఉమ్మడి నల్లగొండ: రాకపోకలు బంద్

నల్లగొండ ఉమ్మడి జిల్లాలోని ఆలేరు పెద్దవాగు, రత్నాలవాగు, బిక్కేరు, గొలనుకొండ, కొలనుపాక, చిన్నేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వలిగొండ, బీబీనగర్‌లో పలు చెరువులు, కాల్వలకు గండ్లు పడి పొలాలు నీటమునిగాయి. యాదగిరిగుట్టలోని గండిచెరువు, భువనగిరి మండలం అనాజిపురం చెరువుల కింద పొలాల్లోకి వాన నీరు చేరింది. భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూరు మున్సిపాలిటీల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బీబీనగర్, భూదాన్ పోచంపల్లి మండలాల పరిధిలోని జూలూరు, రుద్రవెల్లి, వలిగొండ మండలం భీమలింగం కత్వ, సంగెం- బొల్లేపల్లి మధ్య వంతెనలపై నుంచి మూసీ నది ప్రవహిస్తుండటంతో అధికారులు వాటిపై రాకపోకలు నిలిపివేశారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్‌లో భీమునికుంట అలుగుపోయడంతో దుబ్బగూడెం గ్రామం జలమయం అయింది. అర్వపల్లి మండలం కోడూరు, కొమ్మాల మధ్య, తిరుమలగిరి మండలం వెలుగుపల్లి-కేశవాపురం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ఉమ్మడి నిజామాబాద్: వరదకు తడిసి..

నిజామాబాద్ జిల్లా తడిసి ముద్దయింది. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పట్టణాల్లోని కాలనీలు జలమయం అయ్యాయి. చెరువులు అలుగు పారడంతో రోడ్లు తెగిపోయాయి. లోలెవల్ వంతెనలు మునిగాయి. ఆర్మూర్ వద్ద 63వ నంబర్ జాతీయ రహదారిపైకి భారీగా వరద చేరి రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. నందిపేట మండలం కుద్వాన్‌పూర్ చెరువు అలుగు వద్ద చేపల వేట కోసం వెళ్లిన కౌల్పూర్ గ్రామస్తుడు వరదలో గల్లంతయ్యాడు. కామారెడ్డి జిల్లాలో వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, తాడ్వాయి, మాచారెడ్డి, పాల్వంచ, పెద్ద కొడప్‌గల్, లింగంపేట మండలాల్లో వాగులు ఉప్పొంగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

విజయవాడ- హైదరాబాద్ హైవేపై రాకపోకలు బంద్

వాహనాల దారిమళ్లింపు

కోదాడ రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కీసర టోల్‌గేట్ సమీపంలోని ఐతవరం వద్ద మున్నేరు వాగు ఉధృతికి బ్రిడ్జిపై నుంచి నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో నేషనల్ హైవేపై విజయవాడ నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి విజయవాడకు రాకపోకలు నిలిచిపోయాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే వాహనాలను సూర్యాపేట జిల్లా కోదాడ వద్ద దారి మళ్లిస్తున్నారు. కోదాడ నుంచి హుజూర్‌నగర్, మిర్యాలగూడ మీదుగా గుంటూరు వెళ్లి విజయవాడకు చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలను గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, దాచేపల్లి, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి మీదుగా పంపిస్తున్నారు. వరద ప్రవాహం తగ్గే వరకు ఈ సూచనలు తప్పకుండా పాటించాలని పోలీసులు సూచించారు. కాగా, విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం వద్ద గురువారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు.. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను మైలవరం, తిరువూరు, ఖమ్మం మీదుగా మళ్లించారు.



హెలికాప్టర్ ద్వారా సహాయక చర్యలు

మునిగిన మోరంచపల్లి

పలువురు గల్లంతు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మోరంచ వాగు పోటెత్తడంతో.. కుందయ్యపల్లి గ్రామ సరిహద్దు నుంచి లక్ష్మారెడ్డిపల్లి వరకు సుమారు రెండు కిలోమీటర్ల వెడల్పున వరద ప్రవహించింది. మధ్యలో ఉన్న మోరంచపల్లి గ్రామం పూర్తిగా నీట మునిగింది. గ్రామంలోని 280 ఇళ్లలోని సుమారు వెయ్యి మంది సమీపంలోని భవనాలపైకి ఎక్కి తడుచుకుంటూ బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇద్దరు వరద నీటి నుంచి తప్పించుకునేందుకు చెట్టుపైకి ఎక్కి కూర్చుండిపోయారు. వరదలో గ్రామానికి చెందిన గొర్రె ఓదిరెడ్డి, గొర్రె వజ్రమ్మ, గంగడి సరోజన, గడ్డం మహాలక్ష్మి, మరికొందరు గల్లంతయ్యారు. బోట్ల సాయంతో కొందరిని రక్షించారు. సాయంత్రానికి వరద తగ్గింది. ఇక బాధితులను కాపాడేందుకు వచ్చిన రెండు హెలికాప్టర్లు.. చిట్యాల మండలంలో మోరంచవాగులో చిక్కుకున్న అస్సాం, జార్ఖండ్‌లకు చెందిన ఆరుగురు బ్రిడ్జి నిర్మాణ కార్మికులను కాపాడి ఒడ్డుకు చేర్చాయి.

- పెద్దవంగర మండలం పోచంపల్లి ఎర్రకుంట చెరువులో పడి ఇద్దరు మృతి చెందారు. కొంపల్లి, మహబూబ్‌పల్లి గ్రామాల మధ్య కాలువలో కొట్టుకుపోయి జోగు సంజీవ్ అనే వ్యక్తి చనిపోయాడు.
- ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం మారేడుగొండ చెరువుకు గురువారం తెల్లవారుజామున 3 చోట్ల గండిపడటంతో పక్కనే నివసించే బండ సారయ్య, ఆయన భార్య, తల్లి వరదలో కొట్టుకుపోయారు. సారయ్య మృతదేహం లభ్యమైనా మిగతా వారి ఆచూకీ దొరకలేదు.
- హనుమకొండ జిల్లా కన్నారం గ్రామానికి చెందిన పొన్నాల మహేందర్ (32) కన్నారం చెరువు మత్తడి నీటిలో కొట్టుకుపోయి చనిపోయాడు.
- వరంగల్‌లోని 56వ డివిజన్ టీఎస్టీవోస్ కాలనీ-2కు చెందిన గట్టు రాజు(37) వరదలో గల్లంతయ్యాడు.



గతేడాది జూలైలో ..



ఇప్పుడు..

మళ్లీ ఉప్పొంగిన కడెం


గేట్ల పైనుంచి ప్రవహించిన వరద

డేంజర్ సైరన్‌తో దిగువ గ్రామాల్లో భయాందోళనలు

కడెం: సరిగ్గా ఏడాది..మళ్లీ అదే ఉధృతి. మహారాష్ట్రతో పాటు ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు నిర్మల్ జిల్లాలో కడెం వాగు ఉప్పొంగుతోంది. కడెం మండల కేంద్రంలోని ప్రాజెక్టు గేట్ల పైనుంచి వరద ప్రవహించింది. వరదను కిందకు అదేస్థాయిలో పంపించే సమయంలో తొలుత నాలుగు గేట్లు మొరాయించడంతో గురువారం సాయంత్రం వరకు వాటి పైనుంచి ప్రవాహం కొనసాగింది.

అర్ధరాత్రి నుంచి పెరుగుతూ..: బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు 10,256 క్యూసెక్కులతో వరద మొదలైంది. అప్పటికి ప్రాజెక్టులో 691.600 అడుగుల వద్ద 5.598 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో భారీగా వస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రాజెక్టు అధికారులు నాలుగు వరద గేట్లు ఎత్తి 24,750 క్యూసెక్కులు వదిలారు. గంట గంటకు ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో 14 గేట్లను ఎత్తారు. జర్మన్ క్రస్ట్ గేట్లయిన 6, 12, 2, 3 నంబర్ గేట్లు మొరాయించాయి. గురువారం వేకువజామున 5 గంటలకు 3,87,583 క్యూసెక్కుల భారీ ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో పడింది. అప్రమత్తమైన అధికారులు 14 గేట్లను పూర్తి స్థాయిలో ఎత్తివేసి, 2,18,922 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. నాలుగు గేట్లు మొరాయించిన నేపథ్యంలో అవుట్‌ఫ్లో కంటే ఇన్‌ఫ్లో ఎక్కువై ప్రాజెక్టు గేట్ల పైనుంచి వరద ప్రవాహం కొనసాగింది. ఈ క్రమంలో ప్రాజెక్టుకు ముప్పు పొంచి ఉందని, కట్ట తెగుతుందనే ఆందోళన వ్యక్తమయ్యింది. దీంతో అధికారులు డేంజర్ జోన్ ప్రకటించి, సైరన్ మోతతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేశారు.

గేట్లతోనే సమస్య..: కడెం ప్రాజెక్టుకు మొత్తం 18 గేట్లు ఉన్నాయి. ఇవి పూర్తిస్థాయిలో ఎత్తితే ప్రమాదకర పరిస్థితులు తలెత్తేవి కాదన్న వాదన ఉంది. గత ఏడాది వరదకు 2, 3 గేట్ల కౌంటర్ వెయిట్లు కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు రెండో గేటుకు వెయిట్ బిగించారు. అయినా గురువారం ఈ గేటు పనిచేయలేదు. మూడో గేట్ పనులు ఇంకా పూర్తికాలేదు. ఇక 6, 12 నంబర్ గేట్లు సైతం ఎంతకు లేవకుండా మొరాయించాయి. మాన్యువల్‌గా హ్యాండిల్ తిప్పుతూ గేట్లను ఎత్తేందుకు ప్రయత్నించినా వరదలో కొట్టుకువచ్చిన చెట్లు, చెత్తాచెదారం తట్టుకోవడంతో సాధ్యం కాలేదు. చివరకు మధ్యాహ్నం పొక్లెయినర్ సహాయంతో వరద గేట్ల వెనుక భాగంలో ఇరుక్కున్న చెట్లను తొలగించడంతో 6, 12 గేట్లను మాన్యువల్‌గా ఎత్తారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, జిల్లా అధికారులు మొత్తం కడెంలోనే మకాం వేశారు. డ్యాంగూడ, కన్నాపూర్, కొండుకూర్ గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గత ఏడాది ఇదే సీజన్‌లో కడెంకు ఆరు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడం, ప్రాజెక్టు మునిగిపోవడం గుర్తు చేసుకుంటున్న స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.



లోయర్ మానేరు ప్రాజెక్టు గేట్ల నుంచి నీటి విడుదల

అఖండ గోదావరి!

బాబ్లీ నుంచి ధవళేశ్వరం దాకా పోటెత్తిన నది

సాక్షి, హైదరాబాద్: గోదావరి నది ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ బ్యారేజీ నుంచి తెలంగాణ మీదుగా దిగువన ఏపీలోని ధవళేశ్వరం దాకా నిండుగా ప్రవహిస్తుండటం.. మొత్తం అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో.. అఖండ గోదావరిగా మారింది. బాబ్లీ బ్యారేజీ నుంచి 2,92,889 క్యూసెక్కుల వరద వస్తుండటంతో.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తేసి 2.74 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు భారీ వరద వస్తుండటంతో 2,40,196 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఈ వరదకు స్థానిక ప్రవాహాలు చేరి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఏకంగా 7,40,951 క్యూసెక్కుల వరద వస్తోంది. ఇక్కడ 7,12,294 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఈ నీటికి దిగువన ప్రాణహిత, ఇంద్రావతి, ఇతర ఉపనదులు, వాగులు తోడై.. గోదావరిలో 12 లక్షల క్యూసెక్కులకుపైగా వరద కొనసాగుతోంది. సరస్వతి (అన్నారం), లక్ష్మి (మేడిగడ్డ), సమ్మక్క (తుపాకులగూడెం), సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం) బ్యారేజీలకు వస్తున్న నీటిని వచ్చినట్టు విడుదల చేస్తున్నారు.

భద్రాచలం వద్ద అప్రమత్తం

భద్రాచలం వద్ద గురువారం ఉదయం నీటి మట్టం 50.5 అడుగులకు పెరగడంతో ఆందోళన వ్యక్తమంది. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తర్వాత వరద తగ్గి.. రాత్రి 9 గంటలకు 11,77,133 క్యూసెక్కుల వరదతో 48.70 అడుగుల నీటిమట్టం నమోదైంది. అయితే ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి భారీగా పెరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

కృష్ణా నదికి జలకళ

మహారాష్ట్ర, కర్ణాటకలలో విస్తారంగా వానలతో కృష్ణానది జలకళ సంతరించుకుంది. ఎగువన ఆల్మట్టి డ్యామ్ నుంచి 1.75 లక్షల క్యూసెక్కులను, నారాయణపూర్ డ్యామ్ నుంచి 1.18 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఈ వరద జూరాల ప్రాజెక్టుకు చేరుతుండటంతో ఈ సీజన్‌లో తొలిసారి ఏడు గేట్లు ఎత్తారు. దీంతోపాటు విద్యుదుత్పత్తి కూడా చేస్తూ.. మొత్తం 70,422 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీనికి స్థానిక ప్రవాహం కలసి శ్రీశైలం ప్రాజెక్టులోకి 71 వేల క్యూసెక్కులకుపైగా ప్రవాహం వస్తోంది. ఇక్కడ నీటి నిల్వ 39.2 టీఎంసీలకు చేరింది. దిగువన మూసీ నుంచి వరదతో పులిచింతలలో నీటి నిల్వ 21.88 టీఎంసీలకు చేరుకుంది. ఇక కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్ర డ్యామ్‌కు 1,11,566 క్యూసెక్కుల వరద వస్తోంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

కాళేశ్వరం వద్ద టెన్షన్ టెన్షన్!

గురువారం అర్ధరాత్రి కాళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 11 లక్షల క్యూసెక్కులతో, 105.1 మీటర్లకు పెరగడం ఆందోళన రేపుతోంది. శుక్రవారం ఉదయానికి నీటి మట్టం మరింత పెరగొచ్చని అధికారులు అంచనా వేశారు. గత ఏడాది జూలై మూడో వారంలో గోదావరికి భారీ వరదలు వచ్చి.. కాళేశ్వరం వద్ద నీటి మట్టం 108.19 మీటర్లకు పెరిగింది. మేడిగడ్డ, అన్నారం పంపుహౌజ్‌లు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పట్లో మేడిగడ్డకు ఏకంగా 26,79,260 క్యూసెక్కుల అతిభారీ వరద వచ్చి బ్యారేజీ గేట్లపై నుంచి పొంగిపొర్లింది.



➤ ఈ నెల 26న మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కోనంపేట గ్రామపంచాయతీ పాటి గ్రామానికి చెందిన మూడు నెలల గర్భిణి రెడ్డి మల్లక్క జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రికి వెళ్లేందుకు అరిగోస పడింది. ఎర్రవాగు ఉప్పొంగడంతో 108 వాహనం వచ్చే పరిస్థితి లేక ఎడ్లబండి, ఆటోలో వెళ్లింది. మొదట బెల్లంపల్లి, అటు నుంచి మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడంతో గర్భస్రావం జరిగింది.

గర్భిణుల అరిగోస

ప్రసవ వేదనకు మించిన వాగుల గండం..

- పురిటినొప్పులొస్తే ఇప్పటికీ ఎడ్లబండిలోనే
- లేదంటే బురదలో పంటచేల మీదుగా..
- అడవి దారిలో నరకయాతన పడి నడుస్తూ వెళ్లాల్సిందే
- వానాకాలంలో ఏజెన్సీ గిరిజన మహిళల తిప్పలు.. కనీస రోడ్డు సౌకర్యం లేక అవస్థలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏటా ఇవే ఇబ్బందులు



➤ ఇది ఆదిలాబాద్ జిల్లా నార్నూరు మండలం ఎంపల్లి, గోండుగూడ వెళ్లే దారి. వర్షాలు కురిసి వరదలు వస్తే నానా కష్టాలు పడాలి. అత్యవసర సమయంలో గర్భిణులు, బాధితులు ఆసుపత్రులకు వెళ్లేందుకు ఇక్కడి గిరిజనులు నరకం చూస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పురిటినొప్పులొస్తే ఇప్పటికీ ఎడ్లబండిలోనే... లేదంటే బురదలో పంటచేల మీదుగా... అడవి దారిలో నరకయాతన పడి నడుస్తూ... ఏటా వానాకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల గర్భిణుల కష్టాలివి. వాగులు, వంకలు ఉప్పొంగినప్పుడు, కల్వర్టులు, రోడ్డు డ్యాం, లోవల్ వంతెనలు దెబ్బతిన్న సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లేందుకు నేటికీ నానాకష్టాలు పడాల్సి వస్తోంది. 108, 102 వాహనాలు వెళ్లలేక ఎడ్లబండి, ప్రైవేటు వాహనాలు, మనుషులే మోసుకుని వస్తూ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. దీంతో కొన్నిసార్లు తల్లి, బిడ్డ ప్రాణాలకు ప్రమాదం ముంచుకొస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నార్నూరు, గాదిగూడ, ఉట్నూరు, ఇంద్రవెల్లి, జైనూర్, కెరమెరి, తిర్యా ణి, బెజ్జూరు, చింతలమానేపల్లి, దహెగాం, వేమనపల్లి, కాసిపేట, కోటపల్లి మండలాల్లో రాకపోకలకు ఇప్పటికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నెరవేరని హామీలు..

➤ ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో రిస్కు ఉన్న గర్భిణులను వారం ముందే ఆసుపత్రికి తరలించి డెలివరీలు చేయాలి. ఇందుకు ప్రత్యేకంగా 'బర్త్ వెయిటింగ్ రూమ్స్' ఏర్పాటు చేశారు. ఇది పకడ్బందీగా అమలు కావడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో 133గ్రామాలు ఉన్నాయి. ఒక్క ఆసిఫాబాద్ జిల్లాలోనే 219గ్రామాలు హై రిస్కులో ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఈ నెలలో ప్రసవమయ్యే 46మందిని గుర్తించారు. కేవలం నార్మల్ డెలివరీలకే ఈ జిల్లాలో సేవలు అందుతున్నాయి. సిజేరి యన్ చేయాలంటే ఆదిలాబాద్ రిమ్స్, మంచిర్యాలకు రిఫర్ చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో వానాకాలంలో ఎయిర్ అంబులెన్సులు అందుబాటులో ఉంచుతామని హామీలు ఇచ్చినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు.



➤ గురువారం మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నాగారానికి చెందిన నిండు గర్భిణి దుర్గం లావణ్య పురిటి నొప్పుల బాధతోనే అటవీ ప్రాంతం గుండా నడవాల్సి వచ్చింది. ఇక్కడ కల్వర్టు దెబ్బతినడంతో తిప్పలు పడాల్సి వచ్చింది.

ఎందుకీ సమస్య..?

➤ అటవీ సమీప గ్రామాలకు రోడ్లు వేసేందుకు అటవీ శాఖ నుంచి అనుమతులు రావడం లేదు. అనాదిగా ఆ గ్రామాలకు మట్టి రోడ్లే దిక్కవుతున్నాయి. రిజర్వు ఫారెస్టుల్లో కొత్త రోడ్లు, విస్తరణ, కల్వర్టులు, హై లెవల్ వంతెనల నిర్మాణాలకు అనుమతుల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే రిజర్వు ఫారెస్టుల్లో రోడ్ల పనులు చేపట్టారు. అయితే వాటిపై కేసులు నమోదయ్యాయి. కొత్త అనుమతులు పొందాలంటే క్లిష్టంగా మారింది. కొన్ని చోట్ల టైగర్‌జోన్, రిజర్వు ఫారెస్టు గుండా వెళ్లే రోడ్లకు అనుమతులు కేంద్రం నుంచి సులువుగా రావడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు నేరుగా నిధులు మంజూరు చేయించి, పనులు చేపట్టే ప్రయత్నాలు చేస్తే, అటవీ శాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన ఘటనలు ఉన్నాయి.



➤ ఈ నెల 24న కుమురంభీం జిల్లా దహెగాం మండలం లోహకు చెందిన గర్భిణి మడే ప్రమీలను సరైన రోడ్డు సౌకర్యం లేక అష్ట కష్టాలు పడుతూ ఎడ్లబండిలో ఆసుపత్రికి తరలించారు. ఇదే మండలం రావుపల్లికి చెందిన ఆలం భాగ్యలక్ష్మికి పురిటి నొప్పులు వచ్చాయి. సిగ్నల్స్ లేక సెల్‌ఫోన్లు పనిచేయక 108కు సమాచారం ఇవ్వలేకపోయారు. 30కిలోమీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీ చేరుకునేందుకు ప్రైవేట్ జీపులో వెళ్లారు. చివరకు తల్లీబిడ్డ క్షేమం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

➤ ఈ నెల 20న ఆదిలాబాద్ రూరల్ మండలం అంకాపూర్‌కు పరిధి చిన్నమారుతిగూడకు చెందిన ఆత్రం సావిత్రి బాయి పురిటి నొప్పులతో బాధపడుతూ అరకిలోమీటరు మేర బురదలో, పంట చేను మీదుగా నడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. ఈ ఆవాసానికి సరైన రోడ్డు లేకపోవడమే ఇక్కడి వారికి శాపంగా మారింది.



జేసీబీలో నిండుగర్భిణి తరలింపు

ఆసుపత్రికి వెళ్తుండగా మార్గమధ్యంలో చెరువుకట్ట తెగడంతో అవస్థలు

భీమ్‌గల్: ఓ నిండుగర్భిణి పురిటినొప్పులతో ఇబ్బంది పడుతుండటంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకుని వెళ్తుండగా దారి మధ్యలో చెరువుకట్ట తెగి నీటి ప్రవాహం పెరిగింది. జేసీబీ సహాయంతో ఆమెను నీటిప్రవాహంలోంచి దాటించి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. భీమ్‌గల్ మండలం పిప్రి గ్రామానికి చెందిన నిండుగర్భిణి అనిలకు గురువారం పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడానికి బయలుదేరారు. మార్గమధ్యంలో పిప్రి నుంచి బాచన్‌పల్లి వెళ్లే దారిలో ఉన్న చెరువుకట్ట తెగిపోయింది. దీంతో ఆమెను జేసీబీలో కూర్చోబెట్టి దాని సహాయంతో నీటి ప్రవాహాన్ని దాటించారు. అక్కడి నుంచి 108 అంబులెన్స్ ద్వారా ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గర్భిణిపై కూలిన ఇంటిపైకప్పు

- చనిపోయిన గర్భస్థ శిశువు.. మహిళ పరిస్థితి విషమం
- మరో పక్షం రోజుల్లో ప్రసవం.. అంతలోనే ప్రమాదం
- మెదక్ జిల్లాలో ఘటన



మిలట్రీ కాలనీలో కూలిన ఇల్లు

మెదక్ మున్సిపాలిటీ: తొలి కాన్పు కోసం పుట్టింటికి వచ్చిన గర్భిణిపై ఇల్లు కూలిన ఘటనలో కడుపులోని గర్భస్థ శిశువు మృతి చెందగా.. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషాదఘటన మెదక్‌లోని మిలట్రీ కాలనీలో చోటుచేసుకుంది. స్థాని కుడైన మహ్మద్ సర్వర్ ఆటో నడుపుతూ జీవ నం సాగిస్తు న్నాడు. రెండో కూతురు యాస్మిన్ సుల్తానా ఇటీవల కాన్పు కోసం పుట్టింటికి వచ్చింది. 15 రోజుల్లో ఆమెకు ప్రసవం చేయాల్సి ఉంది. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రి స్తున్న తరు ణంలో భారీ వర్షాలకు తడిసిన ఇంటి గోడ పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో యాస్మిన్ తీవ్రంగా గాయ పడట ంతో వెంటనే మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు ఆమె కడుపులో గర్భస్థ శిశువు మృతి చెందినట్లు గుర్తించి తొలగించారు. యాస్మిన్‌ను హైదరా బాద్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు చెప్పారు. కాగా, ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన యాస్మిన్ తల్లి చాంద్ సుల్తానా మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. యాస్మిన్ సుల్తానా కుటుంబాన్ని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు గురువా రం పరామర్శించి రూ.లక్ష సాయం అందించారు.

ట్రాక్టర్‌పై వాగు దాటించి..



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రం నుంచి అమర్లబండకు వెళ్లే మార్గంలోని వాగు ఉప్పొంగింది. అమర్లబండకు చెందిన సుంకరి దివ్య అనే మహిళ తీవ్ర అనారోగ్యానికి గురి కాగా.. పోలీసులు ఆమెను కేజ్‌వీల్ ట్రాక్టర్‌పై వాగు దాటించి, ఆస్పత్రికి తరలించారు.

తాడు పట్టుకుని వరద దాటి..



మెదక్ మండలం మల్కాపూర్ తండాకు చెందిన గర్భిణి నవనీతకు గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. మల్కాపూర్ తండా మార్గంలోని వంతెనపై భారీగా వరద పారుతుండటంతో తండా వాసులు ఆమెను తాడు సాయంతో దాటించి ఆస్పత్రికి తరలించారు.



హమ్మయ్య.. బోటొచ్చింది

వరంగల్ హంటర్‌రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీ జలదిగ్బంధమైంది. విద్యార్థినులు ఫస్ట్ ఫ్లోర్, భవనంపైకి ఎక్కి బిక్కుబిక్కుమంటూ గడిపారు. గురువారం ఉదయం బోట్లతో వారిని బయటికి తీసుకువచ్చారు. - కాజీపేట అర్బన్

సహాయక చర్యల్లో రెడ్‌క్రాస్ పాల్గొనాలి: తమిళిసై



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బాధితుల కోసం సహాయ, పునరావాస కార్య క్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని రెడ్ క్రాస్ సొసైటీకి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. రాజ్‌భవన్ నుంచి గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాల ప్రతినిధులతో ఆమె వర్చువల్‌గా సమావేశమయ్యారు. సహాయక చర్యల్లో గర్భిణీలు, వృద్ధులు, రోగులు, వికలాంగుల పట్ల దృష్టి సారించాలని కోరారు. జిల్లా పాలనా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుని బాధితులకు నిత్యావసర వస్తువులు, వైద్య సహాయం అందించాలన్నారు. గతేడాది తరహాలో రాజ్‌భవన్‌లో విరాళాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రాణ నష్టం జరగొద్దు..

- మంత్రులు, అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం
- క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలని సూచన
- వర్షాలు, వరదల పరిస్థితిపై నిరంతర సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. వరద పరిస్థితులపై గురువారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఆయన ప్రగతిభవన్ నుంచి సమీక్షించారు. మంత్రులతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే మెరుగైన చికిత్స అందేలా చూడాలని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం రేయింబవళ్లు క్షేత్ర స్థాయిలో ఉంటూ రక్షణ చర్యలు చేపడుతున్నారని సీఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్‌కు ఆదేశాలు..

పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆమె సచివాలయం నుంచి వరద పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ముంపు ప్రాంతాలకు హెలికాప్టర్లు, ఆహారం, వైద్యం, రక్షణ సామగ్రి పంపించారు. పోలీసు యంత్రాంగం సహాయక చర్యల్లో పాల్గొనేలా చూడాలని డీజీపీ అంజనీకుమార్‌ను సీఎం ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు డీజీపీ రాష్ట్ర స్థాయి వరద పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇన్‌ఫ్లోలు ముందుగా అంచనా వేయాలి

గోదావరి, ఉప నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో వరద ముంపును తగ్గించే చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను సీఎం ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రాజెక్టుల సీఈలకు స్వయంగా ఫోన్ చేసి పరిస్థితులను ఆరా తీశారు.

క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా

మంత్రులతో సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు ఫోన్లలో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిస్థితులను ఆరా తీస్తూ సూచనలు చేశారు. మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఫోన్ చేసి గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మోరంచపల్లిలో ప్రజలను రక్షించే చర్యలను సమీక్షించారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటిస్తూ, సహాయ చర్యలను పర్యవేక్షించారు. మంత్రులు కొప్పుల ఈశ్వర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ తమ తమ జిల్లాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా వట్టిమల్లలో చెరువును తలపిస్తున్న పంటపొలాలు

5 లక్షల ఎకరాల్లో పంటల మునక!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కుండపోత వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో వివిధ పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఇప్పుడిప్పుడే వేసిన పంటలు నీటిలో మునిగిపోయాయి. వ్యవసాయశాఖ వేసిన అంచనా ప్రకారం దాదాపు 5 లక్షల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. నిజామాబాద్ జిల్లాలో 21,500 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అక్కడి వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అలాగే ఇతర ప్రాంతాల్లో సోయాబీన్, మొక్కజొన్న, పెసర సహా ఇతర పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదు. పత్తి కూడా చాలాచోట్ల నీటమునిగింది. మొలక స్థాయిలో ఉన్న పత్తి 10 రోజుల తర్వాత కూడా నీటిని తోడేస్తే నిలబడగలుగుతుందని... విత్తనాలు వేసిన చోట నేల మునిగితే మాత్రం అది భూమిలోనే కుళ్లిపోతుందని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రాథమిక స్థాయిలో నాట్లు పడినచోట్ల, వరినారు వరదలతో కొట్టుకుపోయింది. అయితే వరదల కారణంగా పూర్తిస్థాయిలో నష్టం అంచనాకు వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లలేకపోతున్నారని అధికారులు అంటున్నారు.

తెరిపినిస్తేనే వ్యవసాయానికి ఊపు...

ప్రస్తుత భారీ వర్షాలతో వ్యవసాయానికి ఊపు వచ్చింది. అయితే భారీ వరదల కారణంగా పంటలకు నష్టం తప్పడంలేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 68.80 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అందులో అత్యధికంగా పత్తి 40.73 లక్షల ఎకరాల్లో సాగవగా 15.63 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. సోయాబీన్ 4.14 లక్షల ఎకరాల్లో, కంది 3.82 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 3.62 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తికి నష్టం జరిగితే తెరిపినిచ్చాక మరోసారి విత్తుకోవల్సి రానుంది. మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటలు దెబ్బతింటే మరోసారి వేసుకొనే పరిస్థితి ఉండదని అధికారులు అంటున్నారు. పత్తికి ఆగస్టు 10లోగా వేసుకొనే వెసులుబాటు ఉంటుందని, కొందరు రైతులు మూడోసారి కూడా వేసుకొనే పరిస్థితి తలెత్తుతుందని చెబుతున్నారు. ఏదైనా ప్రస్తుత వర్షాలు ఆగిపోతేనే పంటలను కాపాడుకోవచ్చని పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుత వర్షాల వల్ల వరి విస్తీర్ణం మాత్రం మరింత పెరుగుతుందని... ఈసారి కూడా వరి వరిసాగు రికార్డు స్థాయిలో జరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వ్యవసాయ సిబ్బంది సెలవుల రద్దు?

వర్షాలు, వరదల కారణంగా జిల్లాల్లో వ్యవసాయాధికారుల సెలవులు రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

మానేరులో చిక్కుకున్న 19 మంది..

- 7 గంటలు శ్రమించి 18మందిని కాపాడిన అధికారులు
- కొట్టుకుపోయినా సురక్షితంగా బయటపడిన ఓ యువకుడు



మధు

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం గోపాల్‌పూర్ వద్ద మానేరు వాగులో ఉన్న ఇసుక క్వారీకి ఉపయోగించే వాహనాలను ఒడ్డుకు చేర్చేందుకు వెళ్లిన 19 మంది వరద ఉధృతి ఎక్కువ కావడంతో బయటకు రాలేక అక్కడే చిక్కుకుపోయారు. వరద పెరగడంతో జేసీబీ సమీపంలోని ఇసుక కుప్పలు, వాహనాలు ఎక్కి నిల్చున్నా రు. వారిలో జగిత్యాలకు చెందిన ఏడ్దం మధు జారిపడి వరదలో కొట్టుకుపోయాడు. అయితే సురక్షితంగా బయటపడిన మధు చిన్నఓదాల గ్రామ శివారులో ఒడ్డుకు చేరి తిరిగి గోపాల్‌పూర్‌కు చేరుకున్నాడు. ఈదుకుంటూ చెట్ల సాయంతో ఒడ్డుకు చేరినట్లు మధు తెలిపాడు. కాగా 7 గంటల పాటు శ్రమించిన సహాయ సిబ్బంది వాగులో చిక్కుకుపోయిన మిగతా 18 మందిని కాపాడారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా కంట్రోల్ రూం నంబర్ 7995070699ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

వామ్మో వాన!

▶ మొదటి పేజీ తరువాయి

గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. భూపాలపల్లిలోని మోరంచ వాగు ఉధృతికి గ్రామం పూర్తిగా నీట మునగడంతో.. అక్కడి వారిని రక్షించడానికి హెలికాప్టర్లతో సహాయక చర్యలు చేపట్టారు. ఈ వానలతో గోదావరి ఉగ్రరూపం దాల్చగా.. కృష్ణా నదిలోనూ ప్రవాహం పెరుగుతోంది.

రాష్ట్రంలో 9.77 సెంటీమీటర్ల సగటు

బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా 9.77 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. హన్మకొండ జిల్లాలో అయితే ఏకంగా 27.59 సెంటీమీటర్లు, భూపాలపల్లి జిల్లాలో 26.46, వరంగల్ జిల్లాలో 21.46, కరీంనగర్ జిల్లాలో 20.10 సెంటీమీటర్ల సగటు వర్షం పడటం గమనార్హం.

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలివీ.. (సెం.మీ.లో)

జిల్లాల	ప్రాంతం	వర్షపాతం
ములుగు	లక్ష్మీదేవిపేట	64.98
జయశంకర్	చిట్యాల	61.65
జయశంకర్	చెల్పూరు	47.58
జయశంకర్	రేగొండ	46.70
జయశంకర్	మొగుళ్లపల్లి	39.40
కొత్తగూడెం	కరకగుడెం	39.05
కరీంనగర్	మల్యాల	38.55
హన్మకొండ	కమలాపూర్	36.35
ఆదిలాబాద్	సిరికొండ	32.63
కరీంనగర్	కొత్తపల్లి-ధర్మారం	31.28
జయశంకర్	టేకుమట్ల	31.18



వర్షాలకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో నీట మునిగిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

గురువారం జిల్లాల వారీగా సగటు వర్షపాతం (సెం.మీ.లలో)

జిల్లా	వర్షపాతం
హన్మకొండ	27.59
భూపాలపల్లి	26.46
వరంగల్	21.46
కరీంనగర్	20.10
మహబూబాబాద్	19.41
ములుగు	19.37
కొత్తగూడెం	16.56
ఆదిలాబాద్	15.49
జనగామ	14.30
జగిత్యాల	13.70
పెద్దపల్లి	12.41
రాజన్న సిరిసిల్ల	10.98
నిర్మల్	10.96
ఖమ్మం	9.49
సిద్దిపేట	9.13
కుమ్రుంభీం	9.10
మంచిర్యాల	8.29
యాదాద్రి భువనగిరి	7.87
నిజామాబాద్	7.48
సూర్యాపేట	6.80
మల్కాజ్‌గిరి	5.38
వనపర్తి	5.06
హైదరాబాద్	4.49
జోగులాంబ గద్వాల	4.68
మెదక్	4.60
కామారెడ్డి	4.47
మహబూబ్‌నగర్	3.99
నారాయణపేట	3.75
రంగారెడ్డి	3.66
నల్లగొండ	3.60
నాగర్‌కర్నూల్	3.57
వికారాబాద్	3.40
సంగారెడ్డి	2.97

ఫ్యాషన్













ట్రెండ్

వేడుకలు సంప్రదాయమైనా పాశ్చాత్యమైనా టాప్ టు బాటమ్ స్పెషల్‌గా కనిపించాలనుకునేవారికి నెయిల్ ఆర్ట్ కూడా తనదైన ముద్ర వేస్తోంది. సందర్భానికి తగిన డిజైన్లతో నఖ శిఖ పర్యంతం ఆకట్టుకోవడానికి కొత్తగా ముస్తాబు అవుతోంది.

కళ పెంచే పండగ

వేడుకలకు తగినట్టుగా రెడీ అవడానికి తగిన డ్రెస్‌లను ఎంపిక చేసుకుంటాం. అలాగే, వాటికి తగిన మ్యాచింగ్ పట్ల కూడా శ్రద్ధ పెడతాం. అయితే, మరింత ప్రత్యేకత చూపడానికి నెయిల్ ఆర్ట్ డిజైన్స్‌లోనూ శ్రద్ధ తీసుకుంటున్నారు నేటి యువత. ఫ్రెండ్‌షిప్ డే, ఇండిపెండెన్స్ డే, రక్షాబంధన్, కృష్ణాష్టమి.. వంటి రాబోయే వేడుకలను నెయిల్ ఆర్ట్ డిజైన్స్‌లో చూపుతూ సందర్భానికి తగినట్టుగా రెడీ అవుతున్నారు.







కొన్ని రంగుల నెయిల్ పాలిష్‌లు తెచ్చుకొని, డ్రెస్‌కు లేదా చీరకు మ్యాచ్ అయ్యే రంగును గోళ్లకు వేసుకోవడం మనకు తెలిసిందే. అయితే, ఇప్పుడు చీర లేదా డ్రెస్ రంగుతోపాటు ఆ డిజైన్‌కు మ్యాచ్ అయ్యే, పండగ థీమ్ ఆర్ట్‌ను నెయిల్స్‌పై ఎంచుకుంటున్నారు. అందుకు నెయిల్ ఆర్ట్ స్పాలు ప్రత్యేకంగా తోడ్పడుతున్నాయి.













కొనుగోరు చేయవచ్చు!

ఎంత బాగా షేప్ చేసినా, గోళ్లు విరిగిపోవడం సహజంగా జరుగుతుంటుంది. నెయిల్ ఆర్ట్‌తో వేళ్లు అందంగా ఉండాలనుకునేవారు ఆర్టిఫిషియల్ నెయిల్స్‌తో సరికొత్తగా మార్చుకుంటున్నారు. ఈ మోడల్స్ మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిని మన నెయిల్ షేప్‌ను బట్టి, జెల్‌తో సెట్ చేసుకోవచ్చు. ఆ తర్వాత పాలిష్‌తో డిజైన్ చేసుకోవచ్చు. నచ్చిన డిజైన్ సరైన విధంగా రాదనుకునేవారు నిపుణుల సాయం తీసుకోవచ్చు.

- చేతులకు పెడిక్యూర్‌లో భాగంగా వేలి కొసల్లో క్యుటికల్స్, డెడ్‌స్కిన్ అంతా క్లీన్ చేసి అప్పుడు మన వేళ్లను బట్టి ఏ షేప్‌లో కావాలో ఆ ఆర్టిఫిషియల్ నెయిల్స్ అమర్చుకోవాలి. (నెయిల్స్ పెరిగినప్పుడు, వీటిని మళ్లీ క్లియర్ చేసుకోవచ్చు).

బ్యూటిప్స్

హెయిర్ కేర్

- జుట్టు పొడిబారి నిర్జీవంగా ఉంటే పెరుగు మంచి ఫలితాన్నిస్తుంది. ఒక కప్పు పుల్లటి పెరుగు తీసుకోవాలి. జుట్టును చిక్కులేకుండా దువ్వి పెరుగును ఒక్కొక్క స్పూన్ తల మీద వేస్తూ వేళ్లతో మర్దన చేయాలి. తలంతా ప్రతి వెంట్రుక కుదురుకూ పెరుగు పట్టాలన్న మాట. ఓ అరగంట తర్వాత వేడినీటితో తలస్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే జుట్టు చిట్లిపోకుండా మృదువుగా, ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. వేళ్లతో తలంతా మర్దన చేసుకోవడం సాధ్యం కాకపోతే జుట్టు కుదుళ్లకు పెరుగును పట్టించిన తర్వాత గుండ్రటి పళ్లున్న దువ్వెనతో పది నిమిషాల సేపు దువ్వితే సరిపోతుంది.



- జుట్టు రాలుతుంటే బంగాళదుంప రసం బాగా పని చేస్తుంది. బంగాళాదుంపను తురిమి రసం తీసుకోవాలి. అరకప్పు రసంలో రెండు టేబుల్ స్పూన్‌ల కలబంద గుజ్జు కలిపి తలకు పట్టించాలి. జుట్టుకు పైన రాసి సరిపుచ్చకూడదు. కేశాల మొదళ్లకు పట్టేలా రాసి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. రెండు గంటల తర్వాత వేడి నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తుంటే జుట్టురాలడం తగ్గిపోతుంది.



వినూత్న ఆలోచన

మా కథలు మా సొంతం

అవ్వలు, తాతలు గతించిపోతే వారికి తెలిసిన జానపద సంపద కూడా అంతరించిపోతుంది. మన పెద్దల నుంచి వినాల్సిన ఎన్నో కథలు, పాటలు, సామెతలు, ఉదంతాలు ఇప్పటికే మన నిర్లక్ష్యం వల్ల అందకుండా పోయాయి. కేరళలో చిన్నారులు ఇకపై ఇలా జరగడానికి వీల్లేదంటున్నారు. తల పండిన వృద్ధుల దగ్గర కూచుని వారికి తెలిసిన మౌఖిక జానపద కథలను రికార్డు చేస్తున్నారు. 'ది లోర్ కీపర్స్' పేరుతో పిల్లలు ఇలా కథలు సేకరించేందుకు ఒక ఎన్.జి.ఓ. ప్రతి బడికి తిరిగి శిక్షణనిస్తోంది. ఇది చాలా మంచి ఆలోచన కదూ.

బహుశా ఇప్పుడున్న నానమ్మ, తాతయ్యల తరమే కొద్దో గొప్పో జానపద వారసత్వాన్ని కాపాడుకున్న తరం కావచ్చు. ఆ తర్వాతి తరమంతా సెల్‌ఫోన్‌ల తరం. టీవీల తరం. ఓటీటీల తరం. ఇప్పుడు పల్లెల్లో ఎవరూ గుంపుగా కూచుని కథలు చెప్పుకోవడం లేదు. తరం నుంచి తరానికి అందాల్సిన మాటలను చెప్పుకోవడం లేదు. పాటలను పంచుకోవడం లేదు. ఆటలను ఆడుకోవడం లేదు. 'స్థానిక సంస్కృతి', 'జానపద వారసత్వం' ప్రతి సమూహానికి ఉంటుంది. అది ఉమ్మడి ఆస్తి. జాగ్రత్తగా తరం నుంచి తరానికి అందించాలి. తెలంగాణలో ఆదిలాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు వరకూ ప్రతి సమూహంలోని ఎందరో వృద్ధులకు– చదవడం, రాయడం రాకపోయినా కథలూ గాథలూ పురాణాల స్థానిక ప్రక్షిప్తాలు చారిత్రక ఘటనలు తెలిసి ఉంటాయి. వారు గతించితే అవి అంతరించిపోతాయి. ఇప్పటికే ఎన్నో తరాల వద్ద నుంచి స్వీకరించి నిక్షిప్తం చేయాల్సిన మౌఖిక జానపద సంపదను రికార్డు చేయడంలో చాలా నిర్లక్ష్యం పాటించి ఉన్నాం. ఇప్పటికీ అరకొరగా మాత్రమే ఆ పని జరుగుతూ ఉంది. ఈ తరం కూడా దాటిపోతే ఆ తర్వాత తెల్ల ముఖం వేయాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో కేరళ మేల్కొంది. ఇప్పటి వృద్ధతరం వెళ్లిపోక ముందే వారి నుంచి జానపద సంపదను అందుకోవాలనుకుంది. 'ఆర్కయివల్ అండ్ రీసెర్చ్ ప్రాజెక్ట్' (ఏ.ఆర్.పి.ఓ) అనే స్వచ్ఛంద సంస్థ 'ది లోర్ కీపర్స్' పేరుతో పిల్లల్నే సైనికులుగా రంగంలో దింపి జానపద కథలను రికార్డు చేయించి డిజిటల్ ఆర్కయివ్‌గా నిక్షిప్తం చేయనుంది.

కరోనా సమయంలో ఆలోచన

'ఆర్కయివల్ అండ్ రీసెర్చ్ ప్రాజెక్ట్' వ్యవస్థాపకుల్లో ఒకడైన స్రుతిన్ లాల్ కేరళలో జర్నలిస్ట్. కరోనా సమయంలో లక్షలాదిగా ఇళ్లకు మళ్లిన వలస కార్మికుల వ్యధను రికార్డు చేయడానికి ఢిల్లీ నుంచి లక్నో వరకు వారితో పాటు 600 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశాడు. వారి దీనాలాపనను రికార్డు చేశాడు. ఆ సమయంలో వారి మాటలను రికార్డు చేయకపోతే ఆ తర్వాత ఆ సందర్భం, ఆ మాటలు రెండూ మిస్ అయిపోతాయి. భావితరాలకు ఆ వేదన అందదు. సరిగ్గా ఆ సమయంలోనే వృద్ధ తరం దగ్గర ఉన్న జానపద సంపద అతనికి గుర్తుకొచ్చింది. 'నా బాల్యంలో అమ్మమ్మ, నానమ్మలు చెప్పే కథలు ఇప్పుడు అమ్మమ్మలు, నానమ్మలు చెప్పడం లేదు. ఏవో కొద్దిమంది దగ్గరే అలాంటివి మిగిలి ఉన్నాయి... వాటిని కాపాడుకోవాలి' అనుకున్నాడతడు. ఆ ఆలోచన ఎన్.జి.ఓ. స్థాపనకు కారణమై మార్జినలైజ్డ్ సెక్షన్స్ దగ్గర వున్న కళారూపాలను నిక్షిప్తం చేసే పనికి అతణ్ణి పురిగొల్పింది.





బామ్మల నుంచి కథలు రికార్డ్ చేస్తున్న పిల్లలు

పిల్లలే సైనికులు

మౌఖిక జానపద కథకు వారసులు బాలలు. వారికే ఆ విలువైన జానపద సంపద అందాలి. అలా అందాలంటే వారే నేరుగా రంగంలోకి దిగాలి అనుకున్నాడు స్రుతిన్ పాల్. 'ఇప్పుడు దాదాపు ప్రతి చిన్నారికి సెల్‌ఫోన్ అందుబాటులో ఉంది. వారు సెల్‌ఫోన్‌ను అద్భుతంగా హ్యాండిల్ చేస్తారు. అన్నీ టక్కున నేర్చుకుంటారు. వారికి రికార్డు చేసి ఎడిట్ చేయడం నేర్పిస్తే వారే పెద్దవాళ్ల దగ్గర కూచుని అన్నీ చెప్పించుకుంటారు. పైగా పిల్లలు అడిగితే చెప్పడానికి అవ్వలు, తాతలు ఇష్టపడతారు కూడా' అంటాడు లాల్. అందుకోసం తన సంస్థ తరఫున కొందరు వాలంటీర్లను కేరళలోని వివిధ జిల్లాల స్కూళ్లకు పంపడం మొదలెట్టాడు. వారు స్కూల్లో పిల్లలకు మౌఖిక జానపద సంపద సేకరణ గురించి చెప్పి, సెల్‌ఫోన్‌తో పెద్దవాళ్లు చెప్పే కథలను ఎలా రికార్డు చేసి తమకు పంపాలో నేర్పుతారు. ఇక పిల్లలు ఊరుకుంటారా? రంగంలో దిగి వరదలా వీడియోలు పంపుతున్నారు. అవన్నీ నిక్షిప్తం అవుతున్నాయి.

విన్నవీ కన్నవీ

కాశీమజిలీ కథలో, కాటమరాజు కథలో, మర్యాద రామన్న కథలో, పూటకూళ్లమ్మ కథలో... అడవి కథలో, వేట కథలో, వ్యవసాయ కథలో, ప్రకృతి కథలో, గొడ్డుగోదా కథలో, రాజు పేదా కథలో... ఏవో కథలు ఒకప్పుడు చెప్పుకోని, వినని వారు ఉండరు. అయితే అందరూ గుర్తు పెట్టుకుని మళ్లీ చెప్పే స్టోరీ టెల్లర్లు కారు. కొందరు మాత్రమే 'కథల పుట్ట'గా ఉంటారు. వీరు స్థానిక జ్ఞానాన్ని కథల్లో దాచి ఉంటారు. అవి రికార్డు కావాలి. కేరళలో ఇప్పుడు ఆ పని జరుగుతూ ఉంది. నిజానికి ప్రతిచోటా ప్రభుత్వాలు పూనుకుని ఈ పని చేస్తే ప్రతి ప్రదేశంలోని విలువైన కథలు బయటికొస్తాయి. యూట్యూబ్‌లాంటి మాధ్యమాల వల్ల అందరికీ తెలుస్తాయి.

కేరళ మేల్కొంది. అందరూ మేల్కొనాలి.

వంటిల్లు

మనసు దోచే మైసూరు పాకం

ప్రపంచంలో ఎక్కువ మంది ఇష్టంగా తినే స్ట్రీట్ ఫుడ్స్‌లో మన మైసూర్‌పాక్ కూడా ఒకటి. ఎంతోమంది మనసులు గెలుచుకున్న మైసూర్ పాక్‌ను మరింత వైవిధ్యంగా కూడా చేయొచ్చు. అందుకే విభిన్న మైసూర్‌పాక్‌లతో మీ ముందుకొచ్చింది ఈ వారం వంటిల్లు...

బీట్‌రూట్‌తో



కావలసినవి: బీట్ రూట్ జ్యూస్ – అరకప్పు; శనగపిండి – కప్పు; నెయ్యి – ఒకటిన్నర కప్పులు; చక్కెర – కప్పు.

తయారీ: శనగపిండిని సన్నని మంట మీద పచ్చివాసన పోయేంతవరకు వేయించి దించేయాలి • వేగిన పిండి జల్లెడ పట్టుకోవాలి. ఇప్పుడు ఈ పిండిలో నెయ్యి వేసి ఉండలు లేకుండా చక్కగా కలుపుకొని పక్కన పెట్టాలి • మందపాటి బాణలిలో పంచదార, బీట్‌రూట్ జ్యూస్ వేసి సన్నని మంటమీద తిప్పుతూ తీగపాకం రానివ్వాలి • పాకం వచ్చిన తరువాత కలిపిపెట్టుకున్న శనగపిండి మిశ్రమాన్ని వేస్తూ కలుపుకోవాలి •చక్కగా కలిపాక అరకప్పు నెయ్యిని కొద్దికొద్దిగా వేస్తూ కుపాలి • నెయ్యి మొత్తం మిశ్రమంలో ఇగిరిపోయి , చిక్కబడిన తరువాత దించేసి, నెయ్యి రాసిన ప్లేటులో పోయాలి • గంట ఆరాక ముక్కలు కోసుకుని సర్వ్‌చేసుకోవాలి.

కొబ్బరి.. జీడిపప్పుతో..

కావలసినవి: శనగపిండి – కప్పు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; సన్నగా తరిగిన జీడిపప్పు పలుకులు – ముప్పావు కప్పు ; చక్కెర – రెండు కప్పులు ; నెయ్యి – ముప్పావు కప్పు ; యాలకులు – నాలుగు; నీళ్లు – ఒకటి ముప్పావు కప్పులు.



తయారీ: శనగపిండిని జల్లెడపట్టుకుని, అర కప్పు నెయ్యి వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి • మందపాటి గిన్నెలో చక్కెర, నీళ్లు పోసి తీగ పాకం వచ్చేంత వరకు మరిగించాలి • తీగపాకం వచ్చిన తరువాత కొబ్బరి తురుము, జీడిపప్పు పలుకులు వేసి కలపాలి • ఇప్పుడు వేయించి పెట్టుకున్న శనగ పిండి వేసి కలపాలి • చివరిగా యాలకులను దంచి వేయాలి • ఈ మిశ్రమంలో మిగిలిన నెయ్యిని టేబుల్ స్పూను చొప్పున వేస్తూ కలుపుతూ ఉండాలి • నెయ్యి మొత్తం వేసిన తరువాత చక్కగా కలిపి, మిశ్రమం గట్టిపడకముందే దించేయాలి • ఇప్పుడు నెయ్యి రాసి పెట్టుకున్న ప్లేటులో ఈ మిశ్రమాన్ని వేసి ఆరనివ్వాలి • పదినిమిషాల తరువాత ముక్కలుగా కట్ చేస్తే కొబ్బరి జీడిపప్పు మైసూర్ పాక్ రెడీ.

క్యారట్.. డేట్స్ పాక్

కావలసినవి: క్యారట్ తురుము – పావు కప్పు ; విత్తనాలు తీసేసిన డేట్స్ – పావు కప్పు; బెల్లం – పావు కప్పు; శనగపిండి – అరకప్పు; బ్రౌన్‌సుగర్ – కప్పు; నెయ్యి – అరకప్పు; నూనె – పావు కప్పు.

తయారీ: శనగపిండిని జల్లెడ పట్టుకుని పక్కన పెట్టుకోవాలి • టేబుల్ స్పూను నెయ్యి వేసి పచ్చివాసన పోయేంత వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి • మందపాటి బాణలిలో మిగిలిన నెయ్యి, నూనె వేసి ఐదు నిమిషాలు వేడి చేసి పక్కనపెట్టుకోవాలి • బెల్లంలో పావు కప్పు నీళ్లుపోసి మరిగించాలి. బెల్లం కరిగిన తరువాత వడగట్టి పక్కన పెట్టాలి • క్యారట్ , డేట్స్, బెల్లం నీళ్లుపోసి మెత్తగా గ్రైండ్ చేయాలి • గ్రైండ్ చేసి ప్యూరీని ముక్కలు లేకుండా వడగట్టి తీసుకోవాలి • బాణలిలో బ్రౌన్ సుగర్, అరకప్పు నీళ్లు పోసి మరిగించాలి • సుగర్ కరిగిన తరువాత క్యారట్ డేట్స్ ప్యూరిని వేసి సన్నని మంట మీద తిప్పుతూ ఉండాలి • తీగ పాకం వచ్చాక శనగ పిండి వేసి ఉండలు లేకుండా కలపాలి • ఇప్పుడు కాచి పెట్టుకున్న నెయ్యి /నూనెను కొద్దికొద్దిగా వేస్తూ కలపాలి • నెయ్యి మొత్తాన్ని మిశ్రమం పీల్చుకుని దగ్గరపడిన తరువాత దించి నెయ్యిరాసిన ప్లేటులో పోసుకోవాలి • మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడు ముక్కలు కట్ చేసుకుంటే క్యారట్, డేట్స్ పాక్ రెడీ.



చాక్లెట్ పాక్

కావలసినవి: శనగపిండి – ముప్పావు కప్పు ; కోకో పొడి – పావు కప్పు; బెల్లం – కప్పు; నీళ్లు – ముప్పావు కప్పు ; నెయ్యి – ముప్పావు కప్పు; పిస్తా పలుకులు – టేబుల్ స్పూను.

తయారీ: శనగపిండి పచ్చివాసన పోయి, మంచి సువాసన వచ్చేంత వరకు వేయించాలి • మందపాటి గిన్నెలో బెల్లం, నీళ్లు వేసి తీగ పాకం వచ్చేంత వరకు మరిగించాలి • శనగపిండి వేగాక కోకో పొడి, నెయ్యి వేసి ఉండలు లేకుండా కలపాలి • పిండి మిశ్రమం వేగాక బెల్లం పాకం పోసి ఉండలు కట్టకుండా తిప్పుతూనే ఉండాలి • ఐదారు నిమిషాలు తిప్పాక పిస్తా పలుకులు వేసి ఐదు నిమిషాలు మగ్గనిచ్చి దించేయాలి • వెన్న రాసిన ప్లేటులో ఈ వేడివేడి పాకం మిశ్రమాన్ని వేయాలి • ఐదు నిమిషాలు ఆరాక నచ్చిన ఆకారంలో ముక్కలు కట్ చేసుకుంటే చాక్లెట్ పాక్ రెడీ.



నోట్: మైసూర్ పాక్ చక్కగా రావాలంటే పిండి మిశ్రమం వేసిన తరువాత చక్కగా కలపాలి • చక్కెర, లేదా బెల్లం సిరప్‌గా మారిన వెంటనే వడగట్టాలి. తరువాత పాకం పట్టుకుంటే.. ఇసుక, మలినాలు లేకుండా మైసూర్ పాక్ రుచి కరంగా వస్తుంది.

బనానా పాక్

కావలసినవి: శనగపిండి – కప్పు; నెయ్యి – కప్పు; ఎర్ర అరటి పండ్లు – రెండు; చక్కెర – కప్పు.

తయారీ: శనగపిండిని పచ్చివాసన పోయేంత వరకు వేయించాలి • అరటిపండ్లు తొక్కతీసి ప్యూరీలా గ్రైండ్ చేయాలి • వేగిన పిండిలో కొద్దిగా నెయ్యి వేసి పేస్టులా కలిపి దించేయాలి • చక్కెరలో కప్పు నీళ్లుపోసి మరిగించాలి • తీగపాకం వచ్చిన తరువాత శనగపిండి పేస్టు, అరటిపండు ప్యూరిని వేసి బాగా కలపాలి • మిశ్రమం చిక్కగా దగ్గరపడినప్పుడు దించేసి, నెయ్యిరాసిన ప్లేటులో వేసి ముక్కలుగా కట్ చేస్తే బనానా పాక్ రెడీ.



యువర్స్

● టెక్.. టాక్

ఒప్పో రెనో 10 ప్రో



డిస్‌ప్లే	: 6.70 అంగుళాలు
బరువు	: 185 గ్రా. ● ఫింగర్‌ప్రింట్ రీడర్
రిజల్యూషన్	: 1080×2412 పిక్సెల్స్
మెమోరీ	: 256జీబి 12జీబి ర్యామ్
వోఎస్	: ఆండ్రాయిడ్ 13
బాడీ	: గ్లాస్ ఫ్రంట్, ప్లాస్టిక్ ఫ్రేమ్, గ్లాస్ బ్యాక్
ఫ్రంట్ కెమెరా	: 32 ఎంపీ
బ్యాటరీ	: 4600 ఎంఏహెచ్
కనెక్టివిటీ	: 5జీ

హువావే వాచ్ 4 ప్రో



డిస్‌ప్లే	: 1.5 అంగుళాలు కలర్ స్క్రీన్
డైమెన్షన్స్	: 47.6 ఎంఎం × 47.6 ఎంఎం × 12.9 ఎంఎం
రిస్ట్ సైజ్	: 140–210 ఎంఎం బరువు: 65గ్రా.
రిజల్యూషన్	: 466×466 పిక్సెల్స్
మెటీరియల్	: ఏరోస్పేస్-గ్రేడ్ టైటానియం
వాచ్ స్ట్రాప్	: బ్లూ కంపోజిట్ స్ట్రాప్, టైటానియమ్ స్ట్రాప్, డార్క్ బ్రౌన్ లెదర్ స్ట్రాప్

లెనోవా యోగా 9ఐ



సైజ్	: 14.00 అంగుళాలు
బరువు	: 1.4 కేజీ
రిజల్యూషన్	: 1920×1080 పిక్సెల్స్
ర్యామ్	: 8జీబి
వోఎస్	: విండోస్ 10
కలర్	: షాడో బ్లాక్ కనెక్టివిటీ: 5.1
కెమెరా	: 1ఎం వెబ్‌కామ్
బ్యాటరీ లైఫ్	: 18 గం.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఏ వోల్ట్-ఫేస్

ఒక విషయంలో ఆకస్మికంగా అభిప్రాయం, నిర్ణయం, కార్యాచరణ మార్చుకునే సందర్భంలో ఉపయోగించే మాట ఏ వోల్ట్-ఫేస్. ఫ్రెంచ్ భాష నుంచి వచ్చిన ఎక్స్‌ప్రెషన్ ఇది. ఉదా: ఎవ్రీ వన్ వాజ్ సర్‌ప్రైజ్‌డ్ వెన్ ది క్యాండెట్ మేడ్ ఏ కంప్లీట్ వోల్ట్ ఫేస్ ఆన్ హర్ స్టెన్స్ ఆన్ ట్యాక్సెస్.

గోయింగ్ గ్రేట్ గన్స్

ఒక పనిలో లేదా ఆట, వ్యాపారం, ఉద్యోగం... మొదలైన వాటిలో ఒక వ్యక్తి ఉత్సాహంగా, విజయవంతంగా దూసుకువెళ్లే సందర్భంలో ఉపయోగించే మాట...గోయింగ్ గ్రేట్ గన్స్. ఉదా: ఫర్ ది ఫస్ట్ 400 మీటర్స్ హీ వాజ్ గోయింగ్ గ్రేట్ గన్స్. బట్ దెన్ హీ ఫెల్ అండ్ దట్ లాస్ట్ హిమ్ ది రేస్.

truecaller

ట్రూ కాలర్‌లో కొత్త ఫీచర్

పాపులర్ కాలర్ ఐడీ అండ్ స్పామ్‌బ్లాకింగ్ యాప్ 'ట్రూ కాలర్' ఏఐ ఆధారిత కాల్ స్క్రీనింగ్ ఫీచర్‌ని ఇండియాలో ప్రవేశపెట్టింది. ఏఐ అసిస్టెంట్ ఆన్సర్‌లకు, ఇన్‌కమింగ్ కాల్స్ ట్రాన్స్‌స్క్రైబ్ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ట్రూ కాలర్ అసిస్టెంట్ స్పీచ్-టు-టెక్స్ట్ టెక్నాలజీ, నేచురల్ లాంగ్వేజీ ప్రాసెసింగ్‌లను ఉపయోగించుకొని కాలర్స్‌తో ఇంటరాక్ట్ అవుతుంది.

మినీ డైనమెట్



● మ్యూజిక్ వరల్డ్

ప్యాషన్‌నే ప్రొఫెషన్‌గా మలుచుకుంటే అంతకు మించిన ఘన విజయం ఏముంటుంది? చిన్నప్పుడు సరదాగా కవిత్వం రాసిన, మన పాటలను ర్యాప్‌లోకి మార్చి సరదాగా పాడిన కలైవాణి నాగరాజ్ అలియాస్ లేడి కాష్ తొలి తమిళ్-ఇంగ్లిష్ ఫిమేల్ ర్యాపర్‌గా తనదైన గుర్తింపు సాధించింది.

ఏఆర్ రెహమాన్ ఆమెకు పెట్టిన పేరు మినీ డైనమెట్.

కష్ తండ్రి ప్రొఫెషనల్ డ్యాన్సర్. తల్లికి చిత్రకళ ఆసక్తికరమైన సబ్జెక్ట్. ఇంతకు మించి కష్‌కు కళానేపథ్యం లేదు. ఇక సంగీతం తెలిసిన వారు ఎవరూ లేరు. కథలు చెప్పడం, కవిత్వం పోటీలలో చురుగ్గా పాల్గొనేది. రేడియోలో పాటలు వినడం ద్వారా, మ్యూజిక్ చానల్స్ చూడడం ద్వారా సంగీతంపై ఆసక్తి మొదలైంది.

'మ్యూజికే నా కెరీర్' అని కాష్ అన్నప్పుడు తల్లిదండ్రులు అభ్యంతర పెట్టకపోగా చాలా ప్రోత్సహించారు.

తాను విన్న పాటలను ర్యాప్ సాంగ్ స్టైల్లో పాడడం కాష్‌కు ఒక సరదా. కవిత్వం రాయడం మరో సరదా. అయితే ఈ సరదాలేవి వృథా పోలేదు. తన కెరీర్‌కు గట్టి పునాదిరాళ్లుగా ఉపయోగపడ్డాయి.

భాషపై పట్టు కోసం లైబ్రరీ నుంచి ఇంగ్లిష్, తమిళ భాషల్లోని పుస్తకాలను తెచ్చుకొని చదివేది. ర్యాప్‌లో తనదైన టాలెంట్ చూపుతున్న కాష్‌కు 'రోబో' సినిమా సౌండ్‌ట్రాక్ కోసం ఏఆర్‌రెహమాన్‌తో పనిచేసే అవకాశం వచ్చింది. ఇది తనకు మెయిన్ స్ట్రీమ్ మ్యూజిక్ ఇండస్ట్రీలోకి లాంచ్‌ప్యాడ్‌గా ఉపయోగపడింది.

'ఆ సౌండ్‌ట్రాక్ అనేది నా కెరీర్‌లో మైలుస్టోన్ మాత్రమే కాదు ఇండియన్ మ్యూజిక్ ఇండస్ట్రీలో ల్యాండ్‌మార్క్‌గా నిలిచింది. యూఎస్, యూకే ఐట్యూన్ చార్ట్స్‌లో టాప్‌లో నిలిచింది. గతంలో ఏ ఆల్బమ్ ఇలాంటి ఘనతను సాధించలేదు. ఇదొక అద్భుతమైన, ఆనందకరమైన అనుభవం. మ్యూజిక్‌లో ఉండే పవర్ ఏమిటో తెలిసొచ్చింది. సంగీతం బాగుంటే సరిహద్దులు చెరిగిపోతాయి. అన్ని దేశాలు ఆ సంగీతాన్ని స్వంతం చేసుకుంటాయి' అంటుంది లేడీ కాష్.

● స్ఫూర్తి

'సక్సెస్ కావాలంటే అజ్ఞానం కూడా ఉండాలి' అంటాడు 'ఫిజిక్స్‌వాలా' ఫేమ్ **అలక్ పాండే.** అతడి మాటల తాత్పర్యం 'నాకు అన్నీ తెలుసు అనుకున్నప్పుడు ఏమీ తెలుసుకోలేము. ఏమీ తెలియదు అనుకున్నప్పుడే అన్నీ తెలుసుకోవాలనే ఆసక్తి మొదలవుతుంది. అదే విజయానికి దారి చూపుతుంది'

ప్రయాగ్‌రాజ్‌లో ట్యూషన్‌లు చెప్పి కుటుంబానికి వేడి నీళ్లకు చన్నీళ్లలా సహకరించిన అలక్ పాండే ఈరోజు స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్. అతడి ఎడ్‌టెక్ స్టార్టప్ 'ఫిజిక్స్‌వాలా' శాఖోపశాఖలుగా విస్తరించి యూనికార్న్ క్లబ్‌లో చేరింది...

సక్సెస్‌వాలా స్ట్రాంగ్‌స్టోరీ



● అలక్ పాండే

పాఠాలను పాఠాలుగా మాత్రమే బోధించాలని లేదు. వాటిని నిజజీవితంలోకి తీసుకువచ్చి, హాస్యం జోడించి చెబితే పాఠం అద్భుతంగా అర్థమవుతుంది. వినే కొద్దీ వినాలనిపిస్తుంది. 'ఫిక్షనుకు ఫ్రిక్షన్‌కు తేడా ఏమిటి?' నుంచి జటిలమైన భౌతికసూత్రాలను సులభంగా చెప్పడం వరకు అలక్ పాండే అద్భుతమైన నేర్పును సాధించాడు.

ఈ ఫస్ట్-జెనరేషన్ ఎంటర్‌ప్రెన్యూర్ కొన్ని సంవత్సరాల క్రితం 'ఫిజిక్స్‌వాలా' పేరుతో ఫ్రీ యూట్యూబ్ చానల్‌కు శ్రీకారం చుట్టాడు. 'పెద్ద సక్సెస్ సాధించబోతున్నాను' అని ఆ సమయంలో అతను అనుకొని ఉండడు. అతడు అనుకున్నా, అనుకోకపోయినా 'ఇస్రో'వారి రాకెట్‌లా ఫిజిక్స్‌వాలా దూసుకుపోయింది.

31 మిలియన్‌ల సబ్‌స్క్రైబర్‌లు, 61 యూట్యూబ్ చానల్స్, 5.3 బిలియన్ వ్యూస్!

'పోటీలో చాలామంది ఉన్నప్పుడు పోటీ నుంచి తప్పుకోవడమే మేలు' అనుకునే రకం కాదు అలక్.

'పోటీలో చాలా మంది ఉన్నప్పుడు మనదైన స్టైల్‌ను బయటికి తీయాలి' అని బలంగా నమ్ముతాడు. నిరంతరం ఆర్థిక ఇబ్బందులు పడే కుటుంబం నుంచి వచ్చిన అలక్ 'మాకు ప్రతి రూపాయి వందరూపాయలతో సమానంగా ఉండేది' అని గతాన్ని గుర్తు చేసుకుంటాడు.

అలక్ ఎడ్‌టెక్ ప్రపంచంలోకి అడుగు పెట్టినప్పుడు తనకు తాను వేసుకున్న ప్రశ్న 'స్టూడెంట్స్ ఏం నేర్చుకోవాలనుకుంటున్నారు?'

ఈ ప్రశ్నకు ఊహల్లో నుంచి సమాధానం తీసుకోకుండా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడాడు. వారు చెప్పిన ప్రతీదాన్ని నోట్ చేసుకొని లైవ్ ఆన్‌లైన్ కాసులలో అప్లై చేశాడు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కోచింగ్ సెంటర్‌ల ద్వారా బాగా డబ్బు గడించిన అలక్ పాండేకు 'ఫిజిక్స్‌వాలా' చానల్ ద్వారా వచ్చిన యాడ్ మనీ ఎనిమిది వేలు చాలా తక్కువ. అయితే ఇది 'శుభారంభం' అని మాత్రమే అనుకున్నాడు అలక్. అతడి నమ్మకం వృథా పోలేదు యాడ్ మనీ ఊహించని స్థాయిలో పెరుగుతూ పోయింది. కొన్నిసార్లు విద్యార్థులే ఉపాధ్యాయులై చక్కని సలహాలు ఇస్తారు.

కొత్తలో అలక్ ప్రచారంపై ఎక్కువ దృష్టి పెట్టాడు. ఎంత ఎక్కువగా పబ్లిసిటీ చేస్తే అంతగా సక్సెస్ అవుతాం అనుకునేవాడు. ఆ సమయంలో కొందరు విద్యార్థులు...

'యాడ్స్ మీద కాదు టీచింగ్ మీద దృష్టి పెట్టండి' అని చెప్పారు. ఇక అప్పటి నుంచి యాడ్స్‌పై కాకుండా టీచింగ్‌పైనే ఎక్కువగా దృష్టి పెట్టాడు. 'ఫిజిక్స్‌వాలా క్లాస్‌లలో చక్కగా అర్థమవుతుంది' అనే మౌత్‌టాక్ వచ్చేలా కృషి చేశాడు.

చాలామంది విజేతలలాగే అలక్ పాండేకు ఎదురయ్యే ప్రశ్న....

'మీ విజయ రహస్యం ఏమిటి?'

అది చెప్పడానికి అలక్ నోరు విప్పనక్కర్లేదు. నోయిడాలోని బహుళ అంతస్తుల భవనంలోని అతని ఆఫీసు గోడపై అతికించిన పోస్టర్‌లు చూస్తే చాలు. మచ్చుకు రెండు...

'సక్సెస్ సాధించాలని బలంగా అనుకుంటే ప్లాన్ బీ గురించిన ఆలోచనే రాదు'

'వేగంగా పరాజయం పాలైనా సరే, నిదానంగా గట్టి విజయం సాధించాలి'

● గేమింగ్

శత్రువును చిత్తు చేసే చిరుతలు



రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ 'బల్దూర్స్ గేట్-3' ఆగస్ట్ 3న విడుదల అవుతుంది. 'డంజెన్స్ అండ్ డ్రాగన్స్5' ఎడిషన్ రూల్‌సెట్ ఆధారంగా రూపొందిన గేమ్ ఇది. ఈ రోల్ ప్లేయింగ్ వీడియో గేమ్‌ను సింగిల్ ప్లేయర్, కోఆపరేటివ్ మల్టీప్లేయర్‌లలో ఆడవచ్చు. ప్లేయర్స్ క్యారెక్టర్స్‌ను క్రియేట్ చేయవచ్చు. బల్దూర్స్ గేట్ సిరీస్‌లోని గత గేమ్‌ల మాదిరిగా కాకుండా బల్దూర్స్ గేట్3 టర్న్-బేస్డ్ కంబాట్ గేమ్. మనిషిలో ఉండే రకరకాల భావోద్వేగాలు ఈ గేమ్‌లో కీలక పాత్ర పోషిస్తాయి. జానర్స్: రోల్-ప్లేయింగ్, మోడ్స్: సింగిల్-ప్లేయర్ మల్టీ ప్లేయర్ ప్లాట్‌ఫామ్స్: మ్యాక్‌వోఎస్/విండోస్/ప్లేస్టేషన్5/ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

సినిమా

నా ఎనక దునియా ఉంది



● చిరంజీవి

చిరంజీవి టైటిల్ రోల్‌లో మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్‌గా నటించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం 'భోళా శంకర్' ట్రైలర్‌ని హీరో రామ్‌చరణ్ రిలీజ్ చేశారు. 'హౌరా బ్రిడ్జి దగ్గర ఇంకో అమ్మాయి మిస్సింగ్ అంట సార్', 'పబ్లిక్‌కి ప్రాబ్లమ్ వస్తే పోలీసుల దగ్గరికి పోతారు.. గదే పోలీసులకు ప్రాబ్లమ్ వస్తే భోళా భాయ్ దగ్గరికి వస్తారు', 'నీ ఎనక మాఫియా ఉంటే నా ఎనక దునియా ఉంది బే' (చిరంజీవి)... వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. రామబ్రహ్మం సుంకర మాట్లాడుతూ– ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'భోళా శంకర్' రూపొందింది. మాస్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ని కూడా ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు మెహర్ రమేష్. డడ్లీ సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంటుంది. చక్కని సంగీతంతో సినిమాని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లాడు మహతి స్వరసాగర్'' అన్నారు. కీర్తి సురేష్, సుశాంత్ కీలక పాత్రలు చేసిన ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, లైన్ ప్రొడక్షన్: మెహర్ మూవీస్.

సంకల్పం గట్టిదైతే సాధించవచ్చు

– విశ్వక్ సేన్



● అనూష, రాకేష్ వర్రే, విశ్వక్ సేన్

''పేక మేడలు' పోస్టర్స్, టీజర్ బాగున్నాయి. రాకేష్ నటిస్తూనే నిర్మాతగా మారడం హ్యాపీగా ఉంది. మన సంకల్పం గట్టిదైతే ఏదైనా సాధించవచ్చు. 'పేక మేడలు' మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నా'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పేక మేడలు'. రాకేష్ వర్రే నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ–''వినోద్ కిషన్ కళ్లతో నటిస్తాడు. నేను చేస్తున్న ఓ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇక నాలాంటి వాళ్లు చిన్న హీరో అయినా చేస్తున్న పనిలో బిజీతో కొన్ని సందర్భాల్లో ఎవరికీ టైమ్ ఇవ్వలేం.. కథలు వినలేం. ఇటీవల విడుదలైన ఓ హిట్ చిత్రం నేను చేయాల్సింది.. కానీ కుదరలేదు. మన సినిమా బాగుంటే తల ఎత్తుకునేలా ఉండాలి.. కానీ, ఎవరినో కించపరచకూడదు'' అన్నారు. ''హైదరాబాద్‌లో ఓ బస్తీలో సాగే కథ ఇది'' అన్నారు రాకేశ్ వర్రే. ''ప్రతి ఒక్కరికీ జీవితంలో ఎదురయ్యే కథే 'పేక మేడలు'' అన్నారు నీలగిరి మామిళ్ల. ఈ చిత్రానికి సహనిర్మాత: వరుణ్ బోర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కేతన్ కుమార్, లైన్ ప్రొడ్యూసర్: అనూష బోర, కెమెరా: హరిచరణ్ .కె, సంగీతం: స్మరణ్.

ఆస్కార్ మ్యూజియమ్‌లో...



● కమల్‌హాసన్, ఏఆర్ రెహమాన్

లాస్ ఏంజిల్స్‌లోని ఆస్కార్ మ్యూజియమ్‌ని సందర్శించారు నటుడు–దర్శక–నిర్మాత కమల్ హాసన్, సంగీత దర్శకుడు–గాయకుడు–నిర్మాత ఏఆర్ రెహమాన్. ఆ మ్యూజియమ్‌లోనే హాలీవుడ్ ఫేమస్ ఫిల్మ్ 'ది గాడ్‌ఫాదర్' (1972) సినిమాను వీక్షించారు కమల్, రెహమాన్. 81వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'స్లమ్‌డాగ్ మిలియనీర్' (2008) సినిమాకుగాను బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగాల్లో ఏఆర్ రెహమాన్ ఆస్కార్ అవార్డ్స్‌ను సాధించిన సంగతి గుర్తుండే ఉంటుంది. నాటి విశేషాలను కూడా కమల్‌తో కలిసి ఈ సందర్భంగా ఏఆర్ రెహమాన్ గుర్తు చేసుకున్నారు. అలాగే కమల్‌తో కలిసి ఆస్కార్ మ్యూజియమ్‌ని సందర్శించిన ఫొటోలను రెహమాన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇదిలా ఉంటే ప్రభాస్ హీరోగా, కమల్‌హాసన్ కీలక పాత్రలో నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' సినిమా గ్లింప్స్ వీడియో లాంచ్ ఇటీవల అమెరికాలో జరిగిన విషయం తెలిసిందే. ఈ వేడుక కోసం అమెరికా వెళ్లిన కమల్‌హాసన్ ఇంకా అక్కడే ఉన్నారు. ఈ క్రమంలోనే తన సినిమాలకు మేకప్ ఆర్టిస్ట్‌గా చేసిన మైఖేల్ వెస్ట్‌మోర్‌ను కలిసిన కమల్‌హాసన్ తాజాగా ఏఆర్ రెహమాన్‌తో కలిసి ఆస్కార్ మ్యూజియమ్‌ని సందర్శించారు. ఇండియాకు తిరిగొచ్చిన తర్వాత మణిరత్నం దర్శకత్వంలో తాను హీరోగా నటించాల్సిన సినిమా షూటింగ్‌లో కమల్ పాల్గొంటారని తెలుస్తోంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతదర్శకుడు.



● మృణాల్ ఠాకూర్

రవితేజకు జోడీగా...

'సీతారామం'తో బ్లాక్‌బస్టర్ హీరోయిన్‌గా ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ జోరు కొనసాగుతోంది. ఇప్పటికే నాని హీరోగా నటిస్తున్న 'హాయ్ నాన్న', విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాల్లో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఈ బ్యూటీకి మరో ఆఫర్ వచ్చిందట. 'డాన్ శీను', 'బలుపు', 'క్రాక్' చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుంది. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ముందు పూజా హెగ్డే పేరు వినిపించగా, తాజాగా మృణాళ్ ఠాకూర్ పేరు తెరపైకి వచ్చింది. మరి.. రవితేజ సరసన హీరోయిన్‌గా పూజా హెగ్డే కనిపిస్తారా? లేక రవితేజతో మృణాల్ జోడీ కడతారా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు.



● విజయేందర్ రెడ్డి, మీనాక్షి, వరుణ్ తేజ్, సీవీ మోహన్, కరుణ కుమార్

నాలుగు గెటప్స్‌లో వరుణ్ జూదం

వరుణ్ తేజ్, మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహి హీరోహీరోయిన్లుగా కరుణ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'మట్కా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. తొలి సీన్‌కి దర్శకుడు మారుతి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత 'దిల్' రాజు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాతలు సురేష్‌బాబు, విజయేందర్ రెడ్డి, సీవీఎం కలిసి దర్శకుడు కరుణ కుమార్‌కు స్క్రిప్ట్ అందించగా, దర్శకుడు హరీష్ శంకర్ టైటిల్ పోస్టర్ లాంచ్ చేశారు. ''వరుణ్‌కు 'మట్కా' తొలి పాన్ ఇండియన్ మూవీ. 'మట్కా' అంటే ఒక రకమైన జూదం. 1958–1982 మధ్య కాలంలో దేశాన్ని కదిలించిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా వైజాగ్ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. వరుణ్ తేజ్ నాలుగు గెటప్స్‌లో కనిపిస్తారు. నాటి వైజాగ్‌ను తలపించేలా ప్రొడక్షన్ డిజైనర్ ఆశిష్ తేజ, ఆర్ట్ డైరెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో వింటేజ్ సెట్ వర్క్ జరుగుతోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కెమెరా: ప్రియా సేత్.

రీల్స్

సరికొత్తగా...




● ధనుష్, శేఖర్ కమ్ముల

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా 'డీ 51' (వర్కింగ్ టైటిల్) తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీర్వాదంతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించనున్నారు. కాగా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ నారాయణ్ దాస్ కె. నారంగ్ జయంతి సందర్భంగా గురువారం 'డీ 51' చిత్రం అప్‌డేట్ ఇచ్చారు. ''డీ 51'లో ఇంతకు ముందెన్నడూ చూడని సరికొత్త పాత్రలో ధనుష్‌ని చూపించే పర్ఫెక్ట్ కథను శేఖర్ కమ్ముల సిద్ధం చేశారు'' అన్నారు నిర్మాతలు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపొందనున్న ఈ సినిమాకి సమర్పణ: సోనాలీ నారంగ్.

అదే నా ఆస్తి

– బ్రహ్మాజీ



''మా అబ్బాయి సంజయ్ నటించిన 'స్లమ్ డాగ్ హజ్బెండ్' ప్రమోషన్‌కి నాగార్జున, అలీ, అనిల్ రావిపూడి.. ఇలా అందరూ సపోర్ట్ చేశారు. ఇలా అందరి ప్రేమను సంపాదించడమే నా ఆస్తిగా భావిస్తున్నా'' అని నటుడు బ్రహ్మాజీ అన్నారు. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ రేపు రిలీజ్ చేస్తోంది. ''ఈ చిత్రంలో విడాకుల స్పెషలిస్ట్ లాయర్‌గా కనిపిస్తాను'' అన్నారు బ్రహ్మాజీ.

యాక్షన్ థ్రిల్లర్ ఆరంభం



● సందీప్ మాధవ్, కేథరిన్

సందీప్ మాధవ్, కేథరిన్ థెరిస్సా జంటగా నూతన చిత్రం షురూ అయింది. సోమా విజయప్రకాష్ సమర్పణలో దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మిస్తున్నారు. అశోక్ తేజ దర్శకుడు. తొలి సీన్‌కి నిర్మాత సి. కల్యాణ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు సంపత్ నంది క్లాప్ ఇచ్చారు. నిర్మాతలు ప్రసన్నకుమార్, పి. కిరణ్ గౌరవ దర్శకత్వం వహించారు. ''పోలీస్ పాత్రలో నటించాలన్న నా ఆశ ఈ సినిమాతో నేరవేరింది'' అన్నారు సందీప్ మాధవ్. ''స్క్రీన్ ప్లే బేస్డ్ సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇది'' అన్నారు అశోక్ తేజ. ''సినిమా పూర్తయ్యేవరకూ కంటిన్యూ షెడ్యూల్ జరుపుతాం'' అన్నారు పల్లి కేశవరావు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సహనిర్మాతలు: రొంగల శివశంకర్, గౌటి హరినాథ్.

ఎమోషనల్ వృషభ



● జీవన్, అలేఖ్య

జీవన్, అలేఖ్య జంటగా నటిస్తున్న చిత్రం 'వృషభ'. అశ్విన్ కామరాజ్ కొప్పల దర్శకత్వంలో యుజిటిస్ ఎంటర్‌టెన్మెంట్స్ సమర్పణలో ఉమాశంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ''ఈ చిత్రంలో మంచి ఎమోషన్ ఉన్నట్లనిపిస్తోంది'' అని ఫస్ట్ లుక్, ట్రైలర్ లాంచ్ వేడుకలో పాల్గొన్న నిర్మాత సి. కల్యాణ్ అన్నారు. ''1966–1990 నేపథ్యంలో జరిగే కథ ఇది. ఆధ్యాత్మికంగా వెళుతూనే మనుషులకు, పశువులకు మధ్య ఉండే బాండింగ్‌ని చూపించాం'' అన్నారు అశ్విన్. ''ఓ పల్లెలోని చిన్న గుడిలో ఈ కథ నా మదిలో మెదిలింది'' అన్నారు ఉమాశంకర్.

సాక్షి బిజినెస్

శుక్రవారం
28-7-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	440	66,267
నిఫ్టీ ▽	118	19,660

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,195	△	70
డోజోన్స్	35,495	▽	25
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,693	△	16
డాక్స్	16,406	△	275
షాంఘై	3,217	▽	6
నికాయ్	32,891	△	223

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై			
బంగారం (24 క్యారెట్)	59,741	▽	49
బంగారం (22 క్యారెట్)	59,502	▽	49
వెండి (కిలో)	75,426	▽	906

సతియాలో మారికో పెట్టుబడి

డీల్ విలువ రూ.369 కోట్లు

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ కంపెనీ మారికో తాజాగా సతియా న్యూట్రాస్యూటికల్స్‌లో 58 శాతం వాటా కొనుగోలు చేస్తోంది. 32.75 శాతం వాటా జూలై 26 నాటికే చేజిక్కించుకున్నామని, మిగిలిన వాటా 2025 మే నాటికి కైవసం అవుతుందని కంపెనీ తెలిపింది. డీల్ విలువ రూ.369 కోట్లు. మొక్కల ఆధారిత పోషణ ఉత్పత్తుల బ్రాండ్ ప్లిక్స్‌ను సతియా న్యూట్రాస్యూటికల్స్ ప్రమోట్ చేస్తోంది. విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులు, పోషకాహార విభాగాలలో విస్తరణకు ఈ డీల్ దోహదం చేస్తుందని మారికో తెలిపింది. అలాగే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆరోగ్యం, వెల్నెస్ విభాగాలలో ఉనికిని పెంచుతుందని వివరించింది. 'విభిన్న విభాగాల్లో మా ప్రయాణాన్ని వేగవంతం చేసే వ్యూహానికి అనుగుణంగా ప్లిక్స్‌లో పెట్టుబడి విలువ ఆధారిత వెల్నెస్ ఫుడ్స్, న్యూట్రిషన్ సెగ్మెంట్లలో లక్షిత మార్కెట్‌ను విస్తరించడమే కాకుండా.. విభిన్న విలువ ప్రతిపాదనతో మరో డిజిటల్ ఫస్ట్ బ్రాండ్‌ను మా ఖాతాలోకి తీసుకువస్తుంది' అని మారికో ఎండీ, సీఈవో సౌగత గుప్తా ఈ సందర్భంగా తెలిపారు.

భారత్ బయోటెక్‌తో ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ జట్టు



ముంబై: దుస్తుల తయారీ సంస్థ ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ గ్లోబల్ క్లోతింగ్‌లో భారత్ బయోటెక్ గ్రూప్‌నకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ విభాగం 20 శాతం వాటాలు కొనుగోలు చేసింది. ఈ పెట్టుబడుల ద్వారా వచ్చిన నిధులను మూలధనం, వ్యాపార విస్తరణ తదితర అవసరాల కోసం వినియోగించుకోనున్నట్లు ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ చైర్మన్ ఎన్ చంద్రన్ తెలిపారు. ఇప్పటికే తమకు అమెరికాలో కార్యాలయం ఉందని, బ్రిటన్‌లోనూ త్వరలోనే ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. ఇతరత్రా మార్కెట్లలోనూ ప్రవేశించే ప్రయత్నాల్లో ఉన్నట్లు చెప్పారు. మేకిన్ ఇండియా వ్యూహానికి అనుగుణంగా వివిధ పరిశ్రమలకు తోడ్పాటు అందించే లక్ష్యంతో ముందుకెడుతున్నట్లు భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా తెలిపారు. 10 వేల మంది పైచిలుకు మహిళలకు ఉపాధి అవకాశాలు అందించాలనే తమ లక్ష్య సాధనకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడగలదని పేర్కొన్నారు.

చైనాకు 30 ఏళ్లు పట్టింది .. మనకు పదేళ్లే

- సెమీకండక్టర్లలో కీలకంగా ఎదుగుతాం
- కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ధీమా



న్యూఢిల్లీ: వచ్చే దశాబ్ద వ్యవధిలో అంతర్జాతీయ సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థలో కీలకంగా ఎదిగే దిశగా భారత్ ముందుకు పురోగమిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆ స్థాయికి చేరుకునేందుకు చైనాకు 25–30 సంవత్సరాలు పట్టిందని ఆయన పేర్కొన్నారు. మొబైల్ ఫోన్స్ నుంచి కార్ల వరకూ అన్నింటా ఉపయోగించే చిప్‌ల తయారీని దేశీయంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన 10 బిలియన్ డాలర్ల ప్రోత్సాహకాలు భారత్ పురోగమనానికి దోహదపడగలవని ఆయన పేర్కొన్నారు. 'ఈ 10 బిలియన్ డాలర్ల తోడ్పాటుతో వచ్చే 10 ఏళ్లలో సెమీకండక్టర్ల విభాగంలో కీలకంగా ఎదిగే దిశగా భారత్ ముందుకు వెడుతోంది. దీనికోసం చైనా వంటి దేశాలకు 25–30 ఏళ్లు పట్టేసింది. అయినా అవి ఇంకా పూర్తిగా సఫలం కాలేదు 'అని మంత్రి చెప్పారు. మెమరీ సొల్యూషన్స్ దిగ్గజం మైక్రాన్ తలపెట్టిన ఏటీఎంపీ ప్రాజెక్టుతో సెమీకండక్టర్ల పరిశ్రమలో ప్రత్యక్షంగా 5,000, పరోక్షంగా 15,000 ఉద్యోగాల కల్పన జరుగుతుందని చెప్పారు. ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) స్కీముతో .. వేదాంత, ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజాలు ఇక్కడ చిప్స్ ప్లాంటు ఏర్పాటుకు ముందుకొచ్చాయని పేర్కొన్నారు.

ఎన్‌ఎస్‌ఈ లాభం రూ. 1,844 కోట్లు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 1,844 కోట్ల నికర లాభం ప్రకటించింది. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే లాభం 9 శాతం పెరిగింది. అటు ఆదాయం 13 శాతం పెరిగి రూ. 2,987 కోట్లకు చేరింది. ట్రేడింగ్ సంబంధ కార్యకలాపాలతో పాటు లిస్టింగ్, ఇండెక్స్ సర్వీసులు, డేటా సర్వీసులు మొదలైన వాటి ద్వారా ఆదాయం మెరుగుపడిందని సంస్థ తెలిపింది. వచ్చే కొన్నేళ్లలో కోర్ సెటిల్మెంట్ గ్యారంటీ కార్పస్‌ను ప్రస్తుత రూ. 5,000 కోట్ల నుంచి రూ. 10,000 కోట్లకు దశలవారీగా పెంచుకునే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది.



బజాజ్ ఫిన్‌సర్వ్ లాభం జూమ్

క్యూ1లో రూ. 1,943 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. క్యూ1(ఏప్రిల్–జూన్)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 48 శాతం ఎగసి రూ. 1,943 కోట్లను తాకింది. మార్జిన్లు, ఆస్తులు(రుణాలు) మెరుగుపడటం ఇందుకు సహకరించింది. డైవర్సిఫైడ్ దిగ్గజం బజాజ్ గ్రూప్‌నకు చెందిన ఫైనాన్షియల్ సర్వీసుల బిజినెస్‌లకు హోల్డింగ్ కంపెనీ ఇది. గ్రూప్‌లోని మరో దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ లాభాలు పుంజుకోవడం కంపెనీకి బలాన్నిచ్చింది. సాధారణ బీమా విభాగం బజాజ్ అలయెంజ్ నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 415 కోట్లుగా నమోదైనట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ పేర్కొంది. బజాజ్ అలయెంజ్ లైఫ్ రూ. 4,058 కోట్ల స్థూల రిటెన్ ప్రీమియం అందుకోగా.. పన్ను తదుపరి లాభం 25 శాతం వృద్ధితో రూ. 155 కోట్లకు చేరింది. కాగా.. క్యూ1లో బజాజ్ ఫిన్‌సర్వ్ మొత్తం ఆదాయం 47 శాతం జంప్‌చేసి రూ. 23,280 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫిన్ షేరు 1 శాతం నీరసించి రూ. 1,612 వద్ద ముగిసింది.

ఇండియన్ బ్యాంక్ లాభం అప్

క్యూ1లో రూ. 1,709 కోట్లు

ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. క్యూ1(ఏప్రిల్–జూన్)లో నికర లాభం 41 శాతం ఎగసి రూ. 1,709 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,213 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇందుకు ప్రధానంగా మొండి రుణాలు తగ్గడం దోహదపడింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,758 కోట్ల నుంచి రూ. 14,759 కోట్లకు జంప్‌చేసింది. వడ్డీ ఆదాయం రూ. 10,153 కోట్ల నుంచి రూ. 13,049 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 8.13 నుంచి 5.47 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.12 శాతం నుంచి 0.7 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 15.78 శాతానికి చేరింది. మొండిరుణాలకు కేటాయింపులు రూ. 2,002 కోట్ల నుంచి రూ. 930 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఇండియన్ బ్యాంక్ షేరు యథాతథంగా రూ. 328 వద్ద ముగిసింది.

లాభాలు ఒకరోజుకే పరిమితం

- ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల ముగింపు సందర్భంగా అప్రమత్తత
- బ్యాంకింగ్, ఇంధన, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ
- మళ్లీ 19,700 దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ నష్టం 440 పాయింట్లు



ముంబై: దేశీయ స్టాక్ సూచీల లాభాలు ఒకరోజుకే పరిమితమయ్యాయి. జూలై ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల ముగింపు సందర్భంగా ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడంతో బ్యాంకింగ్, ఇంధన, ఆటో షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు., అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎంఅండ్ఎం, నెస్లే, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల పతనం సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఉదయం సెన్సెక్స్ 127 పాయింట్ల లాభంతో 66,629 వద్ద, నిఫ్టీ 73 పాయింట్లు పెరిగి 19,851 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. దేశీయంగా నెలకొన్న ప్రతికూల సంకేతాలతో సూచీలు రోజంతా బలహీనంగా కదలాడాయి. సెన్సెక్స్ ఒక దశలో 646 పాయింట్లు క్షీణించి 66,326 వద్ద, నిఫ్టీ 174 పాయింట్లు పతనమై 19,604 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఆఖర్లో కొంత కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాల కొంత భర్తీ అయ్యాయి. చివరికి సెన్సెక్స్ 440 పాయింట్లు నష్టపోయి 66,267 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118 పాయింట్లు కోల్పోయి 19,660 వద్ద నిలిచింది. నష్టాల మార్కెట్లో ఫార్మా, రియల్టీ, టెలికాం, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,979 కోట్ల షేర్లు విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,528 కోట్ల షేర్లను కొన్నారు. ఈసీబీ, బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీరేట్ల వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- దేశీయంగా సర్వర్లు తయారు చేసే నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా బంపర్ లిస్టింగ్ సాధించింది. బీఎస్‌ఈ ఇష్యూ ధర (రూ.500)తో పోలిస్తే 82.40% భారీ ప్రీమియంతో రూ.942.50 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 91% ర్యాలీ చేసి రూ. 942.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 82.10% లాభంతో రూ.910.50 వద్ద స్థిరపడింది.
- జూన్ క్వార్టర్‌లో నికర లాభం 21% వృద్ధి సాధించడంతో ఆర్‌ఈసీ లిమిటెడ్ షేరు 7% పెరిగి రూ. 186 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో తొమ్మిదిశాతం ర్యాలీ చేసి రూ.189 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- తొలి త్రైమాసిక ఫలితాలు మెప్పించలేకపోవడంతో టెక్ మహీంద్రా షేరు నాలుగుశాతం నష్టపోయి రూ.1,100 వద్ద ముగిసింది.

నేడు రిటైలర్లకు రైల్ వికాస్ ఓఎఫ్‌ఎస్

రైల్వే రంగ ప్రభుత్వ కంపెనీ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్‌ఎల్) చేపట్టిన ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్)కు తొలి రోజు భారీ డిమాండ్ కనిపించింది. ప్రభుత్వం 6.38 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. సంస్థాగత కొనుగోలుదారుల నుంచి 17.44 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. వెరసి ఆఫర్ 2.73 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. వీటికి సంకేత ధర రూ. 121.17కాగా.. వీటి విలువ రూ. 2,100 కోట్లు. ఆఫర్ నేడు(శుక్రవారం) రిటైల్ ఇన్వెస్టర్లకు ఓపెన్ కానుంది. ఆఫర్‌కు ప్రభుత్వం రూ. 119 ఫ్లోర్ ధరను నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆఫర్‌లో భాగంగా ప్రభుత్వం మొత్తం 11.17 కోట్ల షేర్ల(5.36 శాతం వాటా)ను విక్రయించనుంది. దీనిలో డిమాండునుబట్టి 1.96 శాతం వాటాకు సమానమైన 4.08 కోట్ల షేర్లను విక్రయించే గ్రీన్ షూ ఆప్షన్ కలసి ఉంది. ప్రస్తుతం కంపెనీలో ప్రభుత్వానికి 78.2 శాతం వాటా ఉంది.

ఓఎఫ్‌ఎస్ నేపథ్యంలో ఆర్‌వీఎన్‌ఎల్ షేరు 6 శాతం పతనమై రూ. 126 వద్ద ముగిసింది.

కోరమాండల్ లాభం రూ.494 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.499 కోట్ల నుంచి రూ.494 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవర్ రూ.5,783 కోట్ల నుంచి రూ.5,738 కోట్లకు పడిపోయింది. పోషకాలు, అనుబంధ వ్యాపారం ఆదాయం రూ.5,111 కోట్ల నుంచి రూ.5,192 కోట్లకు ఎగసింది. సస్యరక్షణ ఉత్పత్తుల వ్యాపారం రూ.654 కోట్ల నుంచి రూ.556 కోట్లుగా ఉంది. విభిన్న ఉత్పత్తుల తయారీ కోసం గుజరాత్‌లోని దహేజ్ వద్ద 50 ఎకరాల్లో నిర్మించతలపెట్టిన భారీ ప్లాంటు కోసం సన్నాహక పనులను ప్రారంభించినట్టు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కోరమాండల్ షేరు ధర 1.05 శాతం ఎగసి రూ.1,003 వద్ద స్థిరపడింది.

లారస్ లాభం 90 శాతం డౌన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ లారస్ ల్యాబ్స్ జూన్ త్రైమాసికం ఫలితాల్లో అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నికర లాభం 90 శాతం క్షీణించి రూ.25 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా 63 శాతం తగ్గి రూ.168 కోట్లకు పడిపోయింది. ఎబిటా మార్జిన్ 14.2 శాతంగా ఉంది. టర్నోవర్ 23 శాతం తగ్గి రూ.1,182 కోట్లుగా ఉంది. ఆదాయంలో పరిశోధన, అభివృద్ధికి 4 శాతం, మూలధన వ్యయానికి 17% వెచ్చించినట్టు కంపెనీ తెలిపింది. ఏపీఐ, ఎఫ్‌డీఎఫ్ వ్యాపారం రెండింటిలోనూ తాత్కాలిక డిమాండ్ బలహీనత కారణంగా పనితీరు ప్రభావితమైందని వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో లారస్ షేరు ధర 0.72% లాభపడి రూ.343.80 వద్ద స్థిరపడింది.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో అంకిత జోడీ

వార్సా ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టెన్నిస్ టోర్నీలో అంకిత రైనా (భారత్)-యు యువాన్ (చైనా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పోలాండ్‌లో గురువారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అంకిత-యు యువాన్ ద్వయం 7-6 (7/2), 7-5తో మజా చాల్విన్‌స్కా (పోలాండ్)-జెస్సికా పోంచెట్ (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. గంటా 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత జోడీ తమ సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.

సిరీస్ నుంచి తప్పకున్న సిరాజ్

భారత పేస్ బౌలర్ సిరాజ్‌కు వెస్టిండీస్ వన్డే సిరీస్‌నుంచి విశ్రాంతి లభించింది. కాలి మడమకు స్వల్ప నొప్పి ఉండటంతో ముందు జాగ్రత్తగా బరిలోకి దిగకపోవడం మంచిదని బీసీసీఐ వైద్యులు సూచించారు. దాంతో అతను స్వదేశం పయనమయ్యాడు. వన్డేల తర్వాత జరిగే టి20 సిరీస్‌లో అతడిని ఎంపిక చేయలేదు.

ప్రణయ్, లక్ష్య సేన్ ముందంజ

క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ


ప్రణయ్


లక్ష్య సేన్

టోక్యో: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్లు ప్రణయ్, లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రణయ్ 19-21, 21-19, 21-9తో భారత్‌కే చెందిన కిడాంబి శ్రీకాంత్‌ను ఓడించగా... లక్ష్య సేన్ 21-14, 21-16తో కాంటా సునెయామ (జపాన్)పై గెలుపొందాడు. డబుల్స్ విభాగంలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్ ఫైనల్ చేరుకోగా... పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ ద్వయం ఇంటిదారి పట్టింది. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 21-17, 21-11తో లాసీ మెల్హెడె-జెపీ బే (డెన్మార్క్) జోడీని ఓడించగా... గాయత్రి-ట్రిసా జాలీ జంట 21-23, 19-21తో చిరారు షిదా-నామి మత్సుయామ (జపాన్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో ప్రణయ్; కొకి వతనాబె (జపాన్)తో లక్ష్య సేన్; లీ యాంగ్-వాంగ్ చిలిన్ (చైనీస్ తైపీ)లతో సాత్విక్-చిరాగ్ తలపడతారు.

పాకిస్తాన్ క్లీన్‌స్వీప్

లంకపై రెండో టెస్టులో ఇన్నింగ్స్ 222 పరుగులతో జయభేరి


నోమన్ అలీ

కొలంబో: శ్రీలంక పర్యటనలో పాకిస్తాన్ రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. గురువారం ముగిసిన ఆఖరి టెస్టులో పాక్ ఇన్నింగ్స్ 222 పరుగుల తేడాతో ఆతిథ్య లంకపై గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 563/5తో నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాక్ 134 ఓవర్లలో 576/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రిజ్వాన్ (50 నాటౌట్; 4 ఫోర్లు, 1సిక్స్) అర్ధసెంచరీ పూర్తికాగానే డిక్లేర్ చేసింది. ఆగా సల్మాన్ (132 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. దీంతో పాకిస్తాన్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 410 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 67.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. ఏంజెలో మాథ్యూస్ (63 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ కరుణరత్నే (41; 6 ఫోర్లు) రాణించారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ నోమన్ అలీ (7/70) చావుదెబ్బ తీశాడు. నసీమ్ షాకు 3 వికెట్లు దక్కాయి.

భారత్‌ను ఆదుకున్న నవ్‌నీత్



బార్సిలోనా: స్పెయిన్ హాకీ సమాఖ్య శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మూడు దేశాల అంతర్జాతీయ హాకీ టోర్నీలో భారత మహిళల జట్టు వరుసగా రెండో 'డ్రా' నమోదు చేసింది. ఆతిథ్య స్పెయిన్ జట్టుతో గురువారం జరిగిన మ్యాచ్‌ను భారత జట్టు 2-2 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (14వ, 29వ ని.లో) రెండు గోల్స్ చేసి జట్టును ఆదుకుంది. స్పెయిన్ తరఫున జంటాల్ జిని (13వ ని.లో), లయా విదోసా (26వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

టి20 ప్రపంచకప్‌కు ఐర్లాండ్

ఎడిన్‌బర్గ్: వచ్చే ఏడాది వెస్టిండీస్-అమెరికాలో జరిగే టి20 ప్రపంచకప్‌కు ఐర్లాండ్ అర్హత సంపాదించింది. గురువారం జర్మనీతో జరగాల్సిన క్వాలిఫయింగ్ రౌండ్ మ్యాచ్ వర్షంతో రద్దు కావడంతో ఐర్లాండ్‌కు బెర్త్ లభించింది. ఇదివరకే అర్హత సాధించిన స్కాట్లాండ్‌తో నేడు ఐర్లాండ్ తలపడుతుంది. యూరోపియన్ రీజినల్ నుంచి రెండు బెర్త్‌లు ఉండగా... స్కాట్లాండ్, ఐర్లాండ్, ఇటలీ, జర్మనీ, జెర్సీ, డెన్మార్క్, ఆస్ట్రియా క్వాలిఫయర్స్‌లో తలపడ్డాయి. స్కాట్లాండ్ (10 పాయింట్లు), ఐర్లాండ్ (8 పాయింట్లు) రెండు స్థానాల్లో నిలిచి అర్హత పొందాయి.

సులువైన లక్ష్యాన్ని కష్టంగా...

వన్డే వరల్డ్‌కప్‌కు అర్హత సాధించలేకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదని వెస్టిండీస్ నిరూపించింది. 'అంచనాలకు తగినట్లుగా' సాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కూడా కనబర్చలేక టీమ్ కుప్పకూలింది. టి20 మ్యాచ్‌కు మించి ఆడటం తమ వల్ల కాదన్నట్లుగా 23 ఓవర్లకే ఇన్నింగ్స్ ముగించింది. మొదటి మూడు వికెట్లు తీసి పేసర్లు శుభారంభం చేస్తే తర్వాతి 7 వికెట్లతో స్పిన్నర్లు కుల్దీప్, జడేజా పండుగ చేసుకున్నారు. అయితే టీమిండియాకు విజయం సులువుగా దక్కలేదు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఐదు వికెట్లు కోల్పోయి చివరకు గెలుపు సొంతం చేసుకుంది. రోహిత్, కోహ్లి తమ స్థానాల్లో ఆడకుండా ఇతర బ్యాటర్లను ముందుగా పంపగా... అది ఆశించిన ఫలితం ఇవ్వలేదు.

- తొలి వన్డేలో భారత్ విజయం
- 5 వికెట్లతో ఓడిన వెస్టిండీస్
- ఇషాన్ కిషన్ అర్ధ సెంచరీ
- జడేజా, కుల్దీప్ మాయాజాలం


రోహిత్
జడేజా


కుల్దీప్

ట్రినిడాడ్: వెస్టిండీస్‌పై టెస్టు సిరీస్‌ను అలవోకగా గెలుచుకున్న భారత జట్టు వన్డేల్లోనూ తమ స్థాయిని ప్రదర్శించింది. గురువారం ఏకపక్షంగా సాగిన తొలి వన్డేలో భారత్ ఐదు వికెట్ల తేడాతో విండీస్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 23 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ షై హోప్ (45 బంతుల్లో 43; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ యాదవ్ 6 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టగా, రవీంద్ర జడేజాకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 22.5 ఓవర్లలో 5 వికెట్లకు 118 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే శనివారం ఇదే మైదానంలో జరుగుతుంది.

టపటపా...

వన్డేల్లో తమ జట్టు బలహీనతను మరోసారి ప్రదర్శిస్తూ వెస్టిండీస్ కుప్పకూలింది. కెప్టెన్ హోప్ కొంత పోరాడగలిగినా... మిగతావారంతా ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. హార్దిక్ తన రెండో ఓవర్లోనే కైల్ మేయర్స్ (2)ను అవుట్ చేసి భారత్‌కు సరైన ఆరంభం అందించాడు. హార్దిక్ ఓవర్లో వరుస బంతుల్లో సిక్స్, ఫోర్... శార్దుల్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టి అలిక్ అతనజ్ (18 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడు ప్రదర్శించే ప్రయత్నం చేసినా అది ఎక్కువ సేపు సాగలేదు. జడేజా చక్కటి క్యాచ్‌తో అతను వెనుదిరిగాడు. ముకేశ్‌కు ఇది తొలి వికెట్ కావడం విశేషం. మరో మూడో బంతులకే బ్రెండన్ కింగ్ (17)ను శార్దుల్ అవుట్ చేయడంతో స్కోరు 45/3కి చేరింది. ఈ దశలో హోప్ కొన్ని చక్కటి షాట్లతో కాస్త పట్టుదల కనబర్చాడు. అయితే మరో ఎండ్‌లో 8 పరుగుల వ్యవధిలో హెట్‌మైర్ (11), రావ్‌మన్ పావెల్ (4), షెఫర్డ్ (0) వెనుదిరగడంతో విండీస్ కోలుకోలేకపోయింది. తర్వాతి నాలుగు వికెట్లూ కుల్దీప్ ఖాతాలోకే వెళ్లాయి. తన తొలి, రెండో ఓవర్లో ఒక్కో వికెట్ తీసిన అతను మూడో ఓవర్లో మరో రెండు వికెట్లతో ప్రత్యర్థి ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు. వెస్టిండీస్ తరఫున 1972–79 మధ్య 12 టెస్టులు ఆడి 29 వికెట్లు తీసిన లెఫ్టార్మ్ స్పిన్నర్ రఫీక్ జుమాదిన్ గురువారం మరణించడంతో సంతాప సూచకంగా విండీస్ ఆటగాళ్లు భుజానికి నల్ల బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు.

తడబడినా...

ఛేదనలో భారత్ ఇన్నింగ్స్ అలవోకగా సాగలేదు. రోహిత్ శర్మ కాకుండా కిషన్, గిల్ (7) ఓపెనర్లుగా బరిలోకి దిగారు. గిల్ విఫలం కాగా, మూడో స్థానంలో సూర్యకుమార్ యాదవ్ (19) కూడా అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయాడు. ప్రమోట్ అయిన హార్దిక్ పాండ్యా (5) రనౌట్ కాగా, మరో ఎండ్‌లో ఇషాన్ మాత్రం నిలకడగా ఆడుతూ 44 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఆ వెంటనే ఇషాన్‌తో పాటు శార్దుల్ (1) వెనుదిరగడంతో రోహిత్ (12 నాటౌట్) క్రీజ్‌లోకి రాక తప్పలేదు. ఆపై మరో వికెట్ పడకుండా జడేజా (16 నాటౌట్)తో రోహిత్ మ్యాచ్‌ను ముగించడంతో కోహ్లి బ్యాటింగ్‌కు రావాల్సిన అవసరం లేకపోయింది.

2 విండీస్‌కు భారత్‌పై వన్డేల్లో ఇది రెండో అత్యల్ప స్కోరు. 2018లో 104 పరుగులకు ఆలౌటైంది. ఆలౌట్ అయిన సందర్భాల్లో ఎదుర్కొన్న బంతులపరంగా కూడా విండీస్‌కు ఇది రెండో చెత్త ప్రదర్శన. 2011లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో 22 ఓవర్లకే ఆ జట్టు కుప్పకూలింది.

ముకేశ్ @ 251

వెస్టిండీస్‌తో రెండో టెస్టుతో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన పేస్ బౌలర్ ముకేశ్ కుమార్‌కు ఇదే టూర్‌లో వన్డే అవకాశం కూడా దక్కింది. గురువారం మ్యాచ్‌తో అతను వన్డేల్లో అరంగేట్రం చేశాడు. భారత్ తరఫున వన్డేలు ఆడిన 251వ ఆటగాడిగా ముకేశ్ నిలిచాడు.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (బి) శార్దుల్ 17; మేయర్స్ (సి) రోహిత్ (బి) హార్దిక్ 2; అతనజ్ (సి) జడేజా (బి) ముకేశ్ 22; హోప్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 43; హెట్‌మైర్ (బి) జడేజా 11; పావెల్ (సి) గిల్ (బి) జడేజా 4; షెఫర్డ్ (సి) కోహ్లి (బి) జడేజా 0; డ్రేక్స్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 3; కారియా (ఎల్బీ) (బి) కుల్దీప్ 3; మోతీ (నాటౌట్) 0; సీల్స్ (సి) హార్దిక్ (బి) కుల్దీప్ 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (23 ఓవర్లలో ఆలౌట్)** 114. **వికెట్ల పతనం:** 1-7, 2-45, 3-45, 4-88, 5-96, 6-96, 7-99, 8-107, 9-114, 10-114. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 3-0-17-1, ముకేశ్ 5-1-22-1, శార్దుల్ 3-1-14-1, జడేజా 6-0-37-3, ఉమ్రాన్ 3-0-17-0, కుల్దీప్ యాదవ్ 3-2-6-4.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) పావెల్ (బి) మోతీ 52; గిల్ (సి) కింగ్ (బి) సీల్స్ 7; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) మోతీ 19; హార్దిక్ (రనౌట్) 5; జడేజా (నాటౌట్) 16; శార్దుల్ (సి) అతనజ్ (బి) కారియా 1; రోహిత్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (22.5 ఓవర్లలో 5 వికెట్లకు)** 118. **వికెట్ల పతనం:** 1-18, 2-54, 3-70, 4-94, 5-97. **బౌలింగ్:** డ్రేక్స్ 4-0-19-0, సీల్స్ 4-0-21-1, మేయర్స్ 1-0-6-0, షెఫర్డ్ 1-0-2-0, మోతీ 6.5-0- 26-2, కారియా 5-0-35-1, అతనజ్ 1-0-7-0.

ఇంగ్లండ్ 283 ఆలౌట్


బ్రూక్

లండన్: ఆస్ట్రేలియాతో గురువారం మొదలైన యాషెస్ సిరీస్ చివరిదైన ఐదో టెస్టును ఇంగ్లండ్ అదే దూకుడుతో ప్రారంభించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 54.4 ఓవర్లలో 283 పరుగుల వద్ద ఆలౌటైంది. ఇంగ్లండ్ జట్టులో ఓపెనర్లు డకెట్ (41; 3 ఫోర్లు), జాక్ క్రాలీ (22; 3 ఫోర్లు), మొయిన్ అలీ (34; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), హ్యారీ బ్రూక్ (91 బంతుల్లో 85; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నారు. ఆసీస్ పేస్ బౌలర్ స్టార్క్ (4/82) రాణించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 61 పరుగులు చేసింది. వార్నర్ (24) అవుటయ్యాడు.

ఆసియా క్రీడల ఫుట్‌బాల్ 'డ్రా' విడుదల

హాంగ్జౌ (చైనా): ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల ఫుట్‌బాల్ 'డ్రా'ను విడుదల చేశారు. సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత పురుషుల జట్టు గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో చైనా, బంగ్లాదేశ్, మయన్మార్ జట్లున్నాయి. మొత్తం 24 జట్లను ఆరు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూప్ నుంచి రెండేసి జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. అలాగే ఈ ఆరు గ్రూపుల్లో కలిపి మూడో స్థానంలో ఉన్న మెరుగైన నాలుగు జట్లు కూడా ప్రిక్వార్టర్స్ చేరతాయి. భారత మహిళల జట్టు గ్రూప్ 'బి'లో థాయ్‌లాండ్, చైనీస్ తైపీలతో ఆడుతుంది. ఈ విభాగంలో 17 జట్లు బరిలో ఉండగా... ఎ, బి, సి గ్రూపుల్లో మూడు జట్ల చొప్పున... డి, ఇ గ్రూపుల్లో నాలుగేసి జట్లున్నాయి. ఆసియా క్రీడలకు సెప్టెంబర్ 23న తెర లేవనుండగా... ఫుట్‌బాల్ మ్యాచ్‌లు మాత్రం సెప్టెంబర్ 19 నుంచి నిర్వహిస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.